తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

సోమవారం 01.09.2025 | సంపుటి : 12 సంచిక : 43 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగింత

## అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్





- డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు: మంత్రి ఉత్తమ్
- రూ.లక్ష కోట్ల ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది
- నిజాలు చెప్పలేక హరీశ్ కుంగిపోతున్నారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రాజెక్టుపై శాసనసభలో వాడీ వేడి చర్చ..

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి ఆర్థిక అవకతవకలను విచారించడానికి తెలంగాణ కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తు కేసును సీబీఐకి అప్పగించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం అసెంబ్లీలో ప్రకటన చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా తెలంగాణ అసెంబీలో వాడీవేడీగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. ప్రాణహిత–చేవెళ్లలో నీళ్లు అందుబాటులో ఉన్నాయని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చెప్పారని గుర్తు చేశారు.“ హైడ్రాలజీ క్లియ రెన్స్ ఉందని, ప్రాణహిత–చేవెళ్ల కట్టుకోవచ్చని ఆనాడు ఉమాభారతి లేఖలో పేర్కొన్నారు. కానీ, దురాశ, దోపిడీతో మళ్లీ విచారణ చేయాలని భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కోరింది. కేంద్ర రాసిన లేఖను మళ్లీ పరిశీలించాలని అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను కోరారు .ప్రాజెక్టు కట్టుకోవాలని 2009లో కేంద్ర ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు మొత్తం వ్యవస్థల్ని తప్పుదోవపట్టించారని అన్నారు.

మిగతా 2లో..

### కాళేశ్వరం రిపోర్టు వేస్ట్..

**సభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్**

**ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులు చించివేత**

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ సందర్భంగా అధికార కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను భారత రాష్ట్రసమితి ఎమ్మెల్యేలు చించివేశారు. లాబీల్లో

మిగతా 2లో..

### 660 పేజీల నివేదికపై అరగంటలో మాట్లాడమంటే ఎలా?: హరీశ్ రావు

2లో..

### మ్యాచ్ ఫిక్సింగ్‌లా అనిపిస్తోంది

2లో..

**కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఆదేశించిన తీరు చూస్తే అదే అనుమానం కలుగుతోంది**

**భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**



### మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు సభ ఆమోదం

- 42 శాతం పక్కాగా బీసీలకే అమలు చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్
- బీసీలు అంచెలంచెలుగా ఎదగాలి మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్(జనంసాక్షి): మున్సిపల్, పంచా యతీరాజ్ చట్టసవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశముంది. తొలుత మున్సిపల్, తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టి చర్చించారు. అనంతరం ఆ బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

మిగతా 2లో..

# 42% బీసీ రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

## గత ప్రభుత్వంలో తెచ్చిన చట్టమే గుదిబండగా మారింది: సీఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి): విద్య, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం రెండు బిల్లులను గతంలో తాము అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.గవర్నర్ వాటిని ఆమోదిం చకుండా రాష్ట్రపతికి పంపించారన్నా రు. సుమారు 5 నెలల నుంచి ఆ బిల్లులు రాష్ట్రపతి వద్ద ఉన్నాయని చెప్పారు. మున్సిపల్ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు.“స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యాయని కొందరు హైకోర్టుకు వెళ్లారు. ఈక్రమంలో సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వ హించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. రిజర్వేషన్లను కూడా నిర్ధరించాలని తెలిపింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం.. ఉన్న పరిస్థితులు, చట్టాలను పరిశీలించాం. 2018 లో కేసీఆర్ పంచాయతీరాజ్ చట్టం తెచ్చారు. అందులో 50 % రిజర్వేషన్ల పరిమితికి లోబడి మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని ఉంది. 2019లో తెచ్చిన మున్సిపల్‌చట్టంలోనూ ఇదే

మిగతా 2లో..

### బీసీ బిల్లులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు: కేటీఆర్

2లో..

### కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సభలో చర్చ జరగాలి

**భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్**

# కలిసి నడుద్దాం

**భారత్- చైనా ప్రత్యర్థులు కాదు .. అభివృద్ధి భాగస్వాములు**

**సరిహద్దు సమస్యకు కట్టుబడి ఉన్నాం • మోదీ -జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు**



**డ్రాగన్, ఏనుగు ఒక్కటవ్వాలి.. దానికి ఇదే సరైన సమయం : జిన్‌పింగ్**

**భారత్- చైనా సంబంధాలు పాజిటివ్ డైరెక్షన్‌లో ఉన్నాయి: మోదీ**

బీజింగ్(జనంసాక్షి):పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు తీసుకెళ్లడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు స్పష్టం చేశారు. సరి హద్దు నిర్వహణపై కూడా భారత్, చైనా ప్రత్యేక ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం ఉం దని మోదీ స్పష్టం చేశారు. గతేడాది కజాన్‌లో జరి గిన చర్చల తర్వాత భారత్, చైనా సరిహ ద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొంది అని పేర్కొ న్నారు. గల్వాన్ ఘర్షణల తరువాత భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరిం చడానికి ఇరువురు నేతలు విస్తృత చర్చలు జరిపిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తరువాత షాంఘై సహకారం సంస్థ (ఎస్‌సీఓ)కు చైనా విజయవంతంగా అధ్యక్షత వహించినందుకు జిన్‌పింగ్‌కు అభినందనలు తెలిపారు.షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు కోసం భారత ప్రధాని మోదీ చైనాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సంద ర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు.ఇరుదేశాల మధ్య సంబంధాలపై మా ట్లాడారు. ఈ క్రమంలో జిన్‌పింగ్ మాట్లా డుతూ.. భారత్– చైనా స్నేహంగా ఉండటం సరైన నిర్ణయమన్నారు. ప్రధాని మోదీని మరోసారి కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందంటూ.. ఎస్‌సీవో సదస్సుకు జిన్‌పింగ్

మిగతా 2లో..

> మన రెండు దేశాల ప్రజల శ్రేయస్సును మెరుగుపరచడం, అభివృద్ధి చెందుతున్న దేశాల సంఘీభావంగా నిలవడం, వాటి పునరుజ్జీవనాన్ని ప్రోత్సహించడం, మానవ సమాజ పురోగతిని ప్రోత్సహించడం అనే చారిత్రక బాధ్యతను మనమిద్దరం భుజాలపై వేసుకున్నాం. రెండు దేశాలు మంచి పొరుగు, స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉన్న స్నేహితులుగా, ఒకరికొకరు విజయానికి దోహదపడే భాగస్వాములుగా, డ్రాగన్ ఏనుగు కలిసి రావడానికి ఇదే సరైన సమయం
> – షీ జిన్ పింగ్, చైనా అధ్యక్షుడు

> రెండు దేశాల సంబంధాలు పాజిటివ్ డైరెక్షన్‌లో వెళ్తున్నాయి. భారత్–చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొంది. ఇటీవలే కైలాశ్ మానసరవోర్ యాత్ర కూడా పునఃప్రారంభమైంది. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు కూడా నడుస్తున్నాయి. భారత్–చైనా సత్సంబంధాలు 2.8 బిలియన్ల ప్రజలకు ప్రయోజనాన్ని చేకూరుస్తాయి.
> – భారత ప్రధాని మోదీ

# జస్టిస్ సుదర్శన్ రెడ్డికి హైదరాబాద్‌లో ఘన స్వాగతం



- నేడు పలు వేదికలపై ప్రసంగించనున్న జస్టిస్ బీఎస్ రెడ్డి
- రాష్ట్ర ఎంపీలతో భేటీ అయ్యే అవకాశం
- తెలంగాణ పౌర సమాజం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మీట్ ది ప్రెస్ కార్యక్రమం



హైదరాబాద్, ఆగస్ట్ 31 (జనంసాక్షి) :

ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. న్యూఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో పర్యటించి తన అభ్యర్థిత్వానికి మద్దతు పలకాలని కోరిన ఆయన.. ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో ఎంపీ మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, అనిల్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీం తదితరులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. నేడు మధ్యాహ్నం 12 గంటలకు బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణలో ప్రెస్‌మీట్ ఉంటుందని తెలిపారు. అదే విధంగా సాయంత్రం 5 గంటలకు టీయూడబ్ల్యూ (ఐజేయూ) మీట్ ది ప్రెస్‌కు జస్టిస్ సుదర్శన్ రెడ్డి హాజరుకానున్నారు. అదేవిధంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం

మిగతా 2లో..

# మాకొద్దీ అమెరికా..

**2001 తర్వాత అగ్రరాజ్యానికి అత్యల్ప సంఖ్యలో భారతీయులు**





న్యూఢిల్లీ(జనంసాక్షి):దాదాపు పాతికేళ్ల తర్వాత తొలిసారి అమెరికాకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అమెరికా అధ్య క్షుడిగా ట్రంప్ రాకతో వీసాలు కష్టతరంగా మారడం.. ఇరు దేశాల సంబంధాలు దెబ్బతినడం వంటి కారణాలతో ఈ పరిస్థితి తలెత్తిందని భావి స్తున్నారు. అమెరికా కామర్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన నేషనల్ ట్రావెల్ అండ్ టూరిజం డేటా ప్రకారం ఈ ఏడాది జూన్‌లో 2.1 లక్షల మంది భారతీయులు అమెరికాను సందర్శించారు. కానీ, గతేడాది ఇదే నెలలో ఈ సంఖ్య 2.3 లక్షలుగా ఉంది. 8 శాతం తగ్గుదల నమోదైంది. ఇక జులైలో కూడా గతేడాదితో పోలిస్తే 5.5శాతం తగ్గుదల నమోదైంది. కేవలం భారత్ నుంచే కా కుండా.. మొత్తంగా అమెరికాకు అంతర్జాతీయ ప్రయాణికుల రాక కూడా తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం సందర్శకుల్లో అమెరి కాయేతర పౌరల రాక జూన్‌లో గతేడాదితో పోలిస్తే 6.2 శాతం తగ్గింది. ఇక మేలో 7 శా తం, మార్చిలో 8 శాతం, ఫిబ్రవరిలో 1.9 శాతం పడిపోయింది. ఈ ఏడాది జనవరిలో మాత్రమే అమెరికాకు అంతర్జాతీయ సందర్శకుల సంఖ్య 4.7 శాతం, ఏప్రిల్‌లో 0.7 శాతం పెరిగింది. అమెరికా అంతర్జాతీయ పర్యటకుల మార్కెట్‌కు భారత్ నాలుగో అతిపెద్ద సోర్స్‌గా నిలిచింది. ఇక మెక్సికో, కెనడా అమెరికాతో భూ సరిహద్దును పంచుకొంటున్న దేశాలతో

మిగతా 2లో..

# భారత్‌ను లక్ష్యంగా చేసుకోండి..

- యూరప్ దేశాలను కోరిన వైట్‌హౌస్..!
- భారత్‌ను చిన్నపిల్లాడనుకున్నారు..
- ట్రంప్ ఆలోచనా తీరు సరికాదు
- యూఎస్ రాజకీయ విశ్లేషకుడు, జర్నలిస్టు రిక్ సాంచెజ్ విమర్శలు

వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ క్రమంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను వైట్‌హౌస్ కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే.. యూఎస్‌లాగానే భారత్‌పై ద్వితీయ సుంకాలను విధించాలని ట్రంప్ యంత్రాంగం కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మిగతా 2లో..

### యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ‘ప్రతిభా సేతు’

**మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ‘ప్రతిభా సేతు’ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. దీని ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నట్లు మన్‌కీ బాత్ 125వ కార్యక్రమంలో మోదీ తెలిపారు. దేశంలోని కఠినమైన పరీక్షల్లో సివిల్ సర్వీసెస్ ఒకటని.. ప్రతి ఏడాది ఎంతో మంది అభ్యర్థులు రాస్తుంటారన్నారు. ఎంతో సమయం, డబ్బును ఖర్చు చేసి నిజాయతీగా కష్టపడుతున్న అభ్యర్థులు ఒక్కోసారి స్వల్ప తేడాతో సివిల్స్ తుది జాబితాలో చోటు దక్కించుకోలేకపోతున్నారని.. ఇలాంటి వారి కోసం ‘ప్రతిభా సేతు’ పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. సివిల్స్

మిగతా 2లో..

# అమెరికాకు అన్నిరకాల పోస్టల్ సేవలు నిలిపివేత

- భారత తపాలాశాఖ కీలక నిర్ణయం
- ఇదే బాటలో పలు దేశాలు




న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రతీకార సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికాపై భారత్ సహా పలు దేశాలు పోస్టల్ సర్వీసులు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత తపాలాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా కస్టమ్స్ విభాగం జారీ చేసిన కొత్త నిబంధనల్లో స్పష్టత లేకపోవడంతో అన్ని రకాల పోస్టల్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఇండియా పోస్ట్ వెల్లడించింది. 100 డాలర్ల వరకూ విలువవున్న బహుమతులు, లేఖలు, డాక్యుమెంట్ల సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఇటీవల ప్రకటించగా.. తాజాగా అవి కూడా నిలిచిపోనున్నాయి. పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా వీటిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని

మిగతా 2లో..

# కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగింత

వాస్తవాలను బయటపెట్టారనే జస్టిస్ ఘోష్ కమిషన్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. తెలంగాణ సమాజాన్ని తప్పు దోవ పట్టించేలా హరీశ్‌రావు మాట్లాడుతున్నారు. ఏ విచారణ కావాలో చెప్పకుండా సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. తప్పుడు సమాచారాన్ని హరీశ్‌రావు పదే పదే చెబుతున్నారు. ఆయన వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలి. నీళ్లు అందుబాటులో ఉన్నాయని 2009, 2014లో లేఖలు రాశారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు ఉన్నాయని చెప్పినా మీరెందుకు వినలేదు. మహారాష్ట్రతో చర్చ జరిగింది ప్రాజెక్టు ఎత్తు గురించే. ముంపు ప్రాంతం తగ్గుతుందనే ఎత్తు తగ్గించుకోవాలని మహారాష్ట్ర కోరింది. తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లు దోచుకునేందుకే ఇలా చేశారు. కేసీఆర్‌కు నిజాం కంటే శ్రీమంతుడు కావాలని దుశార కలిగిందేమో. మేడిగడ్డ వద్దే కట్టాలని అప్పటికే కేసీఆర్, హరీశ్‌రావు నిర్ణయం తీసుకున్నారు" అని సీఎం అన్నారు. కేంద్ర మంత్రి ఉమా భారతి రాసిన లేఖలో మొదటి పేజీ మాత్రమే చదివారు.. 3వ పేజీ చదవకుండా సీఎం రేవంత్‌రెడ్డి సభను తప్పుదోవ పట్టించారని హరీశ్‌రావు విమర్శించారు.

**డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు: మంత్రి ఉత్తమ్**

డ్యామ్‌కు, బ్యారేజీకు తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేశారని ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో ఉందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.మేడిగడ్డలో పూర్తి నీరు నిల్వ చేసి కూలిపోయేందుకు కారణమయ్యారని పేర్కొన్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై ఉత్తమ్ కుమర్‌రెడ్డి సభలో చర్చను ప్రారంభించారు ."తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.87,449 కోట్లతో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం. కానీ, మేడిగడ్డ.. సుందిళ్ల, అన్నారం నిరుపయోగంగా మారాయి. ప్రాణహిత-చేవెళ్లకు పేరు మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయలాంటి మేడిగడ్డ దెబ్బతింది. 3 బ్యారేజీలు 20 నెలలుగా నిరుపయోగంగా మారాయి. ప్రాణహిత -చేవెళ్ల డిజైన్లను అప్పటి సీఎం మార్చారని కమిటీ చెప్పింది. మేడిగడ్డలో బ్యారేజీ నిర్మించవద్దని వ్యాప్కోస్ నిపుణులు కూడా చెప్పారు. రూ.38వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టి.. రూ.1.47లక్షల కోట్లతో కాళేశ్వరం మొదలుపెట్టి..రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారు. 2019 నుంచి 2023 వరకు లిఫ్ట్ చేసినవి 162 టీఎంసీలు మాత్రమే.కాళేశ్వరం నుంచి ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేశారు. బ్యారేజీలకు జరిగిన నష్టం రాష్ట్రానికి పెనుభారంగా మారిందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరించారు.

**రూ.లక్ష కోట్ల ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది:భట్టి విక్రమార్క**

రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. కమీషన్లు దండుకునేందుకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచుకుంటూ పోయారని విమర్శించారు.

## 660 పేజీల నివేదికపై అరగంటలో మాట్లాడమంటే ఎలా?

**హైదరాబాద్(జనంసాక్షి):**కాళేశ్వరంపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని హరీశ్‌రావు అన్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసి, మాకు మాట్లాడే అవకాశం ఇవ్వరా?అని ప్రశ్నించారు. 660 పేజీల నివేదికపై అరగంటలోనే అన్నీ మాట్లాడాలంటే ఎలా? ఇది సాధ్యమయ్యే పనేనా?అని అన్నారు. ఘోష్ ఇచ్చిన నివేదికపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడారు. కమిషన్ నివేదికపై రేపు, ఎల్లుండి కూడా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు."నాకు రెండుగంటల సమయం ఇవ్వాలి. మధ్యలో జోక్యం చేసుకోవద్దు. ఆదివారం రోజు సభలో నివేదిక పెట్టారంటేనే వారి ఉద్దేశం అర్థమవుతోంది. కోర్టుకు వెళ్లడం మాకు రజ్యాంగం ఇచ్చిన హక్కు. గతంలో ఇలాంటి విషయాలపై ఇందిరాగాంధీ, అద్వాణీ కూడా కోర్టుకు వెళ్లారు. ఆదరాబాదరాగా ఆదివారం సభలో పెట్టారంటేనే మీ కుట్రలు అర్థమవుతున్నాయి. మీరు చేసిందంతా పొలిటికల్ డ్రామా అని తెలుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగిందా? లేదా? తేలాలి. నిష్పాక్షికంగా జరగకపోతే ఆ కమిషన్ నివేదిక చిత్తుకాగితమని సుప్రీం కోర్టు చెప్పింది.

## కాళేశ్వరం రిపోర్టు వేస్ట్..

భారీగా మార్షల్స్ మోహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో సమావేశం అనంతరం భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలంతా సభ నుంచి బయటకు వచ్చి.. ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. మైక్ కోసం గంటన్నర సేపు ఎదురు చూసినా స్పీకర్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో కాగితాలు చించి విసరడం సభాసంప్రదాయాలకు విరుద్ధమని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సభ నియమాలు, నిబంధనలను భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు పాటించాలని సూచించారు. ఈ నివేదిక ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు.

# 42 % బీసీ రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

ఉంది. ఈ రెండు చట్టాలు గుదిబండగా మారడంతో.. మా ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. వెం టనే ఆ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపించాం. ఆయన దాన్ని కూడా భారత రాష్ట్ర సమితి నేతల మాటలు నమ్మి రాష్ట్రపతికి పంపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లలేదని చెబుతున్నారు. ఐదు సార్లు దీని గురించి ప్రధానికి లేఖ రాశాం. ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఈక్రమంలో ప్రధానిపై ఒత్తిడి తీసుకురావడానికి జంతర్‌మంతర్‌లో ధర్నా చేశాం. 100 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు. రాజ్యసభలో ఉన్న భారత రాష్ట్ర సమితి ఎంపీలు మాత్రం అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. బీసీల గురించి మాట్లాడుతున్న గంగుల కమలాకర్ కూడా రాలేదు. వాళ్ల పార్టీ నాయకుడు బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధంగా లేరు. ఈరోజు కూడా సభలో గందరగోళం సృష్టించి బిల్లు ఆమోదం చెందకుండా ప్రయత్ని స్తున్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను నేరవేర్చేందుకు కృషి చేస్తోంది. వీలైతే సహకరించండి. లేదంటే మళ్లీ ప్రజలు మీకు సరైన గుణపాఠం చెబుతారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సభలో చర్చ జరగాలి - భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్**

హైదరాబాద్(జనంసాక్షి):బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు భాజపా సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. పురపాలక చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ఇవాళ సభలో పెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతిస్తున్నాం. రాష్ట్రంలో బీసీలకు ఉన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలి. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సభలో చర్చ జరగాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలైంది. కామారెడ్డి డిక్లరేషన్ తర్వాత బీసీలంతా ఆశపడ్డారు.మంత్రివర్గంలో బీసీల సంఖ్య ఎంత? బీసీల్లో సమర్థులు లేరా?.. ప్రభుత్వం గుండెపై చేయివేసుకొని చెప్పాలి. మంత్రివర్గంలో, మీరు ఇచ్చిన కార్పొరేషన్లలో బీసీల సంఖ్య ఎంత? ఏడాదికి రూ.20 వేల కోట్లు బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి 22 నెలలైంది. ఆ లెక్కన రూ.40 వేల కోట్లు బీసీలకు రావాల్సి ఉంది. చట్టాలు చేసేముందు న్యాయస్థానాల వైపు కూడా చూడాలి. ఎలాంటి ఇబ్బందులు వచ్చే పరిస్థితి లేకుండా చట్టాలు చేయాలి. ఎక్కడా ఆటంకాలు కలగకుండా బీసీలకు లబ్ధి కలగాలి. షెడ్యూల్ 9లో జోడించిన అంశంపైనా సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వద్దని మేమెక్కడా చెప్పలేదు" అని పాయల్ శంకర్ తెలిపారు.

**అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు మంత్రి పొన్నం లేఖ**

అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. సోమవారం గవర్నర్ వద్దకు రావాలని కోరారు. ఇదే విషయంపై భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలను ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో ఆయన కలిశారు. కేసీఆర్‌కు రాసిన లేఖను వారికి అందజేశారు.

## బీసీ బిల్లులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

హైదరాబాద్(జనంసాక్షి):బీసీ బిల్లులకు బీఆర్ఎస్ సంపూర్ణంగా మద్దతు తెలుపుతోందని కేటీఆర్ తెలిపారు. శాసనస భలో పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. "బీసీల కోసం గతంలో కేసీఆర్ అనేక పోరాటా లు చేశారు. ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పా టు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కోరారు. తెలంగాణ మొట్టమొదటి స్పీకర్‌గా బలహీనవర్గాల బిడ్డ మధుసూదనాచారిని, శాసన మండలి తొలి ఛైర్మన్‌గా స్వామిగౌడ్‌ను నియమించాం. అడ్వకేట్ జనరల్‌గానూ బలహీనవర్గానికి చెందిన బీఎస్ ప్రసాద్‌ను భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం నియమించిందని అన్నారు.

**ప్రాజెక్టు నివేదికను ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందించిన ప్రభుత్వం**

కాళేశ్వరం ప్రాజెక్టుకుపై జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందజేసింది. ప్రధానంగా 3 ఆనకట్టల ప్రణాళిక, నిర్మాణంలో లోపాలు, తప్పిదాలు ఉన్నాయని నివేదిక తేల్చింది.అంచనాల తయారీ, పరిపాలన అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పేర్కొంది. ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతుల్లోనూ లోపాలు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది."నిపుణుల కమిటీ ప్రకారం మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించరాదు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేనందునే మేడిగడ్డ నిర్మించారనడం సహేతుకం కాదు. అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయం ప్రకారమే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లు నిర్మించారు. ఆనకట్టల నిర్మాణానికి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానం సరికాదు. డీపీఆర్ పూర్తిగా పరిశీలించకుండానే అంచనాలు

## మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం

ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ.. ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు బిల్లుకు కూడా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అంతకుముందు బిల్లులపై చర్చ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. బీసీలు అంచెలంచెలుగా ఎదగాలని తమ ప్రభుత్వం కోరుకుంటోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు 42 శాతం రిజర్వేషన్లు తీసుకొని బలపడాలని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని చెప్పారు. బిల్లుకు భాజపా, భారత రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆ పార్టీలో బీసీ నేతకు శాసనసభాపక్ష నేత పదవి ఇస్తారని అనుకున్నామని.. కానీ అలా జరగలేదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిని కూడా బీసీని చేయలేదని ఎద్దేవా చేశారు. 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామన్నారు. 42 శాతం పక్కాగా బీసీలకే అమలు చేస్తామని మంత్రి చెప్పారు.బీసీ బిల్లుకు అసెంబ్లీలో మద్దతు తెలుపుతూ.. కేంద్రంలో ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం వల్లే అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లలేదని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరగాలని కోరుకోవాలి తప్పితే.. వ్యతిరేకంగా ఎందుకు ఆలోచించాలన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు.

ఆమోదించారు.కాంట్రాక్టర్ల లబ్ధికే అంచనాల పెంపు నిబంధనలు సడలించారు. ఏజెన్సీలకు లబ్ది చేకూర్చాలన్న దురుద్దేశంతోనే అంచనాలు సవరించి ఖజానాకు నష్టం చేకూర్చారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ నిర్వహణ సరిగా లేదు. ఆనకట్టల డిజైన్లు, డ్రాయింగ్స్‌లో పూర్తిగా లోపాలున్నాయి. మేడిగడ్డకు సబ్‌స్టాన్షియల్ సర్టిఫికెట్ ఇవ్వడం అక్రమం"అని జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ నివేదికలో పేర్కొంది.

## మ్యాచ్ ఫిక్సింగ్‌లా అనిపిస్తోంది

**హైదరాబాద్(జనంసాక్షి):**కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలపై విమర్శలు గుప్పించారు. "ఇది కాళేశ్వరం కమిషన్ నివేదిక కాదు.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి కలిసి ఇచ్చినట్లు ఉంది. నివేదికలో కేసీఆర్ అవినీతిపై ప్రస్తావన లేకపోవడం అనుమానాలు రేకెత్తిస్తోంది. ఈ కమిషన్ ఎందుకు ఏర్పాటు చేశారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి. విచారణకు ఆదేశించిన తీరు చూస్తే మ్యాచ్ ఫిక్సింగ్‌లా అనిపిస్తోంది. అవినీతి చేసినవారు ఎవరో తేలేవరకు ప్రజలు ఊరుకోరు. ప్రజలు కోరుకునే విధంగా విచారణ చేయించ కపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. అవినీతి చేసిన వారిపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలి. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని మీరే చెప్పారు.. మరి చర్యలేవి? జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక.. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉంది. భారత రాష్ట్ర సమితిపై కాంగ్రెస్‌కు ప్రేమ పెరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్, ఓఆర్ఆర్, కాళేశ్వరం, మిషన్ కాకతీయపై తీసుకున్న చర్యలేంటి? కాళేశ్వరంపై సీబీఐ విచారణ వేస్తారా.. సిట్ విచారణ వేస్తారా? కాళేశ్వరంపై చేసిన జ్యుడీషియల్ విచారణ క్వాష్ అయ్యే పరిస్థితి ఉంది. అవినీతి చేసిన డబ్బును ఎలా తీసుకువస్తారో ప్రభుత్వం చెప్పాలి. భారత రాష్ట్ర సమితితో కాంగ్రెస్‌కు లోపాయికారి ఒప్పందం ఉందని తెలుస్తోంది" అని సభలో విరుచుకుపడ్డారు.

## యూపీఎస్సీ అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు'

పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించి.. మెరిట్ లిస్టులో పేరు లేని అభ్యర్థుల వివరాలను ఇకపై ఈ పోర్టల్‌లో ఉంచనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఈ వివరాలను ప్రైవేట్ కంపెనీలు తీసుకొని.. తమ సంస్థలలో వారికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలపై మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయన్నారు. అనేక రాష్ట్రాల్లో భారీ వరదల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారని.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారన్నారు. తీవ్రంగా శ్రమిస్తున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు భద్రతా దళాలు, సామాజిక కార్యకర్తలు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వినాశకరమైన ప్రకృతి వైపరీత్యాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నప్పటికీ.. అనేక విషయాల్లో ముందుకు వెళు ్తుందన్నారు. ఇటీవల శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో నిర్వహించిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ గురించి మోదీ ప్రస్తావించారు. దేశ్యాప్తంగా 800 మందికి పైగా అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారన్నారు. పురుషులతో సమానంగా మహిళా అథ్లెట్లు కూడా ఇందులో ప్రతిభ చూపారన్నారు.

## మాకోద్దీ అమెరికా..

పోటీ పడుతోంది. అయితే.. అమెరికా పర్యాటక రంగం దిగ్గజాలు మాత్రం ట్రంప్ ప్రతిపాదించిన కఠిన వీసా నిబంధనలను ఇప్పుడే తప్పు పట్టడం తొందర పాటవుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ, ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం అనుమానించాల్సిందేనని చెబుతున్నారు. అమెరికాలో 50 లక్షల మంది భారతీయులు ఉంటున్నారు. గణాంకాల ప్రకారం 2000 సంవత్సరం తర్వాత నుంచి 2025 వరకు జూన్‌లో భారత్ సందర్శకుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ సారి మాత్రమే తగ్గుదల నమోదైంది. ముఖ్యంగా విద్యార్థి విభాగం వీసాల్లో తగ్గుదల భారీగా ఉన్నట్లు ట్రావెల్ సంస్థలు చెబుతున్నాయి. వీటికి జాప్యాలే కారణమంటున్నాయి. ఇక విద్యార్థులే కాకుండా భారత్ నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు తమ మిత్రులు, కుటుంబ సభ్యులను కలిసేందుకు, వ్యాపారం నిమిత్తం అమెరికాకు వస్తుంటారు. భారతీయులు సెలవులు గడపడానికి ఇష్టపడే దేశాల్లో అమెరికా అగ్రస్థానంలో లేదు. ఆగ్నేయాసియా, మధ్య ఆసియా, ఐరోపా తర్వాత నార్త్ అమెరికా ఉంది.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డికి హైదరాబాద్‌లో ఘన స్వాగతం

11 గంటలకు మౌనం వీడుదాం.. మన బిడ్డకు అండగా గొంతు విప్పుదాం అనే అంశంపై తెలంగాణ పౌర సమాజం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ జరగనుంది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ జడ్జీలు, న్యాయవాదులు, పౌర హక్కుల నేతలు, పాత్రికేయులు హాజరుకానున్నారు. ఈ రౌండ్‌టేబుల్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎంపీలు నిలవాల్సిన అవసరముందని ప్రముఖులు ప్రసంగించనున్నారు.

**తెలుగు ప్రతిష్టను పెంచే చారిత్రక అవకాశం**

త్వరలో జరగబోయే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి అన్ని పార్టీల ఎంపీలు మద్దతు ఇవ్వాలని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏ.పీ.జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం న్యూఢిల్లీలో ఆయన, ఉపరాష్ట్రపతి పదవికి ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విషెస్ తెలిపారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి దేశ సమగ్రత, రాజ్యాంగ విలువలకు అచంచలంగా కట్టుబడిన వ్యక్తి అని కొనియాడారు. న్యాయరంగంలో ఆయన ఇచ్చిన కీలక తీర్పులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చూపిన తపన, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల ఆయన నిబద్ధత అందరికీ ఆదర్శమని అన్నారు. కాబట్టి పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇది తెలుగువారి ప్రతిష్టను దేశ రాజధానిలో పెంచే చారిత్రక అవకాశం అని అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి విజయం సాధిస్తే, ఢిల్లీలో తెలుగు ప్రజల గౌరవం, ప్రతిష్ట మరింత పెరుగుతుందని, తెలుగు ఎంపీలందరూ ఆయనకే మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిష్పాక్షిక దృక్పథం, న్యాయశాస్త్రంలో అపారమైన అనుభవం, రాజ్యాంగం పట్ల అచంచలమైన నిబద్ధతతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతి పదవికి గౌరవాన్ని తీసుకువస్తారని చెప్పారు. ఆయన విజయం తెలుగువారికి గర్వకారణం అవుతుందని పేర్కొన్నారు. ఈ భేటీలో జితేందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత ఎంపీ మల్లు రవి తదితరులు ఉన్నారు.

జిన్‌పింగ్‌తో భేటీ..

## ఉగ్రవాదం అంశాన్ని లేవనెత్తిన ప్రధాని మోదీ

**బీజింగ్(జనంసాక్షి):**చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చల సందర్భంగా ప్రధాని మోదీ సీమాంతర ఉగ్రవాద సమస్యను లేవనెత్తినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు.భారత్, చైనాల దీర్ఘకాలిక అభివృద్ధి కోసం ఇరుదేశాల నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు చెప్పారు. మోదీ, జిన్‌పింగ్ చర్చల వివరాలను మిస్రీ ఈ మేరకు మీడి యాకు వెల్లడించారు. ద్వైపాక్షిక సంబంధాల విషయంలో ఇరు దేశాధినేతలు తమ తమ సూత్రాలను ప్రస్తావించారని, భవిష్యత్ కార్యకలాపాలకు ఇవి మార్గనిర్దేశం చేస్తాయన్నారు. స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు ఇరుదేశాల్లోని 2.8 బిలియన్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయనే ఏకాభిప్రాయానికి వచ్చినట్లు చెప్పారు."ప్రధాని మోదీతో చర్చల సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరిచేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పలు సూచనలు చేశారు. సంబంధాలు సజావుగా కొనసాగాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అవసరమని ప్రధాని మోదీ సైతం స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు ఒకరికొకరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇరుదేశాల మధ్య విభేదాలు వివాదాలుగా మారేందుకు అవకాశం ఇవ్వకూడదని నేతలు అంగీకరించారు" అని మిస్రీ వెల్లడించారు.

## అమెరికాకు అన్నిరకాల పోస్టల్ సేవలు నిలిపివేత

కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే బుకింగ్ చేసిన పార్శిళ్లు చేరని పక్షంలో.. పోస్టల్ ఛార్జీలను కస్టమర్లకు తిరిగి చెల్లిస్తామని వెల్లడించింది. జులై 30వ తేదీన ట్రంప్ యంత్రాంగం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ఆగస్టు 29వ తేదీ నుంచి 100 డాలర్లకుపైగా విలువున్న పార్శిళ్లపై అమెరికా కస్టమ్స్ సుంకాలు అమల్లోకి వచ్చాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం అంతర్జాతీయ పోస్టల్ నెట్‌వర్క్, అమెరికా కస్టమ్స్, సరిహద్దు రక్షణ (సీబీపీ) విభాగం ఆమోదించిన 'క్వాలిఫైడ్ పార్టీ'ల ద్వారా వస్తువులను రవాణాచేసే సంస్థలే సుంకాలు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.అయితే, ఇందుకు ఎలాంటి విధానాన్ని అనుసరించాలన్న దానిపై పూర్తి స్థాయి స్పష్టత లేకపోవడంతో అమెరికాకు విమానాలను నడిపే సంస్థలు తపాలా పార్శిళ్లను స్వీకరించడానికి నిరాకరించాయి. దీంతో పార్శిళ్ల బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది. ఇదే కారణంతో దాదాపు 25 దేశాలు కూడా అమెరికాకు పోస్టల్ సర్వీసులను నిలిపివేశాయి.

# భారత్‌ను లక్ష్యంగా చేసుకోండి..

ఆంక్షలు విధించడంతో పాటు ఆ దేశం నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును నిలిపివేయాలని కూడా కోరినట్లు వెల్లడించాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ అయిన సంగతి తెలిసిందే. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంతమంది యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు తెలుస్తోంది. భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మౌనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనార్హం. ఇదిలా ఉండగా.. భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు. అక్కడ జరిగే 'షాంఘై సహకార సంస్థ' (ఎస్‌సీవో) వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొననున్నారు. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలు, ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం వంటి కీలక విషయాలపై ఈ సదస్సులో చర్చకు వచ్చే అవకాశం ఉంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా మోదీ సమావేశం కానున్నారు.

**భారత్‌ను చిన్నపిల్లాడనుకున్నారు..**

భారత్‌పై సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలను యూఎస్ రాజకీయ విశ్లేషకుడు, జర్నలిస్టు రిక్ సాంచెజ్ తప్పుబట్టారు. రష్యా నుంచి చమురు



కొనుగోలు చేస్తుందనే కారణంతో భారత్‌పై అధిక సుంకాలు విధించడం అజ్ఞానమే అవుతుందన్నారు. అమెరికా అధ్యక్షుడు కొన్ని విషయాల్లో దూరదృష్టితో ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుంటారని.. కానీ వాటినే తెలివైన నిర్ణయాలు అనుకుంటారని మండిపడ్డారు. స్కూల్‌కు వెళ్లే చిన్న పిల్లాడిలా భారత్‌ను భావించి.. తాను ఏది చెప్పినా ఆ దేశం వింటుందని ట్రంప్ అనుకుంటున్నారని రిక్ సాంచెజ్ ఎద్దేవా చేశారు. కానీ భారత్ పరిణతి చెందిన యువకుడిలాంటిదని.. తమ దేశాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలో దానికి తెలుసన్నారు.తాము ఎవరి నుంచి చమురు కొనాలో వద్దో అమెరికా చెప్పాల్సిన అవసరం లేదని భారత్ స్పష్టం చేసిందని.. దీని వల్ల ప్రపంచ పరిస్థితులు మారే అవకాశం ఉందని రిక్ సాంచెజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాల వల్ల అమెరికా తన పతనాన్ని కోరి తెచ్చుకుంటుందన్నారు. అదనపు సుంకాలు విధించడాన్ని యూఎస్ ప్రజలు సైతం వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రపంచ దేశాలపై అమెరికా విధిస్తున్న భారీ సుంకాల వల్ల భారత్, చైనా, రష్యా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాలు ఏకమై అగ్రరాజ్యానికి ఎదురు నిలిచే ప్రమాదముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం లేదని భారత్ స్పష్టం చేస్తున్నప్పటికీ.. దానికి తానే కారణమని ట్రంప్ పదే పదే ప్రచారం చేసుకోవడం సరైన చర్య కాదన్నారు. పాక్‌తో జరిగిన కాల్పుల విరమణతో ట్రంప్‌నకు ఎలాంటి సంబంధంలేదని భారత్ తేల్చిచెప్పడంతో.. వ్యక్తిగత ద్వేషంతోనే అమెరికా అధ్యక్షుడు అధిక సుంకాలు విధిస్తున్నారని రిక్ సాంచెజ్ పేర్కొన్నారు. గతంలోనూ పలు విషయాల్లో ఆయన ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

# కలిసి నడుద్దాం

ఆహ్వానం పలికారు. గతేడాది కజన్‌లో ఇరువురి నేతల మధ్య జరిగిన భేటీని జిన్‌పింగ్ గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలు.. గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులని పేర్కొన్నారు. ఇరు దేశాల్లోని ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంబంధాల పునరుద్ధరణ బాధ్యతను తాము భుజాన వేసుకున్నామన్నారు. పొరుగు దేశాలుగా తమ మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల విజయాలకు దోహదపడే అంశాల్లో.. డ్రాగన్, ఏనుగు కలిసి రావడం సరైన ఎంపికన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షికంగా స్థిర, దృఢమైన సంబంధాలు దీర్ఘకాలం కొనసాగేలా చూసుకోవాలన్నారు. ప్రపంచంలో శాంతి, శ్రేయస్సు కోసం భారత్- చైనాలు బాధ్యతను తీసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అంతకు ముందు ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. ఇరుదేశాల సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొన్నాయని, కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైందని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇరుదేశాల మధ్య సహకారంతో దాదాపు 2.8 బిలియన్ల మంది ప్రజల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు.

**భారత్- చైనా సంబంధాలు పాజిటివ్ డైరెక్షన్‌లో ఉన్నాయి: మోదీ**

దాదాపు ఏడేళ్ల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో పర్యటిస్తున్నారు. తియాజింగ్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు.దీనికి ముందు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యారు. అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో వీరి భేటీ ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. గతేడాది రష్యాలోని కజన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో జరిగిన సమావేశం గురించి ఆయన ఇక్కడ ప్రస్తావించారు. నాడు తమ భేటీ ఇరుదేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు బాటలు వేసిందన్నారు. భారత్- చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొందన్నారు. కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైన విషయాన్ని గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇరుదేశాల మధ్య సహకారంతో దాదాపు 2.8 బిలియన్ల మంది ప్రజల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. పరస్పర విశ్వాసం, గౌరవంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు ముందుకు తీసుకెళ్లేందుకు నిశ్చయించుకున్నామన్నారు. ఈ సందర్భంగా చైనాలో పర్యటించేందుకు, ఎస్‌సీవో సదస్సుకు తనను ఆహ్వానించినందుకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు.ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించే అంశంపై సైనిక, దౌత్యాధికారుల మధ్య పలు దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ట్రంప్ సుంకాలను ఖండించిన డ్రాగన్.. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది.





# ఆదివారం హాస్పిటల్‌కు సెలవు

**రోగులకు అందని వైద్య సేవలు**

**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 31 ( జనం సాక్షి) :** ప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి హాస్పిటల్ నిర్మించి, ఉద్యోగులకు వేతనాలు ఖర్చు చేస్తుంది. కానీ ఇప్పటికీ వైద్య సిబ్బంది నామ మాత్రంగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా వచ్చామా..?వెళ్ళామా.. అన్నసందంగా వైద్య సిబ్బంది వ్యవహరిస్తున్నారు. కొమరం భీమ్ ఆసిఫా జిల్లా కాగజ్ నగర్ మండలంలోని ఇస్గాం ( విలేజ్ నెంబర్ 12) లో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు ఆదివారం సెలవుదినంగా కనిపించింది. ఉదయం 11 గంటల సైతం ఆస్పత్రి తెరుచుకోలేదు. అసలే వర్షాకాలం.. ఆపై రోగాల సీజన్. అత్యవసరంగా రోగులు ఎవరైనా ఆసుపత్రికి వస్తే.. పరిస్థితి ఏంటి..? ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఆస్పత్రిలో డాక్టర్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ ఉండి సేవలు అందించాల్సి ఉండగా.. ఈ విధంగా పూర్తిగా ఆసుపత్రి మూసి ఉండడం పట్ల రోగులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని గత సంవత్సరం ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క డాక్టర్లు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. కానీ ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మంత్రుల ఆదేశాలు, కలెక్టర్ ల ఆ దేశాలు సైతం బేకాతర్ చేస్తూ ఇక్కడ వైద్య సిబ్బంది వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్త అవుతున్నాయి. ఈ విషయమై జిల్లా ఇన్చార్జి వైద్యాధికారి సీతారాంను వివరణ కోరెందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

# చెన్నూర్ ఎస్బీఐ బ్యాంక్ కుంభకోణంలో 44 మంది నిందితుల అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులు
- 25.17 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1,61,730 నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝూ



**మంచిర్యాల ప్రతినిధి (జనంసాక్షి) :** చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచిలో జరిగిన కుంభకోణం కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు క్యాషియర్ నరిగె రవీందర్ తో సహా 44 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్యాంక్ లో 25.17 కిలోల బంగారం,ఒక కోటి 10లక్షల రూపాయల నగదు అపహరణ కేసులో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా ఫిర్యాదు మేరకు పోలీసు లు నిందితులను పట్టుకున్నారు. ఆదివారం నాడు రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీ అంబర్ కిశోర్ ఝూ నిందితుల వివరాలను వెల్లడించారు. మీడియా ఎదుట ముగ్గురు ప్రధాన నిందితులను ప్రవేశ పెట్టారు. క్యాషియర్‌తో పాటు స్కాంలో బ్యాంక్ మేనేజర్, ఎనిమిది మంది సిబ్బంది కీలక పాత్ర పోషించారు. నిందితుడి నుంచి 15.237 కిలోల బంగారు ఆభరణాలు, రూ.లక్షా 23 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ మీడియా ఎదుట హాజరుపరిచారు. రామగుండంలోని సీపీ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను సీపీ వెల్లడించారు.ఆగస్టు 23న ఎస్బీఐ చెన్నూర్ రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా చెన్నూర్‌లో పీఎస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. బ్యాంకులో 402 గోల్డ్ లోన్ ఖాతాలో 25.17 కిలోల బంగారాన్ని నిలువ ఉంచిందని, వీటి విలువ రూ.12.61 కోట్లు, నగదు రూ.1.10 కోట్లు దుర్వినియోగం చేసి దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు.

కేసును చేధించడానికి నాలుగు ప్రత్యేక బృందాలను మంచిర్యాల్ డీసీపీ ఏ. భాస్కర్, పర్యవేక్షణలో ఏసీపీ జైపూర్ ఏ. వెంకటేశ్వర్‌కు అప్పగించామని వివరించారు. దర్యాప్తు అధికారి, ప్రత్యేక బృందాలు బ్యాంకును తనిఖీ చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించి, క్యాషియర్ నరిగె రవీందర్ ఖాతాలో ఆడిట్ నిర్వహించగా భారీగా అనుమానాస్పద డిపాజిట్లు ఉన్నట్లు తేలిందని వివరించారు. ప్రధాన నిందితుడు క్యాషియర్ నరిగె రవీందర్ అదుపులోకి తీసుకుని ప్రశ్నించామని వెల్లడించారు. అక్టోబర్ 2024కు ముందే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్న క్యాషియర్ తన నష్టాన్ని పూడ్చుకునేందుకు, మరింత బెట్టింగ్ కొనసాగించేందుకు బ్రాంచ్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి మోసానికి పాల్పడ్డాడని తెలిపారు. బ్యాంక్ కరెన్సీ, ఛెస్ట్ తాళం మేనేజర్, క్యాషియర్ సంయుక్త ఆధీనంలో ఉండాలని నిబంధనలు ఉండగా మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్ తన తాళాన్ని క్యాషియర్‌కు ఇచ్చాడని దాన్ని ఉపయోగించుకుని, నరిగె రవీందర్, క్యాషియర్, మేనేజర్ , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సహకారంతో బంగారం, నగదు దొంగిలించేందుకు పథకం రచించాడని అన్నారు.

అక్టోబర్ 2024 నుంచి తరచూ గోల్డ్‌లోన్ చెస్ట్ నుంచి బంగారం తీసి, తన స్నేహితులకు అప్పగించి ఆ బంగారాన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టి, డబ్బును తమ ఖాతాల్లో జమ చేసి, కొంత కమిషన్ తీసుకుని మిగతా మొత్తాన్ని క్యాషియర్ రవీందర్‌కు బదిలీ చేసేవారని వివరించారు. ఇప్పటివరకు నిందితులు పది ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ కంపెనీలలో 44 మంది పేర్లపై 142 గోల్డ్ లోన్లు తీసుకున్నారని తెలిపారు. క్యాషియర్ నరిగె రవీందర్ బ్రాంచ్ మేనేజర్‌తో కుమ్మక్కై తన భార్య, మరిది స్నేహితుల పేర్లతో తప్పుడు గోల్డ్‌లోన్లు 42 మంజూరు చేసి, బంగారం లేకుండానే రూ.1.58 కోట్లు 4.14 కిలోల బంగారం తాకట్టు పెట్టినట్లు చూపించి విత్‌డ్రా చేసుకున్నాడని అన్నారు. వాస్తవ నష్టం 21 కిలోల బంగారం విలువ ఉంటుందని చెప్పారు. క్యాషియర్ రవీందర్, ఏటీఎంలలో నగదు రీఫిల్ చేసే సమయంలో కూడా డబ్బు అపహరించేవాడని తెలిపారు. దర్యాప్తు అధికారి ఇప్పటివరకు ముగ్గురు బ్యాంకు అధికారులు, వారికి తోడ్పడిన 41 మందితో కలిపి మొత్తం 44 నిందితులను అరెస్టు చేశామని అన్నారు. వివిధ బ్యాంకుల నుంచి 15.23 కిలోల బంగారు నగలు రికవరీ అయ్యాయని తెలిపారు. మిగతా బంగారు ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉందన్నారు. గోల్డ్‌లోన్ కంపెనీ మేనేజర్ల పాత్ర పై విచారణ కొనసాగుతున్నదని తెలిపారు. ఈ కేసును తక్కువ కాలంలోనే చాకచక్యంగా ఛేదించినందుకు పోలీసు అధికారులను అభినందించారు.



# వాగులో స్నానానికి వెళ్లి యువకుడు మృతి

**ఆసిఫాబాద్ (జనంసాక్షి) :** పట్టణంలోని పెద్దవాగులో పడి జైనూర్ మండలం పాట్నాపూర్ గ్రామానికి చెందిన మహబూబ్ (17) మృతి చెందాడు. పట్టణ సీఐ బాలాజీ వరప్రసాద్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. పట్టణంలోని రాజంపేటకు చెందిన రేహన్, అయాన్‌లు ఇద్దరు అన్నదమ్ములు. వీరు మేనత్త కొడుకు మహబూబ్‌తో కలిసి ఆదివారం గోడవెల్లి పెద్దవాగు లో స్నానానికి వెళ్లారు.

## హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణిలోని హెచ్ఎంఎస్ (ది సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్) గౌరవ అధ్యక్షురాలిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో నిర్వహించిన హెచ్ఎంఎస్ జనరల్ బాడీ మీటింగులో సంఘం ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ కవితను గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకుంటున్నట్టు ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి హోం మంత్రిగా పనిచేసిన కాలం వరకు హెచ్ఎంఎస్‌కు గౌరవ అధ్యక్షుడిగా నాయిని నర్సింహారెడ్డి పనిచేశారు. ఆయన తర్వాత హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు.

# మధురానగర్‌లో రహదారి మధ్య రెయిలింగ్ తొలగింపు

**ట్రాఫిక్‌కు ఉన్న అంతరాయాన్ని క్లియర్ చేసిన హైడ్రా**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహానగరంలోని మధురానగర్‌లో దారి మధ్యన వేసిన రైలింగ్ ను హైడ్రా తొలగించడంతో రోడ్డు విశాలంగా మారింది. మధురానగర్ మధ్యన ఒకప్పుడు ఓపెన్ గా వున్న వరద నీటి కాలువను బాక్సు డ్రైన్ గా మార్చారు. కాలువ మీద ఉన్న స్లాబ్ పై రైలింగ్ ఏర్పాటు చేసారు. యిప్పుడు అదే ట్రాఫిక్ కు అంతరాయంగా మారింది. రైలింగ్ మధ్యలో బైక్స్ పార్కింగ్ చేయడమే కాకుండా.. ఇరువైపులా బైకులు, కార్లు పార్కింగ్ చేయడంతో దారి పొడుగునా రాకపోకలకు ఆటంకంగా మారింది. యిల్లకు, షాప్ లకు వచ్చిన వాళ్లు పెద్ద సంఖ్యలో వాహనాలు ఇరువైపులా పార్కింగ్ చేయడంతో విశాలమైన రహదారి ఇరుకుగా మారిపోయింది. బయట కాలనీ వాళ్ళు కూడా వాహనాలు అక్కడ పార్కింగ్ చేయడం, ట్యాక్సీ వాళ్ళు వాహనాలు అక్కడ నిలపడంతో కాలనీ వాసులకు ఆ మార్గంలో వెళ్ళడం ఇబ్బందిగా మారింది. ఈ అవస్థలను దశాబ్దాలుగా భరించిన కాలనీ వాసులు చాలా సార్లు ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయించారు. హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. వాహనాల పార్కింగ్ తో ఇరుకుగా మారిన రహదారి ఫోటోలతో సహా అధికారులకు చూపించారు. ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను గమనించారు. స్లాబ్ దృఢంగా ఉన్నదని నిర్ధారించుకున్నారు. 5 అడుగుల వెడల్పుతో 900ల మీటర్ల మేర వేసిన రైలింగ్ ను తొలగించడంతో ఇరువైపులా వాహనాల పార్కింగ్ కు అవకాశం లేకుండా అయ్యింది. దీంతో రోడ్డు వెడల్పు పెరిగింది.

మధురానగర్ మధ్యలో ఉన్న బాక్సు డ్రైన్ పై రైలింగ్ ను హైడ్రా తొలగించడంతో రోడ్డు వెడల్పు పెరిగిందని కాలనీ వాసులు సంబరాలు చేసుకున్నారు. రోడ్డు మధ్యలో రైలింగ్ కి ఇరువైపులా వాహనాల పార్కింగ్ కు అవకాశం లేకపోవడంతో.. స్కూల్ బస్సులు, అంబులెన్సులు సులభంగా రాకపోకలు సాగించడానికి ట్రాఫిక్ యిబ్బంది లేకుండా అయిందని ఆనందం వ్యక్తం చేశారు.



# మనం కొనేవి అస్లీవి కావు నక్లీవా?

- 15 క్వింటల్లా నకిలీ డిటర్జెంట్ ప్యాకెట్స్ స్వాధీనం
- మహారాష్ట్ర తరలిస్తుండగా పట్టుబడిన నకిలీ డిటర్జెంట్ పాకెట్లు

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** ప్రస్తుతం మార్కెట్లో మనం కొనేవీ అస్లీవా లేక నక్లీవ అనేది ఏది అర్థం కాకుండా పోతుంది. ఎందుకంటే పలు కంపెనీల బ్రాండ్ల లోగోల పేరుతో లోపల అంతా నక్లీ సరకు అమ్ముతుండడం ఇప్పుడు అందరిని కలవర పెడుతున్న విషయం. ఎందుకంటారా ఐతే ఈ వార్త మీకోసం.ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అమరావతి నుండి నకిలీ గడి డిటర్జెంట్ ను తీసుకువచ్చి ఆదిలాబాద్ మరియు మహారాష్ట్రలోని జివితి ప్రాంతానికి చెందిన వ్యాపారులకు అమ్ముతుండగా పట్టణం లోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో పక్కా సమాచారం మేరకు టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ మరియు సిబ్బంది కలిసి బొలెరో వాహనం 60 బ్యాగులలో దాదాపు 15 క్వింటల్లా నకిలీ డిటర్జెంట్ ఒక కిలో ప్యాకెట్లను తరలిస్తుండగా వారిని పట్టుకున్నారు. ఆదివారం డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. డిఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో వివిధ కంపెనీల పేరుతో నకిలీ సరకులు చలామణి అవుతున్నాయనే సమాచారం పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. పక్కా సమాచారంతో వెంటనే ఆ ప్రాంతం వద్దకు పోలీసులు చేరుకుని ఒరిజినల్ బ్రాండ్ల లోగోల పేరుతో లోపల డూప్లికేట్ సరకు డిటర్జెంట్ సర్ఫు పోకెట్లు సరఫరా చేస్తున్న వారిని పట్టుకుని ముగ్గురిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. పట్టణంలో ఎక్కడైన నకిలీ సరకులు ఎవరైనా అమ్మినట్లు డౌట్ వస్తే వెంటనే సమాచారాన్ని పోలీసు వ్యవస్థకు అందజేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కేసు నమోదైన నలుగురిలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏ ఫోర్ నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, ఎస్సై విష్ణు ప్రకాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాసుల వేటలో అధికారి అభాసుపాలు

**అధికారులు తీరు మారేదెప్పుడు**



**బెల్లంపల్లి, ఆగస్టు 30, (జనంసాక్షి) :** కాసుల వేటలో అధికారులు అబాసుపాలు అవుతున్నారు. కక్కుర్తే అధికారులను ప్రజల ముందు చులకన చేస్తుంది. అలాంటి సంఘటన బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలంలో చోటు చేసుకుంది. కన్నెపల్లి తహ సీల్దార్ కార్యాలయానికి నాలుగు దశల్లో కం ప్యూటర్, ప్రింటర్ కోసం మంజూరైన నిధుల్లో ఒక కంప్యూటర్, ఒక ప్రింటర్ మాత్రమే కొనుగోలు చేసి నిధులు సొంతానికి వాడుకున్నాడని ఆరోపిస్తూ స్వయంగా నాయబ్ తహసీల్దార్ ఉన్నతాధికారులకు పిర్యాదు చేయడం జిల్లాలో సంచలనం సృష్టించింది. ఇలా అందరికి ఆదర్శంగా నిలవాల్సిన మండల స్థాయి ఉన్నతాధికారులు కాసుల కక్కుర్తి పడి ప్రజల ముందు చులకన అవుతున్నారు. చాటు మాటుగా సాగాల్సిన యవ్వారం కాస్త ప్రజల ముందు పడితే ఇంకా ఆ అధికారిని ప్రజలు ఎలా నమ్ముతారో అర్థం చేసుకోవాలి. వాస్తవానికి డీడీఓ అధికారాలు తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ వద్ద ఉంటాయి. కాని కన్నెపల్లి మండలంలో మాత్రం సదరు అధికారి డీడీఓ అధికారాన్ని తన చేతిలో ఉంచుకొని కార్యాలయానికి మంజూరైన నిధులు ఎలాంటి కొనుగోళ్లు చేయకుండానే స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. డీడీఓ అధికారం చేతిలో ఉంచుకొని సిబ్బంది జీతాల్లో కోత విధించడంతో అక్రమాల వ్యవహారం తెరపైకి వచ్చిందని పలువురు భావిస్తున్నారు. నాయబ్ తహసీల్దార్ చేసిన ఆరోపణలపై సమాధానం ఇవ్వాల్సిన అవసరం సదరు అధికారిపై ఎంతైనా ఉంది. అంతే కాకుండా ప్రభుత్వం మండల స్థాయి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలనే ఉద్దేశంతో వారికి వాహన సౌకర్యం కల్పిస్తుంది. వాహనం ఖచ్చితంగా టాక్స్ వాహనం మాత్రమే వాడాల్సి ఉంటుంది. ఇలా టాక్స్ వాహనం వాడటం వల్ల వాహన యజమాని, డ్రైవర్ ఇలా రెండు కుటుంబాలు జీవిస్తాయనే ఉద్దేశం ఉంది. కాగా కన్నెపల్లి తహసీల్దార్ గా గతేడాది ఫిబ్రవరిలో బాధ్యతలు స్వీకరించిన అధికారి అప్పటి నుంచి ఎలాంటి వాహనం వాడక పోవడం విశేషం. కాగా వాహనం వాడకున్న వాహనం వాడుతున్నట్లు బిల్లులు చేసుకొని ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. మరి అధికారి ఏమని సమాధానం ఇస్తారో, సమాదానానికి సిబ్బంది ఎలాంటి కౌంటర్ వేస్తారో అని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**అంతా గురుడే...**

కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గురుడు తహసీల్దార్ ను గుప్పిట్లో పెట్టుకొని కార్యాలయంలో అంతా తానే అని చలామణి అవుతున్నాడానే ఆరోపణలు ఉన్నాయి. గురుడు ఎంత చెబితే అంత. ఎవరు జోక్యం చేసుకున్నా ఇక ఆపని అంతే. అది పెండింగ్లో ఉండాల్సిందే. అటు తిరిగి ఇటు తిరిగి గురుడు కనికరిస్తేనే ఆపని జరగాలి. కనీసం కార్యాలయంలో ఎంత మంది సిబ్బంది ఏహోదాలో ఉన్నా జాంతనై, తను అనుకున్న పని జరగాల్సిందే. ఇలా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి తనపై స్థాయి ఉద్యోగులతో పెత్తనం చెలాయించడంతో చాటుమాటుగా సాగాల్సిన బిల్లుల స్వాహా పర్వం రచ్చకెక్కిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి తమపై పెత్తనం చెలాయించడం వల్ల సిబ్బంది సహించలేక పోతున్నారు. కాగా గురుడు పెద్దసార్ కు ఎప్పుడు ఏం కావాలంటే అవి సమకూర్చుతున్నాడని, ఇద్దరు కలిసి విందు వినోదాలు చేసుకుంటా గురునికి నచ్చని వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి.

**ఎలాంటి తప్పుడు బిల్లులు తీసుకోలేదు : కన్నెపల్లి తహసీల్దార్ శ్రావణ్ కుమార్.**

కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తప్పుడు బిల్లులు పెట్టి నిధులు వాడుకున్నాడని వచ్చిన ఆరోపణలపై జనంసాక్షి వివరణ కోరగా తాను ఎలాంటి తప్పుడు బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేయలేదన్నారు. స్టేషనరీ బిల్లులు మంజూరైన సందర్భంలో కార్యాలయం మరమ్మత్తులకు ఉపయోగించాను. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అతని పని అతను చేస్తున్నాడు. దరఖాస్తులకు సమాధానం చెప్పాల్సింది అతనే కాబట్టి సమాధానం చెబుతున్నాడు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వచ్చిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. వాహన బిల్లుల విషయంపై వివరణ కోరగా తాను గతేడాది ఫిబ్రవరి నెలలో కన్నెపల్లి మండలానికి వచ్చానని, అప్పటి నుంచి వాహనం వాడటం లేదని అన్నారు. వాహన బిల్లులు తీసుకున్నానని ఆరోపిస్తున్నారు కదా, ఎంక్వయిరీ చేసుకోండి అని బదులిచ్చారు.

## వరద బాధితులను ఆదుకునేందుకు సినీపరిశ్రమ ముందుకు రావాలి: విజయశాంతి



**కామారెడ్డి (జనంసాక్షి) :** వరద బాధితులను ఆదుకునేందుకు సినీపరిశ్రమ ముందుకు రావాలని విజయశాంతి అన్నారు. ఇటీవల వరదలు సంభవించిన కామారెడ్డిలో తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ... వరదలు కామారెడ్డిని అతలాకుతలం చేశాయని చెప్పారు. కామారెడ్డిలో ఇంత జరుగుతుంటే బీజేపీ ఏం చేస్తుందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే కనిపించలేదని బాధితులు అంటున్నారని ఆరోపించారు. వరద బాధితులను ఆదుకునేందుకు సినీపరిశ్రమ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వరద రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. నష్టపరిహారం కోసం నివేదికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కేంద్రాన్ని రూ.10 వేల కోట్ల సాయం అడిగామన్నారు. ఇదిలా ఉంటే కామారెడ్డిలో వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. వరదల కారణంగా జిల్లాలో భారీగా ఆస్తి నష్టం జరిగింది. జాతీయ రహదారి సైతం కొట్టుకుపోయింది. కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రజలు ఎంతో ఇబ్బందిపడ్డారు.

# బీసీలను ఇంకెంత కాలం మోసం చేస్తారు?




ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయటం అసాధ్యమని ప్రభుత్వాన్ని నడిపే ప్రతి ఒక్కరికీ తెలుసు. కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వం. దాని ప్రమేయం లేకుండా పార్లమెంటులో బీసీ బిల్లుకు ఆమోదం అసాధ్యమనీ తెలుసు. ఏ రాష్ట్రంలోనైనా రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీంకోర్టు గతంలో చెప్పిన విషయమూ తెలుసు. రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేసే అధికారం క్యాబినెట్ కు లేదనీ కూడా తెలుసు. రాష్ట్రపతి వద్ద రెండు బిల్లులు పెండింగులో ఉండగా ఆర్డినెన్ ను గవర్నర్ ఆమోదించరనీ కూడా తెలుసు.. పైగా ఇవన్నీ తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా బీసీ రిజర్వేషన్లపై డ్రామాలు ఆడుతున్నది. రాజ్యాంగబద్ధంగా కల్పిస్తామని ఒకసారి, ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తామని మరోసారి, పార్టీ పరంగా కల్పిస్తామని ఇంకోసారి చెప్తూ వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు ప్రత్యేక జీవో ద్వారా కోటా పరిమితి ఎత్తివేసి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఊదరగొడుతున్నది. పూటకో మాటతో ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నది.

50 శాతం రిజర్వేషన్ల కోటా పరిమితినిసడలిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకటి రెండు రోజుల్లోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉన్నది. కోటా పరిమితిని సడలించడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే మూడు దశాబ్దాల క్రితమే సుప్రీంకోర్టు తీర్పుతో అమల్లోకి వచ్చిన రిజర్వేషన్ సీలింగు సడలించే రాజ్యాంగ హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రభుత్వ జీవో న్యాయ సమీక్ష ముందు నిలబడుతుందా? అన్నది మరో ప్రశ్న. ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా సొంత జీవో లతో కోటా పరిమితికి మించి రిజర్వేషన్లు అమలు చేయలేదు. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఆర్డినెన్స్ ద్వారా బిల్లును అమలు చేయాలని క్యాబినెట్లో నిర్ణయించింది. ఆదివారం అసెంబ్లీలో ఆర్డినెన్స్ ను ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగులో ఉన్న బిల్లులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని, తీసుకున్నా అవి రాజ్యాంగ పరంగా, న్యాయపరంగా చెల్లుబాటు కావని న్యాయనిపుణులు చెప్తున్నారు. ఈ విషయం తెలిసి కూడా బీహార్ ఎన్నికల కోసం తెలంగాణలోని బీసీలను మోసం చేసే ఎత్తుగడ లు కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని బీసీ సంఘాల నేతలు ,బీసీ ప్రజలు మండిపడుతున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లోనే రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఇవి కేంద్రం వద్ద పెండింగులో ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అనేక సార్లు ఢిల్లీ వెళ్లినా వాటిని ఆమోదించాలని కోరుతూ ఒక్కసారి కూడా ప్రధానిని కానీ, కేంద్ర మంత్రులను కానీ కలిసిందిలేదు. ఇండియా కూటమి ద్వారా పార్లమెంటులో ఒత్తిడికి కూడా ప్రయత్నించ లేదు. బీసీ బిల్లుల ఆమోదానికి చేపట్టాల్సిన న్యాయ పరమైన ప్రక్రియను చేపట్టకున్నా కేంద్రం మాత్రం వెంటనే ఆమోదించి 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేయడం గమనార్హం.

**లీగల్ ప్రావిజెన్స్ ఆటంకం కలిగిస్తాయి:**

రిజర్వేషన్ల కోటా పరిమితిని సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వులపై హైకోర్టులో చిన్న పిటిషన్ వేసినా కోర్టు ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేస్తుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే కోరుకుంటున్నదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. పార్టీ పరమైన రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లాలని తొలుత అనుకున్నా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఎదురుదెబ్బ తాకే అవకాశం ఉందని,బీజేపీ చేతికి ఆయుధం ఇచ్చినట్టు అవుతుందని ఏఐసీసీ హెచ్చరించడంతో ప్లాన్ మార్చినట్టు ఢిల్లీ కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఉత్తర్వుల ద్వారానే ముందుకు వెళ్లాలని, అవి ఎలాగూ న్యాయ సమీక్షకు నిలబడవు కాబట్టి ఎన్నికలు వాయిదా పడతాయని, ఈ లోగా బీహార్ ఎన్నికలు పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తున్నది.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ఎంపీ, ఎమ్మెల్యే పెన్షన్ మిత్రలాభం.. ఉద్యోగులకు మిత్రద్రోహం

***భారత ప్రధాని గత వారం బీహార్ సభలో మాట్లాడుతూ పదవిచ్యుతి నూతన బిల్లు చట్టం సందర్బంగా ప్రజా ప్రతినిధులను ప్రభుత్వ ఉద్యోగితో పోల్చి, చిరుద్యోగి అరెస్టయి కేవలం 48 గంటల పాటు జైల్లో ఉంటే సస్పెండ్ చేసే నిబంధన ఉన్నప్పుడు ప్రజా ప్రతినిధులు 30 రోజులు జైల్లో ఉంటే పదవి నుండి ఎందుకు తొలగించకూడదు అని ప్రతిపక్షాలకు ప్రశ్నించిన విషయం రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజలు గమనించే ఉంటారు, అదే సమయంలో మరొక ప్రశ్న ప్రతి ఉద్యోగికి తలెత్తి ఉండవచ్చు.!***

ఇదే పెన్షన్ విషయంలో ప్రజా ప్రతినిధితో ఉద్యోగికి ఎందుకు పోల్చరు.? రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటూ ప్రభుత్వం కొరకు 30 ఏళ్ల పాటు సేవ చేసిన ఉద్యోగికి లేని పెన్షన్ 3 ఏళ్ళు కూడా సరిగా పని చేయని ఎంపీ, ఎమ్మెల్యేకి పెన్షన్ ఇవ్వడం సబబా.? ప్రజా ప్రతినిధులకో న్యాయం, ప్రభుత్వ ఉద్యోగులకో న్యాయమా.? కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ విషయంలో అలోచించాల్సిన అవసరం లేదా? ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం వారి బాధ్యత కాదా.?

తెలంగాణ ఎంప్లాయిస్ జాక్ సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటించి ఉద్యోగుల 63 వివిధ డిమాండ్ లను సాధించడానికి దశలవారి ఉద్యమాలను ఉధృతం చేస్తున్న నేపథ్యంలో పెన్షన్ గురించి ఆలోచించాల్సిన ఆవశ్యకత హామీనిచ్చిన ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. ఏ చదువు లేకపోయినా, ఎన్ని కేసులున్నప్పటికి, రాజకీయ నాయకుల అండ దండలతో, ధన బలంతో కేవలం ఒకే ఒకసారి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలాంటి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వారు 5 సంవత్సరాలు కాదు, కేవలం ఒక్కరోజు మాత్రమైన పదవిలో ఉండి ఉంటే, వీరికి కోట్ల వ్యాపారం ఉన్నప్పటికీ వీరికి జీవితాంతం పెన్షన్ ఇచ్చే చట్టాలు తమకు అనుకూలంగా తయారు చేసుకొని, 61 ఏళ్ళ వయసు వచ్చే వరకు ఉద్యోగ సేవ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి ఉన్న పెన్షన్ లేకుండా చేసి, చట్టాన్ని మార్చి ఓపీఎస్ ను సీపీఎస్ ల మార్చడం సమానత్వమా.? ఇది ఉద్యోగుల పట్ల ద్రోహం కాదా? పెన్షన్ ఇచ్చే ఆచారం ఈనాటిది కాదు, స్వాత్రంత్రాని కన్న ముందే బ్రిటిష్ రాజ్యమే ప్రారంభించిన మూలాలున్నాయి, 1924లో పౌర సంస్థలపై రాయల్ కమిషన్ భారత దేశంలో పని చేస్తున్న తన నియామకాలకు పదవి విరమణ తర్వాత సగం జీతం పెన్షన్ గా ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది, ఓపీఎస్ (పాత పెన్షన్స్ పథకం) మూలాలు బ్రిటిష్ రాజ్యం నుండే కలిగి ఉన్నందు వలన భారత ప్రభుత్వ చట్టం 1935 స్వీకరించడం వలన పూర్వ కాలం నుండే ఉద్యోగుల సేవకు ప్రతిఫలంగా విరమణ అనంతరం వారి కుటుంబానికి జీతంలో సగం, దశల వారిగా మారుతూ ఆర్థిక చేయూత వచ్చేది, కానీ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక భారం తగ్గించడానికనే కారణంతో కేవలం ఉద్యోగస్తులనే దృష్టిలో ఉంచి 2004 జనవరి 1 నుండి ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ పథకం (ఎన్పీఎస్)ను అమల్లోకి తెచ్చారు, ఇందులో భాగంగా పాత పెన్షన్ (ఓపీఎస్)స్కీమ్ ను రద్దు చేసి కాంట్రీబ్యూటరీ స్కీమ్ (సీపీఎస్)ను అమల్లోకి తెచ్చారు.మన తెలుగు రాష్ట్రాల్లో 2004 సెప్టెంబర్. 1 నుండి అమలైంది, దీని అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చినప్పటికి రెండు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, త్రిపుర మాత్రం పాత పెన్షన్ స్కీమ్ ను వెంటనే రద్దు చేయకుండా కొంసాగించాయి, అదే విధంగా OPSను ముందు రద్దు చేసిన రాష్ట్రాలు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, జార?ండ్, ఛత్తీస్గఢ్ వంటివి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరిగి ఓపీఎస్ పాత పెన్షన్ ను అమలు చేసారు, తెలంగాణలో కూడా ఉద్యోగుల పాత పెన్షన్ ను అమలు చేయాలనీ గతంలో ప్రతిపక్షంలో ఉన్న పార్లమెంట్ సభ్యులు ఇప్పటి మంత్రి గారు ఉత్తమ్ కుమార్ రెడ్డి అప్పట్లోనే డిమాండ్ చేసారు, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత పెన్షన్ ను పునరుద్దరిస్తామని ఎన్నికల వాగ్దానం చేసారు, రాష్ట్రం లోని కాంగ్రెస్ పార్టీ కూడా 2023 ఎన్నికల మేనిఫెస్టోలో మొదటి పాయింట్ లోనే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేస్తామని పొందు పరిచి ఉద్యోగులకు మాటిచ్చారు,




**సీపీఎస్ అంటే ఏమిటీ?**

కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ లో ఇటు ఉద్యోగులు ప్రతి నెల జీతంలో 10 శాతం, అటు ప్రభుత్వం 10 శాతం వంతున జమ చేసి భవిష్యత్ ఆధారిత ప్రయోజనం కోసం మార్కెట్ లో పెట్టుబడులు పెట్టి పదవి విరమణ సమయంలో ఉన్న మార్కెట్ విలువను బట్టి ఉద్యోగికి అందులో నుండి కేవలం 60 శాతం మాత్రమే అందిస్తారు,ఇందులో మళ్ళి ఆదాయపు పన్ను, జీ. ఎస్. టీ ఉంటుంది, మిగిలిన 40 శాతం ఇన్సూరెన్స్ కంపెనీలో ఏదో ఒక ప్లాన్ తీసుకోని అందులో నుండి ఏడాదికి కేవలం 6.శాతం వరకు పెన్షన్ రూపంలో వస్తుంది, మొత్తానికి సీపీఎస్ పెన్షన్ ఖచ్చితంగా ఇంత వస్తుందని భరోసా లేదు, పైగా అప్పటికి మార్కెట్ విలువల్లో తేడాలు వస్తే గనుక ఉద్యోగి కొంత మేరకు నష్టపోవచ్చు.! ఈ విధమైన గ్యారంటీ లేని పెన్షన్ వద్దని దేశంలోని ఉద్యోగస్తులందరు ఎంత మొత్తుకున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం, కొన్ని రాష్ట్రాలు ఆర్థిక భారం అనే సాకుతో సీపీఎస్ ను రద్దు చేయడం లేదు, ఎన్నికలప్పుడు ప్రకటించే కోట్ల రూపాయల ఉచితాలు ఆర్థిక భారం కావా.? మందిరాలు, మసీదులకిచ్చే వందల కోట్లు, రైతు రుణమాఫీలు ఆర్థిక భారం కావా? ప్రజలడగక ముందే ఇచ్చే ఉచిత కరెంట్, ఫ్రీబస్, లాంటి వన్నిటికీ వేల కోట్లు ఆర్థిక భారం కాదా.?ఇవన్నీ ప్రజా సంక్షేమమే కావచ్చు.! ప్రజలందరికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు, 30 ఏళ్ల పైబడి ప్రభుత్వ సర్వీసులో సేవ చేసిన వారికి పెన్షన్ ఇవ్వడం భారమా.! ప్రభుత్వాలు, ప్రజలు ఆలోచించాలి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన మేనిఫెస్టోలోని అంశాలైన నూతన పీఆర్సీ, డిఏలు,హెల్త్ కార్డులు, పెండింగ్ బిల్లులు, 317 బాధితులు, బదిలీలు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్దీకరణ ఇలా అనేక రకాల వాగ్దానాలున్నాయి, ఇందులో ఏ ఒక్కటీ కూడా పూర్తిగా నెరవేరలేదు. 5 డి.ఏ లలో కనీసం 3 ఇస్తారని భావిస్తే కేవలం ఒకటి మాత్రమే ఇచ్చి ఉద్యోగుల ఆశలపై నీళ్ల చల్లారు, పదవి విరమణ పొందుతున్న వారు బెనిఫిట్స్ పొందలేక రోడ్డునెక్కే పరిస్థితి నెలకొంది, పీఆర్సీ పాతాళంలోకి వెళ్ళింది, పాత పెన్షన్ మాట పాతగైపోయింది, మూడు నెలల క్రితం కనీసం నిరసన తెలుపుదాం అనే సమయంలోనే ఉద్యోగస్తుల కన్నా ముందే ముఖ్యమంత్రి గారే స్పందించి నన్ను కోసినా సరే పైసల్ లేవని అసహనం వ్యక్తం చేయడంతో ఉద్యోగ సంఘ నాయకులు ప్రభుత్వానికి సహకరిద్దామని వారి డిమాండ్ లతో పాటు నిరసన కార్యక్రమాలకు విరామమిచ్చి ప్రభుత్వానికి సహకరించారు, తరువాత వివిధ మంత్రులు అధికారులతో ఏర్పడ్డ ఉప సంఘం పలు దఫాలుగా జరిపిన చర్చల్లో కాలయాపన తప్పా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది, తెలంగాణలోని టీజీఓ, టీఎన్జీవో, ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక, పెన్షనర్ల సంఘాలు కాంగ్రెస్ ప్రభుత్వం అంటే మన ప్రభుత్వమే అనుకొని ఆశతో, కొన్ని ముఖ్యమైన డిమాండ్ లను అయినా అమలు చేస్తుందనుకొని ఇప్పటి వరకు ఎంతో ఓపికతో ఉన్నారు, కానీ అధికారుల నిర్లక్ష్యంతో అవేమి నెరవేరక పోగా ప్రభుత్వం మరియు ఉద్యోగస్తుల మధ్య దూరం పెరుగుతూ వస్తుంది, గత ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు ఎన్నో నిరసనలు, ధర్నాలు చేపట్టారు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2 ఏళ్ళు కావస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగ సంఘాలు ఎలాంటి నిరసనలు చేయలేదు, కానీ వివిధ సంఘాల సభ్యులు, ఉద్యోగస్తులు నిరాశతో, అసహనానికి గురవుతు వ్యతిరేక గళం పెరుగడంతో తప్పని పరిస్థితుల్లో టిజిఈజేఏసీ నాయకులు మళ్ళీ దశల వారిగా వివిధ ఉద్యమాలను చేపట్టబోతున్నారు, ఇలాంటి తరుణంలో మేనిఫెస్టోలోని అంశాలు, ఉద్యోగులకిచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చి ఉద్యోగి కుటుంబంతో పాటు ప్రభుత్వ శాఖలను అభివృద్ధి చేయాలి.



సయ్యద్ జబి
9949303079
టీజీవో (సెక్రటరీ -సిరిసిల్ల జిల్లా)

# సంప్రదాయ స్వరాలు, నవ్య ప్రయోగాలు

1851 నుండి 1950 వరకు తెలంగాణ సాహిత్యములో ఒక విశిష్ట దశ ఏర్పడింది. ఈ కాలానికి చెందిన కవులు, తమ రచనల ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని, సాంస్కృతిక ప్రత్యేకతను, ప్రజల జీవన విలువలను స్పష్టంగా ప్రతిబింబించారు. తెలంగాణ కవిత్వం,స్వరూపతలో ఎంతో పురాతనమైనదైనా,అది కాలానుగుణ మార్పులకు లోనై, కొత్త ప్రయోగాలను ఆమోదించి నిత్య నూతనంగా అభివృద్ధి చెందింది. ఇప్పటికీ ఈ కవిత్వంలో మాండలిక పదజాలం ఒక సజీవ సంప్రదాయంగా కొనసాగుతుంది. తెలంగాణ మట్టిలో పుట్టిన సాధారణ పదాలే ఇక్కడి కవిత్వానికి పునాది అయ్యాయి.సంప్రదాయం (పారంపర్య సాహిత్య ధోరణులు) మరియు ప్రయోగం (నూతన సాహిత్య ఆవిష్కరణ) రెండూ ఈ కాలపు కవిత్వంలో సమసమానంగా కనిపిస్తాయి. సంప్రదాయం అనగా తరతరాలుగా సంక్రమించిన ఛందస్సులు, రూపకాలు, భాషా అలవాట్లుబీ ప్రయోగం అనగా వాటిలో కొత్త భావాలు, శైలి, వ్యక్తీకరణ పద్ధతులను జోడించడం. పాల్కురికి సోమనాథుని కాలానికి ముందు దేశీయ ఛందస్సులకు అంతగా ఆదరణ లేకపోయినా, ఆయన వాడిన ఛందస్సులు, కవితా రూపాలు, వచన నిర్మాణం ఇవన్నీ తెలంగాణ కవిత్వంలో ఒక కొత్త దిశను ప్రారంభించాయి. సోమనాథుని రచనలలో వస్తువు సమకాలీన సమాజం నుంచే రాయబడింది , అందువల్ల వాటికి ప్రాసంగికత, స్థానికత రెండూ కలిగాయి. ఉదాహరణ కు, బసవపురాణంలో ఆయన చూపిన సామాజిక చిత్రణలో ఆ కాలపు గ్రామీణ వాస్తవం ప్రతిబింబిస్తుంది. ఇదే ధోరణి తరువాతి తెలంగాణ కవుల రచనల్లోనూ కొనసాగింది. సమాజ జీవితం, ప్రజల శ్రమ, ఉత్సవాలు, ఆచారాలు, ఆర్థిక పరిస్థితులు ఇవన్నీ కవిత్వానికి అంశాలుగా మారాయి. ఈ కాలంలో కొందరు కవులు సంప్రదాయ భక్తికవిత్వాన్ని కొనసాగించగా, మరికొందరు సామాజిక సుధారణకు ప్రాధాన్యం ఇచ్చారుబీ కొందరు వీరరసాన్ని, మరికొందరు శృంగారరసాన్ని ప్రధానంగా వాడారు.

**మాండలిక భాషా ప్రాముఖ్యం :** తెలంగాణ కవిత్వంలో మాండలిక పదజాలం కేవలం భాషా లక్షణమే కాదు, అది కవిత్వానికి సజీవతను ఇచ్చే మూలాధారం. ఉదాహరణకు, పల్లెల్లో ఉపయోగించే వ్యవసాయ పదాలు, పండుగల పేర్లు, వృత్తులు, ప్రకృతి దృశ్యాలకు సంబంధించిన స్థానిక పదాలు కవిత్వానికి సహజత్వాన్ని, వాస్తవికతను అందించాయి (గడ్డం లింగయ్య, వ్యాసం ు తెలంగాణ మాండలిక భాషా ప్రభావం సాహిత్యంలో, జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్). విభిన్న రీతుల కవులు,ఈ కాలానికి చెందిన కవుల్లో కొందరు భక్తిరస ప్రధాన రచనలు చేశారుబీ వీరిలో శైవ, వైష్ణవ, వీరశైవ కవులు తమ తమ దైవాల మహిమలను వర్ణించారు. కొందరు సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే కవిత్వాన్ని రాశారుబీ వీరు పేదరికం, శ్రమ, అన్యాయం వంటి సమస్యలను ప్రస్తావించారు. మరికొందరు వీరరసాన్ని ప్రాధాన్యంగా తీసుకుని, చారిత్రక సంఘటనలు, స్వాతంత్ర్య పోరాటం వంటి విషయాలను కవిత్వంలో మలిచారు.1851%-%1950 కాలంలో తెలంగాణ కవిత్వం సంప్రదాయం మరియు ప్రయోగం అనే రెండు ధృవాల మధ్య సజీవంగా అభివృద్ధి చెందింది. స్థానిక మాండలికం, ప్రజల అనుభవజాలం, సామాజిక చైతన్యం,




కళాత్మక సృజన ఇవన్నీ కలసి ఈ కాలపు సాహిత్యాన్ని విశిష్టంగా నిలబెట్టాయి.

**1851-1950 కాలపు కొందరు తెలంగాణ కవులు**

ఈ కాలంలో తెలంగాణ కవిత్వం భక్తిరసాన్ని, ధర్మప్రచారాన్ని, అలాగే సమాజంలో చోటుచేసుకున్న దురాచారాలపై వ్యంగ్యాన్ని కలగలిపి ఒక ప్రత్యేక సాహిత్య రూపాన్ని పొందింది. ఆ కవులలో అంజనేయదాసు (1894, ఆత్మకూరు, నల్లగొండ జిల్లా) ముఖ్యులు. వీరి కవిత్వ ప్రధాన లక్ష్యం భక్తి వేదాంతాల ప్రచారం కావడం గమనార్హం. భక్తి వేదాంతం అనగా భక్తిని ఆధ్యాత్మిక తత్త్వచింతనతో సమన్వయం చేయడం. అంజనేయదాసు రచనల్లో భక్తి ఆచరణతో పాటు, ఆత్మోన్నతి సాధనకు మార్గదర్శకమైన అంశాలు కనిపిస్తాయి.అదేవిధంగా ఆచార్యరాజు భట్టు (కరీంనగర్) రాసిన బంద గర్భ శతకము శతకసాహిత్యంలో ఒక ప్రత్యేకమైన ప్రయోగంగా పరిగణించవచ్చు. శతకం అనేది తెలుగు సాహిత్యంలో విస్తృతమైన ప్రక్రియ అయినప్పటికీ, ఇలాంటి ఇతివృత్తం 'బంధగర్భం' అరుదుగా మాత్రమే సాహిత్యంలో కనిపిస్తుంది. ఈ శతకంలో సమాజంలో దొర్లే మానవ బలహీనతలను,ఆత్మనిగ్రహం అవసరాన్ని, నీతిపాఠాలను కవితా రూపంలో ప్రతిబింబించారు. శతక రూపకల్పనలో వీరు విద్వత్ కవి చిత్రవిస్తర కవిత్వాల పట్ల ఆసక్తిని ప్రదర్శించారు (శతక పరిశోధన వేములపల్లి సుబ్బారావు, వ్యాసం, తెలుగు శతకసాహిత్య పరిణామం, 1948). అప్పయ్యశాస్త్రి చిమకుల (సికింద్రాబాద్) భక్తి, ధర్మప్రచారంతో పాటు సంస్కరణోద్యమాలపై విమర్శా దృష్టితో కూడిన రచయిత. వీరు సంస్కృత కవి గుర్గాచార్యులు రచించిన భాగవతంను తెలుగులో అనువదించారు. అనువాదంలో వారు కేవలం పదార్థానువాదం కాకుండా, స్థానిక పాఠకుల ఆచారాలకు అనుగుణంగా భాషా రూపకల్పన చేశారు. సమకాలీన సమాజంలోని దురాచారాలను ఎద్దేవా చేస్తూ రాసిన వేంకటేశ విన్నపములు శతకం శతకసాహిత్యంలో ఒక శక్తివంతమైన ఉదాహరణ. ఇందులో వ్యాజస్తుతి, హాస్యరసం, వంగ్యాలంకారం సమ్మిళితమై, ఆచారాల పేరుతో జరుగుతున్న దుర్వ్యవహారాలను కవిత్వం ద్వారా ప్రశ్నించారు.

**స్వాతంత్రోద్యమం నుండి సంప్రదాయసాహిత్యానికి తెలంగాణ కవుల విభిన్న దిశలు (1851-1950)**

అద్దూరి అయోధ్యరామకవి (వరంగల్) స్వాతంత్రోద్యమ సమయంలో ప్రజలలో జాతీయ చైతన్యాన్ని రగిలించేందుకు కవిత్వాన్ని ఆయుధంలా ఉపయోగించిన అరుదైన కవుల్లో ఒకరు. వీరి పాటలు భారత జాతీయోద్యమ లక్ష్యాలను పల్లె ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో అందించాయి. ఈ లక్ష్యసాధనలో తెలంగాణ మాండలిక పదజాలం, నుడికారపు స్వరూపాలు (మాటల తీరులు) ప్రధాన పాత్ర పోషించాయి. ఈ మాండలికత వల్లే గ్రామీణ పాఠకులకు వీరి కవిత్వం మరింత దగ్గరగా అనిపించింది. భాషలోని ఈ సహజత్వం, జాతీయ భావోద్రేకంతో కలిసినప్పుడు, వీరి పాటలు సమాజంపై మేల్కొలుపు ప్రభావం చూపాయి.కృష్ణమాచార్యులు కోమాండూరి (వనపర్తి సంస్థానం) సంప్రదాయవాద దృక్పథముతో కూడిన విద్వత్ కవి. వీరు సంస్కృత, ప్రాకృత భాషల నుంచి కొన్ని కావ్యాలను ఆంధ్రీకరించడం ద్వారా భాషా స్రవంతి కి నూతనోత్సాహాన్ని ఇచ్చారు. విషయానుగుణ శైలీ జాచిత్రం (అంటే కవిత్వంలోని విషయానికి తగిన శైలీ ఎంపిక) వీరి సాహిత్యంలో కనిపిస్తుంది. అతిథ్యము, ప్రణయలేఖ వంటి గేయాల్లో భావకవితా ధోరణి, స్నిగ్ధమైన అనుభూతులు కనిపిస్తాయి. అతిథ్య గేయకథ శ్రీరామానుజుల జీవితంలోని ఒక ఘట్టాన్ని ఆధారంగా రాసి, హర్షచరిత్ర సంస్కృతకావ్యానికి తెలుగులో స్వరూపానువాదం చేశారు. ఈ ప్రక్రియలో ప్రాచీన కావ్యశైలిని అనుసరించడంతో పాటు, భాషలో శీర్ష సంస్కృత సమాసాలను సమృద్ధిగా ఉపయోగించారు.కృష్ణమాచార్యులు శిరిసినహాల్ (నిజామాబాద్) వేదాంత ప్రతిపాదక సాహిత్యంలో కీర్తినొందిన కవి. శ్రీ గీతాచార్య మత ప్రభావ శతకం, కళాశాలభ్యుదయం వంటి రచనలు భక్తి, తాత్త్వికత, మరియు విద్యా వ్యాప్తి లక్ష్యాలను కలిపినవిగా నిలిచాయి.వీరి పద్యాలలో పూర్వకవుల అలవాటైన చందస్సు, సంస్కృత పదసంపద విస్తారంగా ఉన్నాయి. మరో కవి కృష్ణమాచార్యులు హుస్నాద్దుర్గం (వనపర్తి) శతాధిక గ్రంథకర్తగా ప్రసిద్ధి. వీరి కల్యాణ గీత మంజరి మంగళహారతి గేయాల సమాహారం. ఇందులో వైష్ణవాచార్యుల వైభవం, ఆచార సంప్రదాయాల సౌందర్యం ప్రతిబింబించాయి. వీరి రచనలు ఎక్కువగా సంస్కృతంలో ఉండి, పూర్వకవుల భాషా-అలంకార సంప్రదాయాన్ని బలంగా అనుసరించాయి.ఇంకా కేశవరావు రంగారావు (వరంగల్) భక్తి, నీతి ప్రధానంగా రచనలు చేసిన కవి. విక్రమాదిత్యం (104 గద్యపద్యాల సమాహారం) వీరి ముఖ్య రచన. ఈ కృతి సంప్రదాయ విషయాలను ఆధారంగా తీసుకున్నప్పటికీ, గర్భకవితా బంధరచన రీతులు (గర్భకవిత్వం: ఒక కవితలో మరొక కవితను అంతర్లీనంగా ఉంచే శైలి) ఉపయోగించి సృజనాత్మకతను ప్రదర్శించారు. "ఇంద్రద్యుమ్నాయం" గద్యంలో సంగీత కవిత్వం విద్యాధారేయ అని తమ సాహిత్య స్థాయిని స్వయంగా సూచించారు. వీరి కవిత్వంలో ప్రబంధకవుల పోకడలు, శబ్దార్థాలంకారాలు, శ్లేష, ఓజోగుణాలు సమృద్ధిగా ఉన్నాయి.



డా. ఐ. చిదానందం
తెలుగు ఉపన్యాసకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి - 8801444335

## కష్టాల పేజీలు

చూస్తుంటే రాని సంపాదన కంటే
జీవితం నేర్పుతున్న పాఠాలే బాగున్నాయి....
నా జీవిత పుస్తకం మొత్తం కష్టాల
పేజీలే...
ఎంత తిరగేసిన ఒక దాన్ని
మించి ఒకటి బలంగా ఉంది
కొన్ని చించి పారేద్దామంటే ఏ
పేజీలో ఏ మర్మముందో తెలియదు.
గెలుపు ఏ పేజీ ఒడ్డునుందో చూడాలంటే అక్షరాలను
ఈదుకొని వెళ్లాల్సిందే...
కాగితం పలుచనిదే దెబ్బలు మాత్రం బలంగా
తాకుతున్నాయి
మొదటి పేజీ పుట్టక చివరి పేజీ మరణం...
మిగతావన్నీ నేను రంగులేసుకొని
నటించాల్సిన పాత్రలే...
నిత్యం పారే నా కన్నీళ్లతో ప్రవహించే నది కూడా
పోటీపడలేకపోతుంది...
నా అవమానాలను లెక్క పెడితే
నక్షత్రాలు కూడా ఓడిపోతున్నాయి
దుఃఖాన్ని మోసే నా దేహం ముందు భూమి కూడా
అప్పుడప్పుడు భయపడి వణికిపోతుంది...
అన్ని ఉన్న జీవితానికి అర్థమేముంటుంది.....
గుచ్చుకునే ముండ్లను దాటుతున్నప్పుడు
నేర్చుకునే పాఠాలే విలువైనవి....
అవి నెమరేసుకుంటుంటే మనసు పడే అనుభూతి
ఏ సంపద ఇవ్వగలదు...?
పుస్తకం ఎంత బరువుంటే అప్పుడే నా గుండె
అంత గట్టిపడతది....
ఎన్నటికో వచ్చే సుఖం కంటే పడే కష్టమే నా
సంపద...
నన్ను వదిలి వెళ్లలేని
"కన్నీళ్ల" కంటే
ఏ బంధం గొప్పది కాదు...



తుమ్మల కల్పన రెడ్డి
9640462142

## మధనంలో

బోరేసి
నీళ్లు తక్కువగా ఉన్నాయని డ్రిప్ వేసి
కొన్ని మేలిరకం విత్తనాలు
కొన్ని నర్సరీ మొలకలు తెచ్చి
పిల్ల కాలువలు తవ్వి
చిన్నవి పెద్దవి పైపులు అమర్చి
వ్యవసాయ పనులన్నీ సమకూర్చి

విత్తనాలు మొలకలుగా
నర్సరీ మొలకలు చెట్లుగా క్రమక్రమంగా పెరిగి
భూమి ఆకాశాలు ఆక్రమించుకొని
ప్రకృతి సౌందర్యం సంక్రమించుకొని అడవి అయ్యింది

రోజు పొద్దున్నే వచ్చినా స్పందన కరువైంది
మాటలు మానేశాయి
చిన్నప్పుడు మాటలే తొలకరి జల్లులు
పెరిగితే కాలకూట విషాలు
రైతుకి వాక్చాతుర్యం లేదు
అమ్మలా గోరుముద్దలు పెట్టానని
నాన్నలా వేలుపట్టుకు తిరిగానని చెప్పలేదు
చెట్లను వృక్షాలను బలమైన బాహు బంధనంలోకి తీసుకొని
సేదతీరాలనుకున్నాడు.. జరగలేదు
ఇంట్లో కొడుకు కోడలు దగ్గర అతిథిగా
ఎప్పుడో నమోదు.. ఇప్పుడు పొలం దగ్గర కూడా

మధనం
ఆహారం ఇస్తే సరిపోదు అక్షర జ్ఞానం కూడా ఇవ్వాలి
బుద్ధి వికాసాన్ని పెంచే
భారత భాగవత రామాయణ కథలు చెప్పాలి

కోటం చంద్రశేఖర్ 9492043348

## నా కలల సుందరి

తన రూపం
ఎల్లోరా.. శిల్పం
తన ముంగురులు
మొగలి తీగలు
తన స్వరం
కోయిల గానం
తన మనసు
పాలంత స్వచ్ఛం
తన మాటలు
తేనె పలుకులు
తను కదిలొస్తే
నా తనువు గాల్లో తేలిపోతుంది
తను కనపడకుంటే
నా కనులకు కునుకుండదు
తను దూరమైతే
నా మనసుకు ఏదో కలత
తను దగ్గరకొస్తే
నా గుండె చప్పుడు రెట్టింపు
తనతో మాట్లాడాలనుంది
మాట్లాడాలంటే నాకు బిడియం
తను ఎక్కడ వద్దంటుందేమోనని
తనకి దూరంగా ఉంటే
ఏదో కోల్పోయిన బాధ
తనకి దగ్గరగా ఉంటే
ఎలా స్పందిస్తుందోనన్న భయం
దూరంగా ఉండలేక
దగ్గరగా వెళ్లలేక
నా మనసు వ్యాకులతకి
లోనవుతోంది.

కోనేటి నరేష్,
శ్రీ సత్యసాయి జిల్లా, 8499847863

# ప్రాణం తీసిన అన్నాతమ్ముళ్ల మధ్య భూ వివాదం

- 11 గుంటల భూమి విషయంలో పరస్పరం దాడులు
- మరో మహిళ పరిస్థితి విషయం
- దండుమైలారం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- గ్రామంలో భారీగా మోహరించిన పోలీసులు



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 (జనం సాక్షి) :** అన్నాతమ్ముళ్ళ మధ్య భూవివాదం దండుమైలారంలో తమ్ముడి దారుణ హత్యకు దారి తీసింది. 11 గంటల భూమి విషయంలో చెలరేగిన ఘర్షణ కొడవళ్ళు, గొడ్డల్ల తో నరుక్కునే వరకు వెళ్ళింది. ఈ ఘర్షణలో ఒకటి ప్రాణం పోగా మరో మహిళ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. పలువురికి తీవ్ర గాయాలతో ఆసుపత్రులు పాలయ్యారు. ఈ ఘటనతో దండుమైలారం గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఇరు వర్గాల ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోగా గ్రామంలో ఉధృత పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని దండుమైలారం గ్రామానికి చెందిన గుడేటి జంగయ్య అనే వ్యక్తికి గ్రామంలోని సర్వేనెంబర్ 156, 158, 159లో 18 ఎకరాల 12 భూమి ఉంది. ఈ భూమిని తన కుమారులు గుడేటి నరసింహ, గుడేటి మల్లయ్య, గుడేటి యాదయ్య, గుడేటి జంగయ్యలకు ఒక్కో భాగానికి నాలుగు ఎకరాల 23 గుంటల భూమి చొప్పున పంపకాలు జరుగాయి. అయితే గుడేటి మల్లయ్య, గుడేటి జంగయ్య అనే కొడుకులకు 11 గంటల భూమి తక్కువగా వచ్చింది. గుడేటి నరసింహ, గుడేటి యాదయ్యలకు అదనంగా 11 గుంటల భూమి ఉంది. ఈ విషయమై గత రెండు, మూడు సంవత్సరాలుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల ఇరువురు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేసుకున్నారు. అయితే గుడేటి మల్లయ్య, గుడేటి జంగయ్య కుమారులు ఈ భూమి విషయమై నరసింహ, యాదయ్య వారసులను అడుగుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇరువురు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్న తరుణంలో ఆదివారం గుడేటి నరసింహ, గుడి యాదయ్య వారసులు సదరు వివాదాస్పదమైన భూమిలోకి వెళ్ళి నాట్లు వేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గుడేటి మల్లయ్య, గుడేటి జంగయ్య వారసులు బాలరాజు, ధనరాజు, వెంకటరాజు, పావని, మంజుల అడ్డుకునేందుకు అక్కడకు వెళ్లారు. దాంతో ఒక్కసారిగా గుడేటి నరసింహ, గుడేటి యాదయ్య వారసులైన గులేటి బాలరాజు, శ్రీశైలం, యాదయ్య, లింగస్వామి, ప్రసాద్, పద్మ, అర్చన, దేవకమ్మ, పారిజాతలు కలిసి ఒక్కసారిగా గుడేటి బాలరాజుపై గొడ్డళ్లు, కొడవళ్ళతో విరుచుకుపడ్డారు. విచక్షణ రహితంగా నరికి దాడి చేయగా బాలరాజు అక్కడికక్కడే తీవ్ర గాయాలతో మృతిచెందాడు. బాలరాజుపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయిన బాలరాజు తమ్ముని భార్య మంజులకు తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘర్షణలో గాయాల పాలైన వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్థుల నుండి వివరాలు సేకరించమని, పరస్పరం ఫిర్యాదులతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు.

# నూతన గ్రంథాలయాన్ని సందర్శించిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



**శామీర్‌పేట్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** నూతనంగా నిర్మిస్తున్నటువంటి అలియాబాద్ గ్రామీణ శాఖ గ్రంధాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ సందర్శించి పర్య వేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగు నూరిశ్రీనివాస్ రెడ్డి, జిల్లా సెక్రెటరీ సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్,షామీర్పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ గౌడ్, అలియాబాద్ మాజీ సర్పంచ్ కంతం కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్యం తాగి వేధిస్తున్న భర్తను హతమార్చిన భార్య



**మోమిన్‌పేట, ఆగస్టు 31 (జనం సాక్షి) :** తాగిన మత్తులో భాగ్యను వేధిస్తున్న భర్తను హతమార్చిన సంఘటన మోమిన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ సంఘటన సంబంధించి మోమిన్ పేట ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంటారం మండలం రొంపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు కురువ కుమార్ మరియు అతని భార్య కురువ రేణుక తన ఇద్దరు పిల్లలతో కలిసి కేసారం గ్రామంలోని సత్యనారాయణ రాజుకి చెందిన సర్వే నంబర్ 26 లో గల వెంచర్ లో గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా మద్యానికి బానిస అయినా కుమార్ ప్రతిరోజు తాగి వచ్చి ఇంట్లో భార్య నా రేణుకను వేధిస్తూ ఉండేవాడు. ఈరోజు కూడా మద్యం తాగి వచ్చిన కుమార్ తన భార్య రేణుకతో గొడవపడినాడు. దీంతో విసిగిపోయిన రేణుక ఆదివారం ఉదయం 9 గంటల టైం లో తాగి ఉన్న కుమార్ పై కారంపొడి చల్లి మెడకు కేబుల్ వైర్ మరియు చీరతో ఉరివేసి హత మార్చింది. కేసారం గ్రామానికి చెందిన వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునీ, సంఘటన స్థలాన్ని పరిశీలించి హత్యకి గల కారణాలను రేణుకను అడిగగా మద్యానికి బానిస అయిన తన భర్త కుమార్ తనను ప్రతిరోజు తాగి వేధిస్తున్నాడని, విసిగిపోయి తన భర్తను హతమార్చాలని నిర్ణయించుకొని హత్య చేసినట్టు తెలిపింది. కావున పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరవింద్ తెలిపారు.

# కొల్చారం సొసైటీలో యూరియా మాయం

- 200 బస్తాల యూరియా పక్కదారి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి) :** జిల్లాలోని కొల్చారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సిబ్బంది ఇష్టారాజ్యం... పాలకవర్గం చేతివాటం యూరియా బస్తాల కుంభకోణానికి దారితీసింది. జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతుంటే మెదక్ జిల్లాలోని కొల్చారం సొసైటీలో మాత్రం 210 బస్తాల యూరియా మాయం చేయడం వివాదానికి తెరలేపింది. వివరాల్లోకి వెళ్ళితే కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కొల్చారం సహకార సంఘానికి ఆదివారం ఉదయం 11 గంటలకు 500 బస్తాల యూరియా సరఫరా జరిగింది. కొల్చారం రైతు వేదికలో పోతన శెట్టిపల్లి, కొల్చారం ఏఈవోలు సుమారు 150 మంది రైతులకు 300 బస్తాలకు సంబంధించి టోకెన్లు రాయగా కొల్చారం సీఈవో కృష్ణ రైతు వేదిక లోనే రైతుల వద్ద డబ్బులు తీసుకొని సుమారు 130 మంది రైతులకు బిల్లులు ఇచ్చాడు. సుమారు 290 బస్తాలకు సంబంధించి డబ్బులు వసూలు చేసుకుని బిల్లులు ఇచ్చినట్లు ఏవో తెలిపారు. కాగా అప్పటికే కొల్చారం సహకార సంఘంలో మొత్తం యూరియా బస్తాలు ఖాళీ అయ్యాయి. సుమారు 210 యూరియా బస్తాలు ఎక్కడికెళ్లాయో ఎవరికి పంపిణీ చేశారు తెలియాల్సి ఉంది. ఏ ఈ ఓ లు 150 మంది రైతులకు టోకెన్లు ఇవ్వగా వారిలో చాలామందికి లభించలేదు. కొల్చారం మండలం అంసన్ పల్లి గ్రామానికి చెందిన రైతులు బేగరి శ్రీనివాస్, చంద్రం, నాయికోటి లక్ష్మణరావు లకు 146 ,147, 148 సీరియల్ నంబర్ టోకెన్ లు ఇవ్వగా వారికి యూరియా బస్తాలు లభించలేదు. 150 సీరియల్ లోపు ఉన్న చాలా మంది రైతులకు యూరియా లభించకపోవడంతో రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయానికి వచ్చి యూరియా లేకున్నా సూకెన్లు ఎలా రాస్తున్నారు అని ఆందోళన చేశారు. . దీంతో సహకార సంఘానికి ఏవో శ్వేతాకుమారి ఏఈఓ నిరోషాలు చేరుకొని యూరియా బస్తాలు సహకార సంఘం లో మాయం కావడం పట్ల సహకార సంఘం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార సంఘం సిబ్బంది, పాలకవర్గంపై తెలంగాణ ఎరువులు విత్తనాల చట్టం ప్రకారం కేసులు నమోదుచేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఏవో శ్వేతా కుమారి తెలిపారు. ఈ మేరకు కొల్చారం పోలీస్ స్టేషన్లో వారిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# ఫాదర్ బాలయ్యనగర్ పార్కు స్థలం ఆక్రమణపై కాలనీవాసుల ఆందోళన




**అల్వాల్, ఆగస్ట్ 31 (జనంసాక్షి) :** అల్వాల్ సర్కిల్ ఫాదర్ బాలయ్య నగర్‌లో హుడా లేఔట్ ప్రకారం 460 ఫ్లాట్ల కోసం 1900 గజాల స్థలాన్ని పార్క్ స్థలం కోసం కేటాయించారని కాలనీవాసులు గుర్తు చేశారు. అయితే ఆ స్థలంలో లయోలా పాఠశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి, 2011 నుండి కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. ఇక తాజాగా తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం కోసం స్థల సేకరణ పేరుతో తమ పార్క్ స్థలాన్ని ఆక్రమించడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. “మా పిల్లల కోసం కేటాయించిన పార్క్ స్థలాన్ని తిరిగి మా కాలనీకి కేటాయించి న్యాయం చేయాలి” అని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆర్నాల్డ్ జార్జ్, నిఖిల్ చిన్నపురెడ్డి, డేవిడ్ అలెగ్జాండర్, స్మిత, డాక్టర్ శ్రీనిధి తదితరులు, కాలనీవాసులు, చిన్నారులు పాల్గొన్నారు.

# రాహుల్ వ్యాఖ్యలపై అల్వాల్ బీజేపీ నిరసన



**అల్వాల్, ఆగస్టు 31 (జనంసాక్షి) :** బీహార్‌లో జరిగిన ‘వోటర్ అధికార్ యాత్ర’లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అల్వాల్ సర్కిల్ బీజేపీ శ్రేణులు ఆదివారం రోజు ఆందోళన నిర్వహించారు. రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల అనుమతి లేకుండా దిష్టిబొమ్మ దహన ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకుని కొందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాణిక్యరెడ్డి, మల్లికార్జున గౌడ్, కార్తీక్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, మురళి, రవికిరణ్, కరుణశ్రీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసమే 42 శాతం బీసీల రిజర్వేషన్



**మొయినాబాద్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు రాష్ట్ర శాసన సభలో ఏకతీర్మాణం కావడం బీసీలందరూ హర్షించదగ్గ విషయమని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు రెండురోజులు ఆదివారంతోనే ముగిశాయని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన బిల్లులు రూపొందించిన సర్కార్ దానిని అసెంబ్లీలో అన్ని పార్టీలు కలిసి ఏకగ్రీవ తీర్మాణం చేయడం బీసీల వర్గానికి ఎంతో మేలు అని అన్నారు. సామాజిక తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ కలలు తెలంగాణ రాష్ట్రంలో ఈరోజు అసెంబ్లీ సమావేశాల్లో సాకారం అయిందన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి డిక్లరేషన్ లో చేసిన తీర్మాణానికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాలలో అన్ని పార్టీల సమక్షంలో బీసీలకు దారి చూపిందన్నారు. దీనికి ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ ల కృషితో రిజర్వేషన్ల కల్పన రాష్ట్ర మంత్రి ఆమోదించి రాష్ట్ర శాసన సభలో అన్ని పార్టీతో ఏకతీర్మాణం చేసుకోవడం ఎంతో విశేషం అన్నారు. రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాలలో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఇది ఎంతో అవకాశం అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అన్ని పార్టీలు శాసన సభలో ఆమోదిస్తు హర్షం వ్యక్తం చేయడం తెలంగాణ అన్ని రాజకీయ పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కొనసాగించే విధంగా ప్రభుత్వం అసెంబ్లీలో ఈ తీర్మాణం తీసుకురావడం జరిగిందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రంలోని బీసీ ముద్దుబిడ్డలకు ఎంతో పరిణామం అని ఆయన అన్నారు.

## బీజేపీలోకి భారీ చేరికలు



**మొయినాబాద్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ నుండి బిజెపిలో చేరిన నాయకులు మొయినాబాద్ మండల పరిధిలోని అప్పరెడ్డి గూడా గ్రామంలో బిజెపిలో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం నేతృత్వంలో గ్రామం నుండి అనేక ప్రముఖ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా బిజెపిలో చేరారు. కేఎస్ రత్నం మాట్లాడుతూ... దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీ నాయకులు బిజెపి పార్టీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. గ్రామ అభివృద్ధి రాష్ట్ర ప్రగతి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజన్ తో కట్టుబడి పని చేయడానికి నాయకులకు స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో చన్వెల్లి ప్రభాకర్ రెడ్డి, పట్లోళ్ల ప్రభాకర్ రెడ్డి, క్యామ పద్మనాభం, మండల అధ్యక్షులు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మోర నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజం సుస్థిరతకు మూలం సీనియర్ సిటిజన్లు



**హయత్ నగర్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ ప్రగతి నగర్ కాలనీ లోని సీనియర్ సిటిజన్ సంక్షేమ భవనంలో “ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్” ఆధ్వర్యంలో ఇండోర్ గేమ్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు తమ ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలిచిన వారికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆగస్టు 31వ తేదీన పుట్టినరోజు జరుపుకుంటున్న సీనియర్ సిటిజన్లను సన్మానించి, వారికి మిఠాయిలు తినిపించారు. గణేష్ నగర్ కాలనీలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం, వివేకానంద నగర్ కాలనీ, మల్లికార్జున్ నగర్ కమాన్ రోడ్డు వేయడం జరిగిందని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, సత్యనారాయణ, రామ్ రెడ్డి, బ్రహ్మారెడ్డి, సోమిరెడ్డి, సత్యనారాయణ రావు, నవనీత్ రావు, రామచంద్రారెడ్డి, అమృతా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం మోడీకి రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి



**మర్పల్లి, ఆగస్ట్ 31 (జనంసాక్షి) :** తన యావత్ జీవితాన్ని దేశసేవ కోసం అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి పై చేసిన వ్యాఖ్యలకు గాను పీఎం మోడీ కి రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి మండల బిజెపి అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి అన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ బీహార్ ఎన్నికల ప్రచారంలో నోరుతో చెప్పావని దుర్భాష జాలంతో నరేంద్ర మోడీ మాతృమూర్తిని దుర్భాషలాడినందుకు గాను మర్పల్లి మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన అధికారం చేపట్టేది ఎన్డీఏ నని వారన్నారు. బీహార్ ఎన్నికల్లో పత్రికల ప్రకటనకు తెలంగాణ రాష్ట్ర ప్రజల సొమ్మును రేవంత్ రెడ్డి దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణం పాఠం చెప్పేందుకు వేచి చూస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బలరాం గౌడ్, మండలం ప్రధాన కార్యదర్శి శ్రీమంత్ కుమార్, నాగన్న జైపాల్, శ్రీకాంత్, గణేష్, రమేష్ సంగమేశ్వర్ మాణిక్యం, అమర్నాథ్, ఆనందం, గోపాల్,మధు, కృష్ణ, సంగమేష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

## బిజెపి నాయకుల అరెస్టులు

**మోమిన్‌పేట, ఆగస్టు 31 (జనం సాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాతృమూర్తి పై కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం మోమిన్ పేట మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని అధికారం బలంతో పోలీసు వారు అడ్డుకోవడం జరిగింది ఇలాంటి అడ్డంకులు ఎన్ని వచ్చినా నిరసనలు తెలుపుతామని మోమిన్ పేట మండల అధ్యక్షులు ఆశిరెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి మహిపాల్ రెడ్డి బీజేవైఎం జిల్లా ఆ ఆర్ టి ఐ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి యువ మోర్చా పట్టణ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొనడం జరిగినది.

# ఎజెండాలో లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై సభ నిర్వహించడం సమంజసమా..?

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బద్నాం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని బిఆర్.ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమావేశాల్లో ఎజెండాలో లేకుండా కాలేశ్వరం ప్రాజెక్టుపై పి సి గోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను చర్చించాలంటూ సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి హై కమాండును ప్రసన్నం చేసుకునే పనిలో భాగంగా ముఖ్యమంత్రి కేరళకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు వరదలు, యూరియా కొరత, తో పాటు పలు ప్రజా ప్రజా సమస్యలపై చర్చించేందుకు తమ సభ్యులందరూ హాజరయ్యారని తెలిపారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు నిమిషం నిమిషం ఎంతో ఖర్చుతో కూడుకున్నవని అలాంటి అసెంబ్లీ సమావేశాలను కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కెసిఆర్‌ను విమర్శించడమే ధ్యేయంగా సభను నడుపుతున్నట్లుగా అనిపిస్తుంది అన్నారు. రాజకీయంగా మమ్ములను ఎదుర్కోలేక పిసి గోష్ కమిషన్‌ను అడ్డంపెట్టి మాపై దాడి చేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. 42% బీసీ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రిజర్వేషన్లపై షెడ్యూల్ తొమ్మిది లో పెట్టాలని నిపుణులు చెబుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అవి పట్టించుకోకుండా కేసీఆర్‌పై నిందలు మోపుతున్నారని ఆరోపించారు. బీసీ ఘోష్ మిషన్ కేవలం కాంగ్రెస్ పార్టీ కమిషన్ గా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి జీవనాధారంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకుంటూనే ప్రాజెక్టు విఫలమైందని విమర్శించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదని ప్రజల పట్ల బాధ్యతగా



వ్యవహరించవలసిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో అందరితో చర్చించి ప్రజా సమస్యల పరిష్కారం ధ్యేయంగా చర్చలు జరిగే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని ఆయన హితవు పలికారు.

# రాజకీయాలు పక్కన పెట్టి సమస్యను పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి



**మక్తల్, ఆగస్టు 31 (జనంసాక్షి) :** యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున 3 గంటలకే రైతులు యూరియా కోసం లైన్లలో నిలబడాల్సి వస్తుందని, 14 ఎకరాలున్న రైతుకు ఒక బస్తా యూరియా ఏ మాత్రం సరిపోతుందని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. తన నియోజకవర్గం అభివృద్ధి కోసమే ఇకపై నిరంతరంగా పోరాడుతానని, రాజకీయాలు పక్కన పెడుతున్నానని ఆయన తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ యూరియా కొరతపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేంద్రంలో తమ ప్రభుత్వం లేదని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. అయితే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ కేంద్రంలో బీజేపీ అధికారంలోనే ఉన్నప్పటికీ యూరియా కొరత రాలేదని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టే కొరత లేకుండా చూసుకున్నారని అన్నారు. స్థానిక నాయకులు తమ బంధువులకు ఫర్టిలైజర్ షాపులు పెట్టిస్తున్నారని, యూరియాను బ్లాక్‌లో అమ్ముకుండా రైతులకు నేరుగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల తరపున తాను యూరియా అడిగితే రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో తనపై వ్యంగ్యంగా మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాజకీయాలను పక్కన పెట్టి రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరారు. వ్యవసాయ అధికారులు వెంటనే స్థానిక షాపులను తనిఖీ చేసి బ్లాక్ దందాను అరికట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా భూసేకరణ విషయంలోనూ రైతులకు సరైన ధర చెల్లించి భూములు సేకరించాలని రాంమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జుట్ల చిన్న హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## జలసంపదను పెంచిన కేసీఆర్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, ఆగష్టు 31 (జనంసాక్షి) :** వరదనీటిని ఒడిసిపట్టి జలసంపదను పెంచిన మహామహుడు కేసీఆర్ అని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కీర్తించారు.వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో నిండు కుండలా మారిన పలు చెరువులు, కుంటలను మాజీ మంత్రి ఆదివారం సందర్శించి జలపూజలు చేశారు. వనపర్తి మండలం తిరుమలయ్య గుట్ట ఫారెస్ట్ నందు నిర్మించిన తిరుమలయ్య కుంట, పెద్దగూడెం తండా, ధీద్య కుంటల ఆయకట్టుదారులతో కలిసి కలసి సందర్శించి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వయంగా రైతులతో కలసి ట్రాక్టర్ నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ హయాములో ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి వృథా కాకుండా నీళ్లను ఎక్కడికక్కడ చెక్ డ్యాంలు,కుంటలు నిర్మించి కాపాడిన ఘనత కె.సి.ఆర్ దని కొనియాడారు.తన హయాములో తిరుమలయ్య గుట్ట అటవీ ప్రాంతములో ఉన్న చిన్న కుంటను , పెద్దగూడెం తండా ధీద్య కుంటను ఆధునీకరించి చెరువులను తలపించే విధంగా పునర్నిర్మించామని అన్నారు. ఈ కుంటల వల్ల చాలా ఏండ్లుగా గిరిజన రైతులు తమ సొంత పొలాలతో పాటు పోడు భూములను సాగు చేసుకొనేవారని, ఆనాటి పరిస్థితులలో నీళ్లు లేక చాలా ఇబ్బంది పడేవారని, కుంటల నిర్మాణంతో రైతులకు సాగునీరుతో పాటు ఆటవి జీవులకు త్రాగునీరు అవకాశం కలిగి పశు పక్షాధులకు ఈ ప్రాంతములో అభివృద్ధి చెందాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న 32మంది రైతులకు పట్టాలు ఇచ్చామని, గుర్తించబడ్డ 62మంది రైతులు ఇంకా మిగిలారని, మా ప్రభుత్వం వచ్చిన వెంటనే వారికి కూడ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్,కె.మాణిక్యం,రవిప్రకాష్ రెడ్డి, మాధవ్ రెడ్డి, నరేష్,దేవర్ల నరసింహ,మహేశ్వర్ రెడ్డి,ధర్మా నాయక్,ఎర్వ సాయిప్రసాద్, సునీల్ వాల్మీకి,చిట్యాల రాము, జోహేబ్ హుస్సేన్, కొండన్న, తిరుమలయ్య, కృష్ణా నాయక్,టేక్యా నాయక్, నారాయణ నాయక్, చత్రూ నాయక్ తదితరులు ఉన్నారు.

## నూతన ఎస్సీ హాస్టల్ భవనాన్ని నిర్మించాలి



**మక్తల్, ఆగస్టు 31 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణ ప్రాంతంలో ఎస్సీ హాస్టల్ ను బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ కమిటీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కె వి నరసింహ హాస్టల్లో విద్యార్థులను స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పిల్లలకు సరైన ఆహారం మెనూ ప్రకారం అందించాలని అయన డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని తొలగించి యధా స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పరుశురాం, మక్తల్ పట్టణ అధ్యక్షులు జి లక్ష్మన్, మక్తల్ మండలం అధ్యక్షులు జె భీమేష్, మారుతీ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీకి రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

**కల్వకుర్తి, ఆగస్టు 31 (జనం సాక్షి) :** భారత ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి కీర్తిశేషులు లు హీరా బెన్ ని బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీలో దుర్భాషణలు చేసిన రాహుల్ గాంధీ వేంటనే నరేంద్ర మోడీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బిజెపి నాయకులు కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి అయినటువంటి నరేంద్ర మోడీ తల్లి కీర్తిశేషులు హీరా బెన్ని పై చేసిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలని రాజకీయ నాయకులు పరస్పరం విమర్శలు చేసుకోవాలి కానీ నరేంద్రమోడీ మాతృమూర్తి పైన రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని లేనియెడల దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని బిజెపి నాయకులు హెచ్చరించారు. భారతదేశానికి మూడుసార్లు ప్రధానమంత్రి అయినటువంటి నరేంద్ర మోడీ వారి తల్లిపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దేశంలో మూడుసార్లు ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ అది జీర్ణించుకోలేక మతిస్థిమితం కోల్పోయి రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారని




దేశం కోసం చేస్తున్న నరేంద్ర మోడీ కృషిని ఏ ఒక్కరు కూడా మర్చిపోరని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ నరసింహ, జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నీరుకంటి రాఘవేందర్ గౌడ్, నరెడ్ల శేఖర్ రెడ్డి, పాలకూర్ల రవి గౌడ్,చందు ముదిరాజ్, పానుగంటి శివ కుమార్, తగుల వెంకటేష్ యాదవ్, కిరణ్ కుమార్ యాదవ్, వాకిటి శ్రీకాంత్, లక్ష్మీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లించాలి

● మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



**పాపన్నపేట, ఆగస్టు 31 (జనంసాక్షి) :** భారీ వర్షాలు వరదలతో పంటలు నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వం ఎకరానికి రూ. 25 వేల నష్ట పరిహారం చెల్లించాలని భారాస మెదక్ జిల్లా అధ్యక్షురాలు,మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ముద్దాపూర్,రామతీర్థం,కుర్తివాడ,ఆరెపల్లి,గాంధారిపల్లి,ఎల్లాపూర్ గ్రామంలో ముంపుకు గురైన రోడ్లను,చెరువు కాల్వలను,పంట పొలాలను ఆదివారం క్షేత్రస్థాయిలో నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాణ నష్టం జరిగిందని విమర్శించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏడుపాయల టేకుల గడ్డ ప్రాంతంలో బాధితులను హెలికాప్టర్ ద్వారా రక్షించామని గుర్తుచేశారు. వరద ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి,నాయకులు..కొత్తూరి స్రవంతి శ్రీనివాస్,తాడేపు సోములు,కుమ్మరి జగన్,బాబాగౌడ్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ పదవి విరమణ తప్పదు



**చిన్నశంకరంపేట, ఆగస్టు 31 (జనం సాక్షి) :** చిన్న శంకరంపేట విద్యుత్ సబ్ స్టేషన్ లో పనిచేస్తున్న దిగంబరు పదవి విరమణ పొందారు. పలువురు కార్మిక సోదరులు సెక్షన్ కాంట్రాక్టర్లు విచ్చేసి అభినందనలు తెలిపారు. శంకరంపేట ఏఈ. దినకర్ పదవీ విరమణ పొందిన దిగంబరును మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

**కృష్ణ, ఆగస్టు 31 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బి ఆర్ ఎస్ విజయం ఖాయమని కృష్ణ మండల బిఆర్ ఎస్ నాయకులు గుడెబల్లూర్ మాజీ సర్పంచ్ అమరేష్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ కాంగ్రెస్ పార్టీలను ప్రజలు ఏ మాత్రం నమ్మే విధముగా లేరని ఆ రెండు పార్టీలపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపుగా 20 నెలలు గడుస్తున్న పరిపాలన చేత కాక అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందనీ విమర్శించారు. సామాన్య ప్రజలకు అమలు కానీ హామీలను ఇచ్చి ఓట్లు వేయించుకొని ప్రజలను నిలువెత్తుగా మోసంచేశారాని గ్రామాలలో ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గులాబీ జెండాను ఎగరవేయడం ఖాయమని తెలియాచేశారు. గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులని సర్పంచ్‌లుగా గెలిపించు కోవడానికి ప్రతి కార్యకర్త అహర్నిశలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకు డు గోనిపాటి



వెంకటేష్, చెవిటోళ్ళ సురేష్, గ్రామ అధ్యక్షులు సంతోష్, యర్మల్ అంజనేయులు, తిక్క వెంకటేష్, గిర్ని శంక్రప్ప, శివప్ప, అలుకటి సురేష్, గూబయోళ్ల మహేష్, కనకప్ప, లొట్టి అశోక్, పంతిగి అంజప్ప, బుడ్డమోళ్ళ మహేష్, వట్టేవొళ్ళ రాజు, బుగ్గప్ప, నాగప్ప, మ్యాతారి తాయప్ప, కొత్తపల్లి తాయప్ప, వజ్రం తిమ్మప్ప కుర్వ సాబుల్,బొంబాయి రాంచందర్, జెర్కల్ నర్సప్ప, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు




● జిల్లా యస్పి పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, ఆగస్టు 31 (జనం సాక్షి) :** శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు అనగా సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్.పి. పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేనిది ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించే, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఇందిరా పార్క్ మహా ధర్నాకు తరలిరండి




**కృష్ణ, ఆగస్టు 31 (జనం సాక్షి) :** ఓపిఎస్ సాధన కోసం సెప్టెంబర్ 1న పిఆర్టియు ఆధ్వర్యంలో ఇంద్ర పార్క్ దగ్గర నిర్వహించే మహా ధర్నాకు తరలి వచ్చి విజయవంతం చేయాలనీ కృష్ణ మండల పిఆర్ టియు అధ్యక్షుడు దండు శేఖర్, గౌరవ అధ్యక్షులు ఎన్ శివరాజ్, ప్రధాన కార్యదర్శి ఎం ఆర్ అజయ్, అసోసియేట్ అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు తిరుమలరావు, కార్యదర్శి వి రామకృష్ణ, ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు కనీసం పెన్షన్ కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంలో పిఆర్ టియు రాష్ట్ర సంఘం పిలుపుమేరకు మండలంలోని ఉపాధ్యాయులు అందరూ సోమవారం నిర్వహించే సిపిఎస్ ధర్నాని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కౌడిపల్లిలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**కౌడిపల్లి, ఆగస్టు 31 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లిలో ఆదివారం రోజు భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ అతని అనుచరులు బీహార్ ఎన్నికల ప్రచార యాత్ర కార్యక్రమంలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ, పైన మరియు మోదీ, తల్లి పైన అసభ్య కరమైన అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా బిజెపి కౌడిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ గారి



చిత్రపటాన్ని దహనం చేయడం జరిగిందని రాజేందర్ అన్నారు. ఇంకోసారి ప్రధాని మోదీ గారిపైన గాని మోధీ తల్లి పైన గాని అసభ్య పదజాలంతో మాట్లాడితే ఊరుకునేది లేదని రాజేందర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ రాజేందర్, మండల అధ్యక్షులు రాకేష్, మండల ప్రధానకార్యదర్శి లక్ష్మణ్, మండల కార్యదర్శి కృష్ణ పటేల్, ఉపసర్పంచ్ శేకులు, వార్డ్ మెంబెర్స్ గొల్ల మలేష్,ఒబిసి మోర్చామండల అధ్యక్షులు విష్ణు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బాల్ లింగం, బూత్ అధ్యక్షులు పాపయ్య, ఆంజనేయులు, నర్సిములు, హరీష్, శాఖయ్య ,భాస్కర్ నాయక్, అనిల్, శ్రీకాంత్,కొమురయ్య, కుర్మ మలేష్, బిక్షపతి, పెంటయ్య, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## 2028 ఎన్నికల్లో బిసి జెండాను ఎగరవేయాలి

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**బోడుప్పల్, ఆగస్టు 31 (జనంసాక్షి) :** 2028 ఎన్నికలలో బీసీ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. ఆదివారం జనగామ నియోజకవర్గానికి చెందిన కొత్తపల్లి సతీష్ కుమార్ పీర్జాదిగూడ లోని బిసి పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తెలంగాణ బిసి పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. తన మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బిసి రాజ్యం స్థాపన కోసం అందరు ఏకతాటిపైకి వచ్చి కట్టుగా శ్రమించాల్సిన అవసరం ఉందని, 2028 ఎన్నికల్లో బిసి జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. తర్వాత మల్లన్న, కొత్తపల్లి సతీష్‌కు బిసి పొలిటికల్ జేఏసీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కొత్తపల్లి సతీష్ మాట్లాడుతూ మల్లన్న నాయకత్వంలో రాబోయే పార్టీలో భాగస్వామ్యమై కలిసి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు బిసి పొలిటికల్ జేఏసీ నేతలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర నిరసన

**నారాయణపేట జిల్లా బ్యూరోక, ఆగస్టు 31 (జనం సాక్షి) :** బీహార్ పర్యట నలో కాంగ్రెస్ అగ్రనేత రాహు ల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిర సిస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆదివారం బిజెపి కార్యకర్తలుభగ్గుమన్నారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి నాయకులు కార్యకర్త లు నల్లబ్యాడ్జీలు ధరించి రాహుల్ గాంధీ కి,కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు తల్లి కానీ దేశం పట్ల ఎలాంటి అభిమానం లేదని అన్నారు.అసలు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తల్లిని రాహుల్ గాంధీ దూషించడం పట్ల



మండిపడ్డారు. ప్రధానిని తల్లి కడుపున ఎలా పుట్టావని దూషించడం ఆతల్లి విలువ తెలియని వారే అలా మాట్లాడుతానని అన్నారు. తల్లిదండ్రులకు,దేశానికి విలువ ఇవ్వని ఈ నాయకుల నుంచి ఇంత కంటే ఏమి ఆశిస్తామని అన్నారు.కానీ తల్లి దండ్రులు,దేశాన్ని గౌరవించని వారు కాలగర్భంలో కలిసి పోయారని అన్నారు.రాహుల్ గాంధీ నోరు అదుపులో పెట్టుకోనీ మాట్లాడాలని హితవు పలికారు.లేకపోతే దేశ ప్రజలు తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,రాష్ట్ర నాయకుడు కేంచే శ్రీనివాసులు,పట్టణ అధ్యక్షుడు పి.వినోద్ కుమార్,మండల బిజెపి అద్యక్షులు జ్యోతి,నాయకులు కృష్ణ,సత్య రఘుపాల్,రమేష్,లప్ప అశోక్,వై.నారాయణరెడ్డి,గోపాల్ యాదవ్,నక్క నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వాధ్యుల నిర్మూలనపై నిర్లక్ష్యం

- నిల్వ నీటి పారబోత అంతంతే..
- ప్రతి వారం పక్కా ప్రణాళిక కరువు
- వారానికోసారి వార్డు అంతటా చేపట్టడంలో విఫలం
- ప్రజలకు అవగహన కల్పించడంలో వైఫల్యం





ఖానాపూర్ టౌన్ ఆగస్టు 31(జనం సాక్షి): జన నివాసాల్లో నిల్వనీరు రోజుల తరబడి అలాగే ఉండటం కారణంగా ఎక్కడపడితే అక్కడ మురుగు నీరు, చెత్త చెదారం పేరుకుపోవడంతో ప్రాణంతకమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రధానంగా నిల్వనీరు నివాసాల్లో రోజుల తరబడి ఉండటం వల్ల సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది. నిల్వనీరు పారబోత కార్యక్రమం ఖానాపూర్ మున్సిపాలిటీలో అంతంత మాత్రంగానే కొనసాగుతుందని విమర్శలున్నాయి . సీజనల్ వాధ్యులు దరిచేరకుండా ఉండేందుకు ప్రజలకు నిల్వనీటిని పారబోసేలా అవగాహన కల్పించాల్సి ఉంది. ఖానాపూర్ మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో ప్రజలకు అవగహన కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలం చెందుతున్నారనే ఆరోపణలున్నాయి.మున్సిపాలిటీలో 100 రోజులు ప్రణాళికలో భాగంగా ప్రతి రోజు, డ్రైడే-ఫైడేతో నిర్ణీత సమయంలో కార్యక్రమం చేపట్టడం మినహ ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడం శోచనీయం మూడు రోజులకు మించి నిల్వనీరు ఉంటే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వీటిపై ప్రజలకు అవగహన పెంచేందుకు మున్సిపాలిటీలో వార్డు అధికారులు, మెప్మాలోని ఆర్పీలు ఇద్దరు ముగ్గురు ఉన్నప్పటికి ప్రజా అవగహనపై ప్రభావం కనిపించడం లేదు. ప్రతి శుక్రవారం మున్సిపాలిటీలోని ఒక వార్డులో కార్యక్రమం చేపట్టి ప్రజలకు అవగహన కల్పించాల్సి ఉన్నప్పటికి శివారు ప్రాంతాలపై కన్నేత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. కనీసం వార్డు మొత్తం సీజనల్ వాధ్యలపై అవగహన సందేశం అందట్లేదనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 5వేల వరకు నివాసగృహాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు కనీసం ఆ వార్డు అధికారి, ఆర్పీలలలో ఎవరికో ఒకరికి బాధ్యత ఇచ్చి 100 రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాల్సి ఉంది. జిల్లా అధికారులు, ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చేపడుతున్న కార్యక్రమాలను మాత్రమే ఆధారబాధరగా చేసి మమ అనిపిస్తున్నారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ఫిబ్రవరి 10న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య పనులు చేశాక ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ ను సంతకాల రూపంలో సేకరించాలని సూచించారు. కానీ చాల వరకు శివారు ప్రాంతాల్లో కలెక్టర్ సూచనలు అమలు కావడంలేదనే విమర్శలున్నాయి.సీజనల్ ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో అధికారుల సమర్థవంతమైన ప్రణాళిక లేకపోవడంతో సీజనల్ వ్యాధుల నిర్మలనపై అశించిన మార్పు కనిపించడం లేదు.

### డ్రైడే- ఫ్రైడే పక్కగా అమలు చేస్తాం : సుంధర్ సింగ్, మున్సిపల్ కమీషనర్, ఖానాపూర్



వారంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే- ఫ్రైడే కార్యక్రమాన్ని పక్కగా అమలు చేస్తున్నాం. వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలను ప్రతి ఇంటికి వేళ్లి సీజనల్ వ్యాధులపై అవగహన కల్పించి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించడం జరిగింది. ప్రజలు సైతం పారిశుద్ధ్య కార్యక్రమాలకు తమ భాగస్యామ్యం అందించాలి.

### మురుగు నిల్వలపై ధ్యాస పెడతారా?

వర్షాకాలంలో పలు కాలనీల్లో ఇండ్ల మధ్యన నీరు నిలిచిపోవడంతో దోమలకు అవసాలుగా మారి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది. అంతేగాక పిచ్చి మొక్కలు పెరిగి పాములు ఇతర విషపురుగులు, ఎలుకలు ఆశ్రయాన్ని కల్పిసుడటంతో ప్రజలే భయాందోళనలకు గురవుతున్నారు. నిలిచిపోయిన నీరు, చెత్త చెదారం వల్ల దుర్వాసన వెదజల్లుతూ మొత్తం పరిసరాలు అనారోగ్యకరంగా మారుతున్నాయి. వీటన్నింటిపై ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ నిధులతో తక్షణ చర్యలు చేపడితే కొంత మేలు జరగే అవకాశం లేకపోలేదు. నీటిని నిల్వ ఉంచడం ప్రమాదకరమని విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం అధికారులపై ఎంతైన ఉంది.





# చాక్‌పీస్‌పై వినాయకుడి కళాఖండం

- ఔరా అనిపిస్తున్న శ్రీకాంత్ చెక్కిన చిత్రాలు
- ఓవైపు వ్యవసాయం మరోవైపు చిత్రకళపై రాణింపు

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** అతనో సాధారణ యువరైతు. అతని చేతిలో అద్భుతమైన చిత్రాలు గీసే ఓ కళ దాగి ఉంది. కానీ ఆ యువకుని కలను ఎవరు గుర్తించలేదు. అతని చేతిలో దాగి ఉన్న శిల్ప కళను జనంసాక్షి దినపత్రిక గుర్తించి బయట ప్రపంచానికి తెలియ పరిచింది.వివరాల్లోకి వెళ్తే ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లోని దేగామ గ్రామంలో దాసరి శ్రీకాంత్ నివసిస్తూ ఉంటాడు. సాదా సీదాగా ఉంటూ గ్రామంలో అందరిలో కలిసి మెలిసి ఉంటాడు. నిత్యం వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉంటాడు. ఐతే శ్రీకాంత్ వ్యవసాయ పనులు చేస్తూనే మరోవైపు తనలో దాగి ఉన్న చిత్ర కళపై ఆసక్తి కనబరుస్తున్నాడు. అతనికి ముందునుంచి చిత్రాలను గీసే అలవాటు ఉండడంతో ఆ కళను ఇప్పటికీ కొనసాగిస్తున్నాడు. తెల్లటి చాక్పీస్ లపై పలు రకాల దేవుళ్ళ ప్రతి రూపాలను చెక్కుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు వినాయకుడి చిత్రంను చెక్కి ఔరా అనిపించాడు. శ్రీకాంత్ చెక్కిన ఈ చిత్రాలను చూసి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.కేవలం చాక్పీస్ లపైనే కాకుండా తెల్లటి పేపర్ లో మంచి మంచి సందేశాత్మక చిత్రాలు కూడా వేస్తూ అందరి మన్ననలను పొందుతూ వస్తున్నాడు. ఇతను గీసిన చిత్రాలు ఎంతో మంత్ర ముగ్ధుల్ని చేస్తున్నాయి.



## పదవీ విరమణ పొందిన ఉద్యోగులు..
# ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే..




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలంగా సేవలందించి పదవి విరమణ పొందిన ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ఏస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేసి పదవి విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ముఖ్య అతిథిగా హాజరై రిటైర్డ్ అయిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు సేవలు అత్యంత కఠినమైనవేనని, కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం నిరంతరం శ్రమించి, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విధులను విజయవంతంగా నిర్వహించారని అన్నారు. పదవి విరమణ తర్వాత ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలని, ఇకపై కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని కోరారు. అనంతరం రిటైర్డ్ అయిన ఆర్ఎస్సై వి.సురేందర్ రెడ్డి, ఎఎస్సై ఎ. మహేందర్, ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎండి తాజుద్దీన్ లను ఘనంగా సన్మానించి, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, ఆపరేషన్ ఆర్ఐ నగేష్, పోలీస్ సంఘం ప్రతినిధి మర్కాల యాదిరెడ్డి, రిటైర్డ్ సిబ్బంది కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కించాలి

- ఉద్యోగ జేఏసీ చైర్మన్ ను కోరిన ఆర్‌బిఎస్‌కే రాష్ట్ర నేత సంజీవ్ నాయక్

**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 31 (జనంసాక్షి):** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు మారం జగదీశ్వర్ జనరల్ సెక్రటరీ ఏలూరు శ్రీనివాసరావును హైదరాబాద్ లో కలిసి వినతి పత్రం అందజేసిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల రాష్ట్ర నేత ఆర్.బి.ఎస్.కె ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ భానోత్ సంజీవ్ నాయక్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 2వ తేదీన ఉద్యోగ జేఏసీతో చర్చలకు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయగలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు పిఆర్సి లు వేతనం పెంపుదల పెండింగ్ ఏరియల్స్ త్వరగా ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించి మహిళలకు 180 రోజుల వేతనంను మంజూరు చేయాలని వారు కోరారు.

# రైతులకు సరిపడా యూరియా అందించాలి

- గణపురం పిఎసిఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి



**గణపురం, ఆగస్టు 31 (జనంసాక్షి):** యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించాలని గణపురం సోసైటీ మాజీ చైర్మన్, గండ్ర యువసేన ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులకు కనీసం యూరియా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులను అనేక ఇబ్బందులను గురించేస్తుందని, రైతుబంధు, రుణమాఫీ, రైతులకు గిట్టుబాటు ధర విషయంలో మాట తప్పిందని కనీసం రైతులకు పంట నష్టం జరిగినా పట్టించుకోలేదని, యూరియా కూడా ఇవ్వని పరిస్థితికి కారణం వహించి, ఇప్పటికైనా ప్రభుత్వం భాధ్యత తీసుకొని యూరియా అందించాలని కోరారు.ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి , జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జిల్లా యంత్రాంగం, మార్క్ ఫెడ్, అధికారులు స్పందించి సరఫరా వేగవంతం చేయాలని ఆయనవిజ్ఞప్తి చేశారు.

## బిజెపి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ
# దిష్టిబొమ్మ దహనం



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 31 ( జనం సాక్షి ) :** బీహార్ ఎన్నికల సమావేశంలో రాహుల్ గాంధీ సమక్షంలో దేశ ప్రధాని నరేంద్ర మోడి మాతృ మూర్తి పైన చేసి న అనుచిత వ్యాఖ్యలకు నీరసనగా బిజెపి జిల్లా అధ్య క్షుడు సౌద రమేష్ ఆదేశానుసారం,జిల్లా ప్రధాన కార్య దర్శి ఐలోని అంజి రెడ్డి సూచన ప్రకారం చిల్పూర్ మండల కేంద్రంలో బిజెపి చిల్పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బిజెపి చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నే శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, మండల నాయకులు ఊరటి రాజు ముదిరాజ్,కన్నెబోయిన రవి యాదవ్, తోట రంజిత్,తోట శ్రీనివాస్, పొలాబోయిన జోగులు, కట్ల అనిల్ కుమార్ ముదిరాజ్, దోరం శ్రీనివా స్ యాదవ్, కందుకూరి రజినీకార్, రమేష్, సంపత్, బిజెపి జిల్లా,మండల,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ, ఆయన తల్లిపై అవమానకర వ్యాఖ్యలు సిగ్గుచేటు

- విద్వేషం వెదజల్లడమే రాహుల్ గాంధీ నైజం
- రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి..




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దేశం అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీని అకారణంగా దూషించడమే గాక, ఆయన తల్లిపై కూడా అనుచిత వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తలు చేయడం సిగ్గుచేటని బిజెపి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషిధర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు బిజెపి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ద్వేషపూరిత పార్టీ అని, దానికి విలువలంటూ లేవని, విద్వేషాలను రెచ్చగొట్టడమే ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నైజమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ అధికార్ యాత్ర పేరుతో బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమాల్లో ఆ పార్టీ కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోడీ ఆయన తల్లి పై అభ్యంతరకర రీతిలో వ్యాఖ్యలు చేయడం, దానిని రాహుల్ గాంధీ ఖండించకపోవడం ఆయన విష సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. జరిగిన దానికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ వెంటనే ప్రధాని మోదీకి, ఆయన తల్లికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతోందని, అభివృద్ధి సంక్షేమమే ఓట్లు తెస్తుందని, ఇలా దిగజారుడు వ్యాఖ్యలతో కాదని కాంగ్రెస్ పై ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, రాష్ట్ర నాయకులు బట్టు రవి, జిల్లా ఐటీ సెల్ ఇంచార్జ్ సుతాటి వేణురావు, నాయకులు చీర్ల అశోక్ రెడ్డి, గుండెకారి గణేష్, ఎర్ర రాకేష్ రెడ్డి, మాచినేని రవీందర్, శివకృష్ణ, నరహరి, నేరెళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సాగుదారులపై కఠిన చర్యలు

**నేరడిగొండ, ఆగస్టు31 (జనంసాక్షి) :** భారీ వర్షాల కారణంగా పంట దిగుబడి రాకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై మండల పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారని స్థానిక ఎస్ ఐ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.శనివారం సాయంత్రం విశ్వసనీయత సమాచారం ప్రకారం నేరడిగొండ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఇమ్రాన్ పోలీస్ సిబ్బందితో గోవింద్‌పూర్ గ్రామ శివారులో జాదవ్ రాజు, విజేష్ రాథోడ్ అనే వ్యక్తుల వ్యవసాయ క్షేత్రాన్ని తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా జాదవ్ రాజు వ్యవసాయ క్షేత్రంలో 57గంజాయి మొక్కలు విలువ సుమారు రూ.2లక్షల 85 వేలు అంచనా,విజేష్ రాథోడ్ (39) తన పత్తి పంట మధ్యలో 23 గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు.నిందితులు గతంలో కూడా సాధారణ పంటలు పండించినప్పటికీ, భారీ వర్షాల కారణంగా తగినంత దిగుబడి రాకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి సాగుకు పాల్పడ్డారు. గంజాయి మొక్కలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.23 గంజాయి మొక్కలు విలువ సుమారు రూ.1లక్ష 15వేలు ఉంటుందని అంచనా. నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు, చట్టవిరుద్ధమైన గంజాయి సాగు రవాణా అమ్మకాలపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

### ప్రజాసేవలో ఆదర్శంగా నిలిచిన తోట ఇందిరా-భీమేశ్వర్

- ఘనంగా పదవీ విరమణ మహోత్సవం



**ఖానాపూర్ టౌన్ ఆగస్టు 31 (జనంసాక్షి) :** ఖానాపూర్ పట్టణానికి చెందిన తోట ఇందిరా గారు 35 సంవత్సరాల పాటు ఆరోగ్యశాఖలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన సందర్భంగా పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్ లో ఘనంగా సన్మాన మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యమనికి ముఖ్య అతిథులుగా భూక్య జాన్సన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ పదవీ విరమణ పొందినా ప్రజాసేవను మాత్రం ఇందిరా గారు ఎప్పటికీ విడువలేదని, ప్రజల ఆరోగ్య సంరక్షణలో తన సేవలు మరచిపోలేనివని తెలిపారు. తన కృషి, అంకితభావం కొత్త తరాలకు స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనని ఫౌండేషన్ చైర్మన్ తోట సుమిత్ ఆధ్వర్యంలో ఖానాపూర్ మున్సిపాలిటీ సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేయడం విశేషంగా మారింది. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సహచరులు, బంధుమిత్రులు, నాయకులు, అధికారులు మొదలగు వారు పాల్గొని తోట ఇందిరా సేవలను ప్రశంసించారు.

# యూరియా కోసం రైతుల పాట్లు

- యూరియా బస్తాలు 444.. రైతులు వచ్చింది 500 పైగా..
- పాలకుర్తి ఎఫ్ఎస్సీఎస్ వద్ద బారులు



పాలకుర్తి. ఆగస్టు 31(జనంసాక్షి) ఈ ఖరీఫ్ లో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార పరపతి సంఘం (ఎఫ్ఎస్ఏసీఎస్) ఆవరణలో ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులు క్యూలైన్ లో బారులు తీరారు. హైదరాబాద్ నుంచి వచ్చిన యూరియాతో వచ్చిన వ్యాగన్లో సహకార సంఘం ఆవధనలో నిలిపే సరికి వందలాది మంది రైతులు ఎగబడ్డారు. దీంతో లారీ నుంచి గోదాంలోకి దింపుదామనుకుంటే రైతులు లారీ నుంచి యూరియా బస్తాలను కిందికి దింపనీయలేదు. మండల వ్యవసాయాధికారి శరత్ చంద్ర అక్కడి చేరుకొని పోలీసులకు ఫోన్ చేయడంతో ఎస్సై లింగారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘటన స్థలికి చేరుకున్నారు. ఎగబడితే యూరియా ఇచ్చేదిలేదని క్యూలైన్లో ఉంటే ఒక్కరికి ఒక్క బస్తా చొప్పున పంపిణీ చేస్తామని చెప్పారు. యూరియా కోసం 500 వందల పైగా రైతులు రాగా, యూరియా బస్తాలు మాత్రం 444 మాత్రమే వచ్చాయని అదికారులు తెలిపారు. దీంతో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. ఎలాంటి గొడవ లేకుండా యూరియా పంపిణీ ప్రశాంతంగా జరిగింది. సోమవారం మరొక లారీ యూరియా వస్తుందని అందరికి ఇస్తామని వ్యవసాయాధికారి తెలపడంతో మిగితా రైతులు ఆసహనంగా వెనుదిరిగారు.

### సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కళ్యాణోత్సవం



**మంచిర్యాల ప్రతి నిధి ఆగస్టు 31 (జనంసాక్షి) :** మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీ బాలాజీ నగర్ లో గణేష్ మండపం వద్ద ఆదివారం సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వరుడి తరఫున నూతి కట్ల మార్కండేయులు దంపతులు వధువు తరఫున సిరిపురం గంగాధర్ దంపతులు ఒకరినొకరు ఎదుర్కొని సాంప్రదాయ పద్ధతిన కార్యక్రమాన్ని వార్డులో నిర్వహించి సిద్ధి బుద్ధి సమేత వినాయక విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తూ కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. వేద బ్రాహ్మణ మంత్రోచ్ఛారణల మధ్య సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కళ్యాణాన్ని కన్నుల పండుగ నిర్వహించారు.

# స్థానిక సంస్థలు ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధం కండి

- కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు

**టేకులపల్లి, ఆగస్టు 31 (జనంసాక్షి) :** కొద్దిరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల తానున్నదని, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని, అదేవిధంగా సెప్టెంబర్ 10,11న మాజీ ఐటీ శాఖ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భద్రాద్రి జిల్లా పర్యటన ఉన్నందున విజయవంతం చేయడానికి ఇల్లందు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలించి విజయవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ రేగ కాంతారావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే




బానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జరగబోయే స్థానిక ఎన్నికలపై కార్యకర్తలకు దశ దిశ నిర్దేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేనటువంటి ప్రజలను నమ్మించే మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది అన్నారు. ఇచ్చిన హామీలను అమలు పరచకుండా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాటానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని అన్నారు. పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రతి పల్లెలో, లంబాడి తాండాలలో, ఆదివాసి గుడాలలో కనపడుతుందని, ఆ అభివృద్ధినే స్థానిక ఎన్నికలలో ప్రచారం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను నమ్మి ఓట్లు వేసినందుకు ప్రజలు శిక్షను అనుభవిస్తున్నారని, 20 నెలల పాలన చూసి విసుగు చెందారని, ప్రతి ఒక్కరూ కెసిఆర్ ని కలవరిస్తున్నారని అన్నారు. ఏలాంటి మనస్పర్థలు లేకుండా గ్రూపులకు తావివ్వకుండా సమిష్టి కృషితో స్థానిక ఎన్నికల్లో విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, టేకులపల్లి, ఇల్లందు, బయ్యారం, కామేపల్లి, గార్ల మండల కమిటీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మతం కంటే మానవత్వం గొప్పది



**కోదాడ, ఆగస్టు 31 (జనం సాక్షి) :** మతం కంటే మానవత్వమే మిన్న అని నిరూపించారు ముస్లిం యువకులు, వివరాల్లోకి వెళితే కోదాడ పట్టణంలో ఉర్దూ స్కూల్ సమీపాన ఒంటరిగా నివాసముంటున్న రాజమ్మ అనే వృద్ధురాలు ఆదివారం మరణించింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో దహన సంస్కారాలు చేయుటకు స్థానిక ముస్లిం యువకులు ముందుకు వచ్చి కార్యక్రమం పూర్తి చేశారు. మతాలకతీతంగా మానవీయ పనిని ముస్లిం యువతను ప్రజలు కొనియాడారు.

## ఉపాధ్యాయుల ప్రమోషన్ల ద్వారా ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయాలి



**పాలకుర్తి, ఆగస్టు 31 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుండి నిర్వహించిన ఉపాధ్యాయుల ప్రమోషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడ్డ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల, విద్యాబోధనకు ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడే అవకాశం ఉందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల ఖాళీలను డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ ద్వారా ఏర్పడ్డ ఖాళీలను వెంటనే విద్యా వాలంటీర్లను నియమించి విద్యా బోధనకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు.

## మానవత్వాన్ని చాటుకున్న దామెర ఎస్సై కొంక అశోక్



**పరకాల, ఆగస్టు 31 (జనం సాక్షి) :** పరకాల డివిజన్ దామెర ఎస్ఐ కొంక అశోక్ మానవత్వాన్ని చాటుకున్నారు.ఆదివారం సాయంత్రం పెట్రోలింగ్ చేస్తుండగా దామెర గ్రామ శివాలయం సమీపంలో ల్యాదల్ల నుండి హనుమకొండ వైపు వెళ్తున్న టూ వీలర్ పై వెళ్తున్న వ్యక్తికి కోతి అడ్డ రావడం తో కిందపడి తల కి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన దామెర ఎస్ఐ 108 వాహనం కి ఫోన్ చేయగా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో పోలీసు వాహనంలో గాయాలైన వ్యక్తిని ఆరపెల్లి వరకు తీసుకొని వెళ్లి అక్కడికి 108 వాహనం రావటం ద్వారా అందులో వరంగల్ ఎంజీఎం కి పంపించారు. గాయాల పాలైన వ్యక్తి వివరాలు తెలుసుకోగా పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన కే. మనోహర్ అని తెలిసింది. దామెర ఎస్సై మానవత్వంతో చేసిన పనిని చూసిన గ్రామ ప్రజలు “సెల్యూట్ పోలీస్ “అంటూ మాట్లాడుకున్నారు.

## ఎకరానికి 40 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 31 (జనంసాక్షి) :** ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల వరద నీటిలో మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాల గోదావరి తీర ప్రాంతంలో పత్తి పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం జరగడంతో ఆదివారం నాడు బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి నీట మునిగిన పంటలను బాధిత రైతులతో కలిసి పరిశీలించి బాధితులకు ధైర్యం నింపడం జరిగింది. ప్రణాళిక లేకుండా ప్రాజెక్ట్ నుండి నీటిని విడుదల చేయడంతో పంటలు వరద నీటితో మునిగాయని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి 40 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రఘునాథ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, బియ్యాల సతీష్ రావు, రాజమౌళి, రవీందర్, అశోక్ మరియు రైతులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన వెతలు..!

- ఆరు నెలలుగా జీతాలు చెల్లించని వైనం
- ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు
- సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి నిరవధిక విధులు బహిష్కరణ చేస్తున్న ఉద్యోగులు

**పి.ఏ.పల్లి, ఆగస్టు 31 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా పి.ఏ.పల్లి మండలంలోని ఆదర్శ పాఠశాల యందు పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలలుగా జీతాలు రావడంలేదని,జీతాలు ఆలస్యం కావడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని,అప్పులు చేసి మరి కుటుంబాలను పోషిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా విధులు నిర్వహిస్తున్నామని,ప్రభుత్వం చాలీచాలని జీతాలతో తమతో వెట్టి చాకిరి చేపించుకుంటుందని,అవి కూడా సకాలంలో రావడంలేదని వారు వాపోతున్నారు .ఆరు నెలలుగా జీతాలు రాని కారణంగా పెన్ డౌన్ చేస్తూ సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి నిరవధిక విధులు



బహిష్కరణ చేస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు.ఈ సందర్భంగా వారు పాఠశాల ప్రిన్సిపాల్ కు వినతి పత్రం అందజేశారు. నల్గొండ జిల్లాలో మొత్తం 17 ఆదర్శ పాఠశాలలు ఉండగా ఒక్కో పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్,కంప్యూటర్ ఆపరేటర్,అటెండర్,వాచ్ మెన్ మొత్తం 68 మంది పనిచేస్తున్నారని వారు తెలిపారు.ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులను బహిష్కరిస్తే మాత్రం జిల్లాలోని పలు పాఠశాలల యందు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

## వీధి కుక్కదాడిలో బాలుడుకి గాయాలు

**కల్లూరు, ఆగస్టు 31 (జనం సాక్షి) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపాలకుంట ప్రాంతంలో ఆదివారం ఇంటి బయట వీధిలో ఆడుకుంటున్న పదేళ్ల బాలుడు శీలం సాయి పై ఆదివారం వీధి కుక్క దాడి చేసి చేతి పైన శరీర భాగం నడుము పైన కాటు వేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో గాయపడిన బాలుడిని స్థానికులు గమనించి, తండ్రి రాముకు సమాచారం అందించి కుటుంబ సభ్యులతో కలిసి బాలుడినీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. కుక్కలు ప్రతి వీధిలో ఎక్కువ సంఖ్యలో ఉండి స్వేర విహారం



చేస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు కుక్కలు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు

**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 31 (జనంసాక్షి) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే కీలక సవరణ బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీలో ఆదివారం ఆమోదం తెలిపిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో వేడుకలను సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపి, బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలను ఘనంగా



నిర్వహించారు.అనంతరం డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నిరంతరం బీసీల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల సవరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో రాష్ట్రంలో ఈ బిల్లు త్వరలో కార్యరూపం దాల్చనుందని అన్నారు.భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు.ఈ సవరణతో రాష్ట్రంలో బీసీలకు మరింత ప్రాధాన్యత దక్కుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంత్రిప్రగడ అనురాధ, నాయకులు కందమల్ల శేఖర్, పోలబోయిన నరసయ్య యాదవ్, నాగుల వాసు, గండూరి రమేష్, ఆలేటి మాణిక్యం, రవి, నాగుల మీరా, మాజీ కౌన్సిలర్ పద్మ, అనంతల యాదగిరి, కోడి శివ, అన్నమయ్య రాము, దివ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సలిసివే వరల్డ్ బుక్ ఆఫ్ అటెంప్ట్-2025 అవార్డు అందుకున్న కొర్ర కిషన్ నాయక్



**దేవరకొండ, ఆగష్టు 31 (జనం సాక్షి) :** సమాజంలో సమాచార హక్కు చట్టం పై ప్రజలు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం మరింత పెరిగిందని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ అన్నారు. హైదరాబాదులో శనివారం నాడు సుందరయ్య విజ్ఞాన కళాభవన్లో శ్రీ విఘ్నేశ్వర ఆర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఎక్సలిసివే వరల్డ్ బుక్ ఆఫ్ అటెంప్ట్ -2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ అడిషనల్ డీసీపీ తేజావత్ రామదాసు సినీ హీరోలు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా గుండ్లపల్లి (డిండి) మండలం కొత్త తండా కు చెందిన సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ చేసిన సేవలను గుర్తించి బ్రహ్మాండ సినిమా హీరో చేతుల మీదుగా ఎక్సలిసివే వరల్డ్ బుక్ ఆఫ్ అటెంప్ట్ -2025 అవార్డును అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్.టి.ఐ సమాచార హక్కు చట్టం పై ప్రజలలో అవగాహన కల్పిస్తూ ప్రజల కోసమే రూపొందించబడిన ఆర్టిఐ పై ప్రజలలో మరింత మేలుకొలుపును పెంపొందించే దిశగా ముందుకు వెళుతున్న క్రమంలో ఇలాంటి అవార్డు ను అందించడం శుభ తరుణమని వారన్నారు. ఈ అవార్డు అందుకోవడంతోపాటు మరింత బాధ్యత పెరిగిందని ప్రజలు ప్రభుత్వం రూపొందించిన చట్టాలను వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరికి చట్టంలో ప్రశ్నించే అధికారం ఉందని ప్రజలు ప్రభుత్వ అధికారులు పనితీరులోనీ ప్రజల స్వంతమైన చట్టపరమైన అంశాలను ప్రజలు ఉపయోగించుకోవాలని వారు కోరారు. రానున్న రోజులలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలలో అవగాహన కొరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామని ప్రజలు సమాజం పట్ల బాధ్యత కలిగిన యువకులు ముందుకు రావాలని వారు తెలిపారు.

## జీవన తాత్త్వికత తెలిసిన కవి మునాసు వెంకట్

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



**నల్గొండ బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి) :** ప్రకృతితో మమేకమై జీవన తాత్వికతను తన కవిత్వంలో నేర్పుగా ఆవిష్కరించగల కవి మునాసు వెంకట్ అని ప్రజా కవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నల్గొండకు చెందిన ప్రముఖ కవి మునాసు వెంకట్ రచించిన “దాపు“ కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ అస్తిత్వ ఉద్యమాలలో దళిత బహుజన కవిత్వాన్ని సుసంపన్నం చేసిన కవుల్లో మునాసు వెంకట్ ముందు వరుసలో ఉంటారని అభిప్రాయపడ్డారు. కాగా “ దాపు “ కవితా పుస్తకాన్ని విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ బెల్లి యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు అంబటి సురేంద్ర రాజు మాట్లాడుతూ అట్టడుగు వర్గ జీవితాలతో అంతర్జాతీయ స్థాయి కవిత్వం రాసిన కవి మునాసు వెంకట్ అని కొనియాడారు. మరొక విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ నవ్యమైన అభివ్యక్తితో తనదైన శైలిలో కవిత్వం రాసిన మునాసు వెంకట్ కవిత్వం తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం అజరామరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కవి గాయక సిద్ధార్థ, బైరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, భానుశ్రీ కొత్వాల్, పెరుమాళ్ళ ఆనంద్, అంబటి వెంకన్న, తుల శ్రీనివాస్, మేరెడ్డి యాదగిరి రెడ్డి, శీలం భద్రయ్య, బోధనం నర్సిరెడ్డి, పగడాల నాగేందర్, భూతం ముత్యాలు, సాగర్ల సత్తయ్య, బ, కస్తూరి ప్రభాకర్,మాదగాని శంకరయ్య, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 11 మండలాల్లో వర్షాలు, వరదలతో నష్టాలు

**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి) :** ప్రకృతి విలయతాండవంలో భారీ వర్షాలు వరదలతో జిల్లాలో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని , రోడ్లు కల్వర్టులు, వంతెనలు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రవాణాను పునరుద్ధరించే దిశగా పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. రామాయంపేట, నిజాంపేట్ మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ ముందుగా రామాయంపేట నుండి సిద్దిపేట్ వెళ్లి జాతీయ రహదారి నిజాంపేట్ మండలం బ్రిడ్జ్ డామేజ్ ను పరిశీలించారు. అనంతరం,నిజాంపేట్ మండలం చల్మెడ గ్రామంలోని ప్రవాహానికి కొట్టుకపోయిన రెండు బ్రిడ్జిలను, నిజాంపేట్ నుండి నస్కల్ వెళ్లి దారిలో వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన పురాతన బ్రిడ్జ్ లను రెవిన్యూ ఆర్ అండ్ బి అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలోని చెరువును మరియు పర్వతాపూర్ వెళ్లే దారిలో వరద ప్రభావానికి కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు వరదలతో కోతకు గురి అయిన రోడ్లు, కల్వర్టులు వంతెనలను అధికారులతో కలిసి పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులతో రవాణాను పునరుద్ధరించే దిశగా అధికారులకు పలు సూచనలు సలహాలు అందించడం జరిగిందని తెలిపారు. పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆయా శాఖల వారీగా జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారని చెప్పారు. తాత్కాలికంగా రవాణాను పునరుద్ధరించే దిశగా ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు చేసి , అనంతరం



శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించినట్లు చెప్పారు. పంట నష్టానికి సంబంధించి కొన్నిచోట్ల పంట పొలాలు నీటిలో మునిగినవని కొన్ని ప్రాంతాలలో ఇసుక మేటలు వేసినవని, వ్యవసాయానికి సంబంధించి మండల వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారని అన్నారు. 130 గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని యుద్ధ ప్రాతిపదికన అహర్నిశలు శ్రమించి విద్యుత్ను పునరుద్ధరించడం జరిగిందని చెప్పారు. కొన్నిచోట్ల మిషన్ భగీరథ పైపులను కట్ ఆఫ్ అయిందని , త్రాగునీటి సౌకర్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మరమ్మతులు చేపట్టి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూసామన్నారు. 50 సంవత్సరాలలో ఇంత పెద్ద ఎత్తున ప్రకృతి విలయతాండవం చూడలేదని గ్రామాల పెద్దలు చెప్పారన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించిన దీటుగా ఎదుర్కొనేందుకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. రామాయంపేట పరిధిలో కాట్రియాల చెరువును పరిశీలిస్తూ చెరువు కట్టను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. చెరువు కట్ట పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రాల్లో ఉంచడం జరిగిందన్నారు , కాట్రియాలనుండి పర్వతాపూర్ వెళ్లే రహదారి వరద ప్రవాహానికి వంతెన, విద్యుత్ వైర్లు కొట్టుకుపోవడం వల్ల పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వ నుండి సహాయ సహకారాలు అందుతాయని ఆందోళన పడవద్దని వివరించారు. అన్ని శాఖల అధికారులకు సెలవులు రద్దు చేయడం జరిగిందని వరద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్న అన్నారు. మూడు నాలుగు రోజుల్లో సాధారణ స్థితికి వచ్చే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వరద ముంపు వెళ్లిపోలేదని మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల వల్ల మంజీరాలు లక్ష క్యూసెక్కుల నీరు. చేరే అవకాశం ఉన్నందున మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఎలాంటి విపత్తులు సంభవించిన సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం ప్రజల రక్షణలో సిద్ధంగా ఉందన్నారు. భారీ వర్షాలు వలన వరద ప్రవాహ ఉధృతి పెరుగుతుందని వాగులు చెరువులు దాటి వెళ్ళవద్దని ప్రజలకు అవగాహన కల్పించినా కూడా పెడచెవిన పెట్టి దాటడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని అటువంటి సాహసాలు ఎవరు చేయవద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట తాసిల్దార్ రజని, నిజాంపేట్ తాసిల్దార్ ఆర్ అండ్ బి ఈ.ఈ సర్దార్ సింగ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యాప్‌లపై కొరడా..



యాప్‌లపై టెక్ దిగ్గజం గూగుల్ కొరడా ఝుళిపిం చింది. ప్లే స్టోర్ నుంచి గూగుల్ 77 ప్రమాదకరమైన యాప్‌లను తొలగించింది. ఆయా యాప్‌లన్నీ వినియోగదారుల భద్రత, గోప్యతకు ముప్పుగా మారడంతో చర్యలు తీసుకున్నది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. గూగుల్ గత సంవత్సరం సుమారు 40 లక్షల యాప్‌లను తొలగించింది. సగటున ప్రతిరోజూ 11వేల యాప్‌లను ప్లే స్టోర్ నుంచి వేటు వేసింది. నివేదిక ప్రకారం.. తొలగించబడిన యాప్‌లలో సగానికి పైగా డేటా భద్రత, గోప్యతా నియమాలను ఉల్లంఘిస్తున్నాయని తేలింది. గూగుల్ గత సంవత్సరం యాప్ ప్లబిషింగ్‌కు సంబంధించి కఠినమైన నియమాలను అమలు చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. 2024 ప్రారంభం నాటికి ప్లే స్టోర్‌లో ఉన్న దాదాపు సగం యాప్‌లను తొలగించారు. గూగుల్ ఈ సంవత్సరం దాదాపు 1.55 లక్షల డెవలపర్ ఖాతాలను కూడా బ్లాక్ చేసింది. కంపెనీ ఇప్పుడు సైడ్‌లోడెడ్ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా వెళ్లే డెవలపర్స్ మాత్రమే యాప్‌లను ప్రచురించగలరని గూగుల్ చెబుతోంది. ప్లే స్టోర్ నుంచి ఒక యాప్ అదృశ్యమైతే.. దాని అర్థం డెవలపర్ దాన్ని తీసివేసినట్లు కాదని గూగుల్ వినియోగదారులను హెచ్చరించింది. తరచుగా దీనికి కారణం యాప్ నియమాలను ఉల్లంఘించడమే.

అయితే, యాప్ ఇప్పటికే మీ ఫోన్‌లో ఉంటే.. అది రన్ అవుతూనే ఉంటుంది. కానీ, అది మరిన్ని అప్‌డేట్‌లు అందవు. యాప్ ప్రమాదకరమైనదిగా తేలితే.. ప్లే ప్రొటెక్ట్ దాన్ని అన్ ఇన్‌స్టాల్ చేయమని హెచ్చరిస్తుంది అని కంపెనీ స్పష్టం చేసింది. కానీ, అలాంటి హెచ్చరిక రాకపోతే యాప్ భద్రతా అప్‌డేట్స్ లేకుండా మీ ఫోన్‌లో రన్ అవుతూనే ఉంటుంది. యూజర్లు సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకునే అలవాటును మార్చుకోవాలని నిపుణులు అంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అనుమతులను తనిఖీ చేయాలని.. రివ్యూలను చదవాలని.. విశ్వసనీయ డెవలపర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ నివేదిక పేర్కొంది. ఆండ్రాయిడ్ అథారిటీ నివేదిక ప్రకారం.. గూగుల్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో కొత్త 'అన్‌ఇన్‌స్టాల్' బటన్‌ను పరీక్షిస్తోంది. ఈ బటన్ యాప్ పేజీలో నేరుగా కనిపిస్తుంది. తద్వారా వినియోగదారులు తమ ఫోన్ నుంచి ఏదైనా యాప్‌ను వెంటనే తీసివేసే అవకాశం ఉంది.

# ఇంధన రంగ వృద్ధి... టారిఫ్‌ల ప్రభావం



### ఐఓసీ పెట్టుబడి, ఎగుమతి సవాళ్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రాబోయే ఐదు సంవత్సరాలలో 1.66 లక్షల కోట్ల రూపాయల భారీ పెట్టుబడిని ప్రకటించింది. ఈ చర్య భారత ఇంధన రంగంలో గణనీయమైన వృద్ధిని సూచిస్తుంది. ఐఓసీ తన రిఫైనరీ సామర్థ్యాన్ని విస్తరించడం, ఆధునిక సాంకేతికతలను అవలంబించడం, స్థిరమైన ఇంధన పరిష్కారాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పెట్టుబడి దేశంలో ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, శుద్ధ ఇంధన సాంకేతికతలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ స్థిరత్వానికి దోహదపడుతుంది. రిఫైనరీల ఆధునీకరణ, కొత్త పెట్రోకెమికల్ ప్లాంట్ల నిర్మాణం, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయల్స్ వంటి ఆల్టర్నేటివ్ ఇంధన వనరుల అభివృద్ధికి ఈ నిధులను ఉపయోగిస్తారు. ఈ ప్రణాళిక దేశీయ ఇంధన డిమాండ్‌ను తీర్చడంతో పాటు, గ్లోబల్ మార్కెట్‌లో ఐఓసీ యొక్క పోటీతత్వాన్ని బలోపేతం చేస్తుంది. ఈ పెట్టుబడి ద్వారా అనేక ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయి. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఊతం ఇస్తుంది. ఐఓసీ యొక్క ఈ దీర్ఘకాలిక వ్యూహం భారత ఇంధన రంగంలో కొత్త శకానికి నాంది పలుకుతుంది.

ఇది దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే, భారత ఎగుమతిదారులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ టారిఫ్‌లు భారత ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఐటీ ఉత్పత్తుల వంటి రంగాలు ఈ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. టారిఫ్‌లు భారత ఉత్పత్తుల ధరలను పెంచడం ద్వారా గ్లోబల్ మార్కెట్‌లో వాటి పోటీతత్వాన్ని తగ్గిస్తున్నాయి. ఫలితంగా, ఎగుమతిదారులు లాభాలలో క్షీణతను ఎదుర్కొంటున్నారు. కొత్త మార్కెట్‌లను అన్వేషించవలసిన అవసరం ఏర్పడింది. ఈ సవాళ్లను అధిగమించడానికి భారత ప్రభుత్వం కొత్త వాణిజ్య విధానాలను రూపొంది ంచాల్సి ఉంది. ఇవి ఎగుమతిదారులకు సహాయపడతాయి. జీఎస్టీ సంస్కర ణలు, ఇతర ఆర్థిక సంస్కరణలు ఎగుమతి రంగానికి ఊతం ఇవ్వవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఈ సంస్కరణలు ఎగుమతి ప్రక్రియలను సరళీకరించడం, ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత ఉత్పత్తుల ఆకర్షణను పెంచడం ద్వారా సహాయపడతాయి.

టారిఫ్‌ల సవాళ్లను ఎదుర్కోవడానికి ఎగుమతిదారులు కొత్త వ్యూహాలను అవలంబించాలి. ఉదాహరణకు, ఆసియా, ఆఫ్రికా వంటి ప్రాంతాలలో కొత్త మార్కెట్‌లను అన్వేషించడం లేదా ఉత్పత్తి వైవిధ్యీకరణను పెంచడం అవసరం. ఐఓసీ యొక్క భారీ పెట్టుబడి, టారిఫ్‌ల వల్ల ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సవాళ్లు భారత ఆర్థిక వ్యవస్థలోని రెండు వైపులను ప్రతిబింబిస్తాయి. ఇంధన రంగంలో వృద్ధి, ఆవిష్కరణలు దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతుంటే, గ్లోబల్ ట్రేడ్ సవాళ్లు ఎగుమతిదారులకు అడ్డంకులను సృష్టిస్తున్నాయి. ఈ రెండు అంశాలను సమతుల్యం చేయడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 514 | ₹ 61.68 |
| వరంగల్ | ₹ 492 | ₹59.04 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్
₹1,04,950 (24 క్యారెట్లు)
₹ 96,200 (22 క్యారెట్లు)

చెన్నై
₹ 96,200 (22 క్యారెట్లు)
₹1,04,950 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,31,000




## వొడాఫోన్ ఐడియా ఆకర్షణీయ ఆఫర్: రూ.1కే అపరిమిత సేవలు

వొడాఫోన్ ఐడియా (వీఐ) తమ వినియోగదారులకు ఒక అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించింది, ఇది టెలికాం మార్కెట్‌లో పోటీని మరింత తీవ్రతరం చేస్తుంది. వీఐ గేమ్స్ ప్లాట్‌ఫారమ్‌లో గెలాక్సీ షూటర్ ఫ్రీడమ్ ఫెస్ట్ ఎడిషన్‌లో భాగంగా, సాధారణంగా 4,999 రూపాయల విలువైన రీఛార్జ్ ప్లాన్‌ను కేవలం 1 రూపాయికి అందిస్తోంది. ఈ ఆఫర్ 2025 ఆగస్టు 31 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ కాల్స్, అధిక డేటా, మరియు ఇతర ప్రయోజనాలు ఉన్నాయి, ఇవి వినియోగదారులకు అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ ప్రత్యేక ఆఫర్ వీఐ గేమ్స్ ద్వారా వినియోగదారులను ఆకర్షించడమే కాకుండా, టెలికాం రంగంలో వీఐ యొక్క మార్కెట్ వాటాను పెంచే దిశగా ఒక ముఖ్య మైన చర్యగా నిలుస్తుంది. ఈ ఆఫర్ ద్వారా వినియోగదారులు తక్కువ ఖర్చుతో అధిక విలువైన సేవలను పొందవచ్చు, ఇది భారత టెలికాం మార్కెట్‌లో వీఐ యొక్క స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ ఆఫర్ గడువు త్వరలో ముగియ నుండటంతో, వినియోగదా రులు త్వరగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించబడుతుంది. ఈ చర్య వీఐ యొక్క వినూత్న వ్యూహాన్ని, మరియు గేమింగ్, టెలికాం సేవలను సమన్వయం చేసే దాని సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుంది.

# రిలయన్స్ ఏజీఎం 2025 ప్రకటనలు

రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) 2025లో ముఖేష్ అంబానీ అనేక కీలక ప్రకటనలు చేశారు, ఇవి కంపెనీ భవిష్యత్తు వ్యూహాన్ని బలోపేతం చేస్తాయి. జియో ఐపీఓ ప్రారంభం, కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రమోషన్, గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలు ఈ సమావేశంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అనంత అంబానీ 2025లో బ్యాటరీ గిగా ఫ్యాక్టరీని ప్రారంభించనున్నట్లు, అలాగే 3 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని ప్రకటించారు. ఈ లక్ష్యం రిలయన్స్‌ను స్థిరమైన ఇంధన రంగంలో అగ్రగామిగా నిలిపే అవకాశం ఉంది. ఇషా అంబానీ రిలయన్స్ రిటైల్ విభాగం కోసం 20 శాతం సీఏజీఆర్ (వార్షిక సమ్మిశ్ర వృద్ధి రేటు) లక్ష్యాన్ని నిర్దేశించారు, ఇది రిటైల్ రంగంలో వృద్ధిని వేగవంతం చేస్తుంది. ఆకాష్ అంబానీ జియోపీసీ, జియోఫ్రేమ్స్, రియా, గ్లోబల్ విస్తరణ ప్రణాళికల గురించి వివరించారు, ఇవి టెక్నాలజీ, డిజిటల్ సేవలలో రిలయన్స్ ఆధిపత్యాన్ని మరింత బలపరుస్తాయి. అంబానీ కుటుంబం రిలయన్స్ జాతీయ ఖజానాకు అత్యధిక సహకారం అందిస్తున్నట్లు నొక్కి చెప్పారు, ఇది కంపెనీ ఆర్థిక సామర్థ్యాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థలో దాని పాత్రను తెలియజేస్తుంది. ఈ ప్రకటనలు రిలయన్స్‌ను టెక్నాలజీ, రిటైల్, స్థిరమైన ఇంధన రంగాలలో గ్లోబల్ లీడర్‌గా స్థాపించే దిశగా ఒక ముందడుగు. ఈ వ్యూహాలు దీర్ఘకాలికంగా కంపెనీ వృద్ధిని, ఆవిష్కరణలను, స్థిరత్వాన్ని ప్రోత్సహిస్తాయి, అలాగే భారత ఆర్థిక వ్యవస్థకు బలమైన సహకారం అందిస్తాయి.

# ఒడిదొడుకుల... స్టాక్ మార్కెట్



ఆగస్టు 2025లో నిఫ్టీ సూచీ 1.38 శాతం క్షీణించింది, దీనికి ప్రధాన కారణాలుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) సుమారు 35,000 కోట్ల రూపాయలను ఉపసంహరించడం ఉన్నాయి. ఈ ఒడిదొడుకులు మార్కెట్‌లో అస్థిరతను పెంచాయి, ఇన్వెస్టర్లలో ఆందోళనను రేకెత్తించాయి. ఆగస్టు 31, 2025 ఆదివారం బ్యాంక్ హాలిడే కారణంగా దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులు మూసివేయబడ్డాయి, దీనివల్ల ఆర్థిక లావాదేవీలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. సెప్టెంబర్ నెలలో జీఎస్టీ సంస్కరణలు, జీడీపీ డేటా విడుదల మార్కెట్‌కు సానుకూల ఊపును అందించే అవకాశం ఉంది, ఇవి పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలను తెరవవచ్చు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) బ్యాంక్ నిఫ్టీ డెరివేటివ్స్ క్వాంటిటీ ఫ్రీజ్ లిమిట్‌ను 600 నుంచి 900కి పెంచింది, ఈ మార్పు సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వస్తుంది. ఈ నిర్ణయం ట్రేడింగ్ సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుందని, మార్కెట్ లిక్విడిటీని పెంచుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఇన్వెస్టర్లు సెప్టెంబర్‌లో మెరుగైన మార్కెట్ పరిస్థితుల కోసం ఎదురుచూడవచ్చు, అయితే జాగ్రత్తగా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యం. ఆర్థిక సలహాదారుల సూచనలతో పెట్టుబడులు చేయడం వల్ల మార్కెట్ ఒడిదొడుకులను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

## జూన్ త్రైమాసిక జీడీపీ వృద్ధి: హెచ్ఎస్‌బీసీ హెచ్చరికలు

భారత ఆర్థిక వ్యవస్థ 2025 జూన్ త్రైమాసికంలో 7.8 శాతం జీడీపీ వృద్ధిని సాధించినప్పటికీ, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ ఈ వృద్ధి గణాంకాలు ద్రవ్యోల్బణ సర్దుబాట్ల వల్ల అతిగా అంచనా వేయబడుతున్నాయని హెచ్చరించింది. ఈ వృద్ధి రేటు ఉత్సాహజనకంగా కనిపించినప్పటికీ, ద్రవ్యోల్బణ సర్దుబాటు పద్ధతులు ఆర్థిక వృద్ధిని ఊహించిన దానికంటే ఎక్కువగా చూపుతున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ద్రవ్యోల్బణం అంటే ధరల స్థాయిలో పెరుగుదల, ఇది ఆర్థిక వృద్ధి గణాంకాలను ప్రభావితం చేస్తుంది. హెచ్ఎస్‌బీసీ నివేదిక ప్రకారం, ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత నిజమైన ఆర్థిక వృద్ధి ఈ 7.8 శాతం కంటే తక్కువగా ఉండవచ్చు. ఈ హెచ్చరిక ఆర్థిక విశ్లేషకులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు జీడీపీ గణాంకాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచిస్తుంది. దీని వల్ల ఆర్థిక విధాన నిర్ణయాలు, పెట్టుబడి వ్యూహాలు మరింత ఖచ్చితమైన డేటా ఆధారంగా రూపొందించబడతాయి. జీడీపీ వృద్ధి రేటు ఆర్థిక వ్యవస్థ యొక్క ఆరోగ్యాన్ని సూచించే ముఖ్యమైన సూచిక, కానీ ద్రవ్యోల్బణ సర్దుబాట్లు ఈ గణాంకాలను తప్పుదారి పట్టించేలా చేయవచ్చు. ఉదాహరణకు, ధరలు వేగంగా పెరిగినప్పుడు, జీడీపీ వృద్ధి గణాంకాలు నామమాత్రపు విలువలను ఆధారంగా చేసుకుని అధికంగా కనిపించవచ్చు, కానీ నిజమైన ఆర్థిక ఉత్పత్తి అంత గణనీయంగా పెరగకపోవచ్చు. హెచ్ఎస్‌బీసీ ఈ సమస్యను హైలైట్ చేస్తూ, ఆర్థిక వృద్ధి యొక్క నిజమైన చిత్రాన్ని అర్థం చేసుకోవడానికి ద్రవ్యోల్బణ సర్దుబాట్లను జాగ్రత్తగా విశ్లేషించాలని సూచిస్తుంది. ఈ హెచ్చరిక భారత ఆర్థిక వ్యవస్థ యొక్క బలాలను, బలహీనతలను సమగ్రంగా అంచనా వేయడంలో సహాయపడుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ ఇటీవలి సంవత్సరాలలో గణనీయమైన వృద్ధిని సాధించింది, కానీ ద్రవ్యోల్బణం, గ్లోబల్ ఆర్థిక ఒడిదొడుకులు, వాణిజ్య సవాళ్లు వంటివి ఈ వృద్ధిని ప్రభావితం చేస్తాయి. ఈ సందర్భంలో, హెచ్ఎస్‌బీసీ హెచ్చరిక ఆర్థిక విధాన రూపకర్తలకు, వ్యాపారవేత్తలకు, పెట్టుబడిదారులకు జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవడానికి ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది.

# విప్రో హర్మన్ డీటీఎస్ కొనుగోలు

### డిజిటల్ సేవల బలోపేతం



విప్రో, హర్మన్ (సామ్‌సంగ్ యాజమాన్యంలోని) డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ (డీటీఎస్) యూనిట్‌ను 37.5 మిలియన్ డాలర్లు, అంటే సుమా రు 3,270 కోట్ల రూపాయలకు కొనుగోలు చేస్తోంది. ఈ ఒప్పందంలో భాగంగా, హర్మన్‌లోని 5,600 మంది ఉద్యోగులు విప్రో సంస్థలోకి బదిలీ అవుతారు. ఈ కొనుగోలు ప్రక్రియ 2025 డిసెంబర్ 31 నాటికి పూర్తవుతుందని అంచనా. ఈ ఒప్పందం విప్రో యొక్క డిజిటల్ సేవలను గణనీయంగా బలోపేతం చేస్తుంది, ముఖ్యంగా సాంకేతిక సొల్యూషన్స్ రంగంలో కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. హర్మన్ డీటీఎస్ యూనిట్ అధునాతన డిజిటల్ టెక్నాలజీ సేవలను అందిస్తుంది, ఇది విప్రో యొక్క గ్లోబల్ క్లయింట్‌లకు మరింత విలువను జోడిస్తుంది. ఈ కొనుగోలు విప్రో యొక్క మార్కెట్ వాటాను, సాంకేతిక ఆవిష్కరణలను, మరియు పోటీతత్వాన్ని పెంచుతుంది. ఈ ఒప్పందం ద్వారా విప్రో ఐటీ సేవల రంగంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటుంది, అలాగే భవిష్యత్తులో కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. ఈ చర్య డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్ రంగంలో విప్రో యొక్క ఆధిపత్యాన్ని స్థిరపరుస్తుంది, మరియు భారత ఐటీ పరిశ్రమకు ఒక సానుకూల సంకేతంగా నిలుస్తుంది.

### లింక్డిన్లో టిక్టాక్ ఉద్యోగావకాశాలు..

భారత్‌లో నిషేధం ఎదుర్కొంటున్న ప్రముఖ సోషల్ మీడియా యాప్ –టిక్టాక్ తాజాగా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. గురుగ్రామ్లోని తన –ఆఫీస్ లో రెండు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పోస్ట్ చేసింది. వీటిలో ఒకటి కంటెంట్ మోడరేటర్ (బెంగాలీ మాట్లాడగల అభ్యర్థి), మరొకటి మంచి భాగస్వామ్యం, కార్యకలాపాల నాయకత్వానికి – సంబంధించిన పోస్టులు. ఈ నేపథ్యంలో టిక్టాక్ సేవలు భారత్లో లో మళ్లీ అందుబాటులోకి రాబోతున్నాయా? అనే ప్రచారం జోరందుకొంది. భారత్లో ఇటీవల టిక్టాక్ వెబ్సైట్ అనేకమంది యాక్సెస్ చేయగలుగుతున్నారు. అయితే.. దానిలోకి లాగిన్ కావడం, వీడియోలను చూడటం సాధ్యం కావడంలేదు.

# 'చిట్టి' చేతులతో స్టేషన్‌కు అన్యాయం

## ఖమ్మంలో తిష్టవేసి కోట్లల్లో ఆర్జన

- బిఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించిన ఘన చరిత్ర
- రూ. 50వేలు ఇస్తే ఎఫ్ఐఆర్ చేసిన ఘనుడు
- కులంచాటున వసూళ్ల పర్వం.. పోస్టింగ్‌పైనా ఫోకస్
- విచారణ చేపట్టి నష్టాన్ని నివారించాలని సర్కారుకు విజ్ఞప్తులు



**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ఖమ్మంలో గత పదేళ్ల బిఆర్ఎస్ పోలిసింగ్ నడిచింది. గులాబీ పార్టీలో పోస్టింగ్ పొందిన ఖాకీలు కట్టు బానిసల్లాగా వ్యవహరించారు. అన్యాయంతో న్యాయంగా, న్యాయంతో అన్యాయంగా వ్యవహరించారు. సదా బిఆర్ఎస్ పాలన కొనసాగుతుందనే ఆలోచనతో పనిచేసారు. అనేక అక్రమ కేసులు నమోదు చేసి సామాన్య ప్రజానీకాన్ని అనేక ఇబ్బందులకు గురి చేసారు. పోలిసుల అతి జోక్యం, వారి తీరు వల్లనే బిఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి చేసానని చెప్పుకునే మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్రంలోనే ఏ మంత్రి ఓడిపోనట్లుగా ఓటమిని చవిచూసారు. మళ్లీ ఖమ్మం ప్రజల్లోకి రావాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి. సొంత సామాజికవర్గంలో అక్రమార్కులకు, అవినీతిపరులకు, ఖబ్జా కోరులకు పెద్దపీట వేయడం, నీతి నిజాయితీ ఉన్నవారిని దూరం పెట్టడం వల్ల అంతర్గతంగానే దూరమయ్యారు.

ఖమ్మంలో బిఆర్ఎస్ హాయాంలో పోలీసింగ్ నుంచి మొదలు అన్నిరకాల పోస్టింగులు పొందిన వారు లక్షలు, కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారు. ఖమ్మంలో విల్లాలు భారీ భారీ ఇండ్లు నిర్మించుకున్నారు. ఖమ్మం మెట్టినిల్లు, పుట్టినిల్లు కాకపోయినా ఇక్కడే తిష్ట వేయడానికి ప్రధాన కారణం వారు పొందే అక్రమార్జనే కారణమనేది స్పష్టం. వాటన్నింటిపై విచారణ జరపాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. ఖమ్మంలో వన్ టౌన్ సిఐగా పని చేసిన సదరు బాసు ఆదిలాబాద్‌కు వెళ్లినట్లే వెళ్లి మళ్లీ ఖమ్మంలోనే తిష్ట వేసారు. ఖమ్మంలో ఆయనగారు చేయని దందా లేదు. వసూలు చేయని లాడ్జి లేదు. వన్ టౌన్ పరిధిలో సెటిల్ చేయకుండా వదిలిన అంశం లేదు. మాజీ డిసిపి బోస్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ కులం ముసుగులో వసూళ్ల పర్వం కొనసాగించారు. ఓ మాజీ విలేకరికి, ఓ కిరాణా షాపు యజమానికి మధ్య లావాదేవిల అంశంలో కేసు నమోదు చేయడానికి అక్షరాల రూ.50వేలు పుచ్చుకున్నాడు. డబ్బులు పుచ్చుకొని మరీ కేసు నమోదు చేసిన చరిత్ర కలిగి ఉన్నాడు. ప్రస్తుతం మహిళలకు న్యాయం చేయమని బాధ్యతలు అప్పగిస్తే వసూళ్ల కౌంటర్ తెరిచినట్లు సమాచారం.

**పెళ్లి అడ్డంపెట్టి వసూళ్లు..**

వైవాహిక జీవితంలో సున్నితమైనది భాగస్వామి అంశం. దీనిని అడ్డం పెట్టి పెళ్లి కుమారుడివైపు వసూళ్లు చేస్తున్నారని సమాచారం. సదరు స్టేషన్‌కు ఎవరైన బాధిత మహిళ వెళితే పట్టించుకునే నాధుడు లేదు. చెప్పులు అరిగేలా తిరిగిన న్యాయం దక్కే పరిస్థితి లేకుండా పోయింది. ఈ స్టేషన్ ఎప్పుడు ఖాళీ చేద్దామా.. కులం ముసుగు తొడిగి పోస్టింగ్ ఎప్పుడు పొందుదామా అన్నట్లు వ్యవహరించడం తప్పా అతను విధుల్లో ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. వివాదాలు సృష్టిస్తూ, ఉన్నత స్థాయి వ్యక్తుల పై, వ్యవస్థలపై బురద జల్లే లంపెన్ గ్యాంగుతో మమతానురాగాలు కురిపిస్తూ వాట్సప్ ఫోన్ కాల్స్ మాట్లాడుతూ ఇతర పోలిస్ స్టేషన్‌లలో జరుగుతున్నట్లు కట్టు కధలు అల్లి, గతంలో మాజీ మంత్రిని భ్రష్టు పట్టించిన ఓ గ్యాంగ్ ద్వారా ఓ అమాత్యుల వారి వద్దకు సందేశాలను పంపుతున్నట్లు సమా చారం. బాధ్యతలు అప్పగిస్తే అసలు పనిని వదిలి కొసరు పనిపై ఎక్కువ ప్రధాన్యత ఇస్తున్నట్లు సమాచారం.

**పోస్టింగ్ కోసం ఫోకస్**

ఎట్టకేలకు కులం ముసుగు తొడిగి పోస్టింగు పట్టాలనే తలంపుతో ఇచ్చిన బాధ్యతలను వదిలి ఇతర స్టేషన్‌లలో పనిచేసే ఖాకీల అంశాలపై ఫోకస్ పెట్టడం, వారిని బద్నాం చేసే కుట్రకు తెరదీసినట్లు సమాచారం. ప్రతిరోజు రిటైర్డ్ మాజీ డిసిపితో, మాజీ ఎసిపితో కలిసి సామాజికవర్గం ముసుగులో ఎలాగైన పోస్టింగ్ పొందాలనే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. జిల్లాతో ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తులు, అధికారులు ఖమ్మం జిల్లాలో వేలు పెట్టడంపై ప్రస్తుత మంత్రులు జోక్యం చేసుకోవాలి. స్థాయిని బట్టి వ్యవహరించే వారిపై పట్ల చర్యలు తీసుకోవాలి. అనేక మంది ఎప్పుడు లేనివిధంగా కీలక మంత్రికి కులం ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. దశాబ్దాల కాలంలో ఆ మంత్రికి కులాలకు అతీతంగా అభిమానులు ఉన్నారు. అన్ని వర్గాల్లో ఆయన్ని పెద్దయనగా భావిస్తారు. క్రమశిక్షణకు మారు పేరుగా ఆయనకు పేరుంది. అంబరా న్ని అంటిన ఆయన స్థాయిని కొందరు కుల పూత పూసి తక్కువ చేసే ప్రయత్నం చేస్తున్నారు. పదేపదే మా సామాజిక వర్గం అంటూ తప్పుడు వ్యవహారాల్లో పరోక్షం గా ఆయన్ని లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఏసిపి కంటే పైస్థా యి వ్యవహారాలు మాత్రమే పట్టించుకునే సదరు నాయకుడిని సిఐ పోస్టింగుల కోసం కులం మాటున మెప్పిస్తున్నామని బహిరంగంగా చెప్పుకుంటూ ప్రచారం చేస్తున్నట్లు సమాచారం.

**అప్పటోళ్లే.. మళ్లీ ఇప్పుడూ..**

బిఆర్ఎస్‌తో పాటు పువ్వాడ అజయ్ కుమార్ సేవలు అందించినవారే మళ్లీ ప్రధాన పాత్ర పోషించడానికి క్యూ కడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు అడ్డుకట్ట వేయాలి. గతంలో కారు పార్టీలో జోరుగా తిరిగిన వారికే పెద్దపీట వేస్తుడటంతో కాంగ్రెస్ అభిమానుల్లో, కార్యకర్తలు ఆవేశాన్ని పంటిబిగువున ఉంచుతున్నారు. బిఆర్ఎస్ తొత్తులు కాంగ్రెస్ కార్యాలయంలో అమాత్యుల వద్ద కలియతిరుగుతుంటే ఇన్నాళ్లు ఎక్కడికి వెళ్లారని గుసగుసలాడుకుంటున్నారు. కులం అంటూ కొందరు, మతం అంటూ కొందరు అనేక సమీకరణాలతో అమాత్యుల వద్దకు వరుసలో నిలబడుతున్నారు. మాజీ డిసిపి, మాజీ ఏసిపి, వన్ టౌన్‌లో పని చేసిన సిఐలు, గతంలో టూ టౌన్‌లో పనిచేసిన ఓ సిఐ, రూరల్ పనిచేసిన ఇద్దరు సిఐలు, ఓ ఏసిపిలు బిఆర్ఎస్‌ని అడ్డుపెట్టి చేసిన అక్రమాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉన్నది. వారికి ఎక్కడా ప్రధాన విధుల్లోకి తీసుకోకుండా వారిని లూప్ లైన్‌లలో పోస్టింగులు కేటాయించాలని కాంగ్రెస్ కార్యకర్తలు ముక్తకంఠంతో కోరుతున్నారు. కులం జెండాతో ఉన్నవారిపై మరింతగా విచారణ చేపడితే రానున్నకాలంలో అన్నివర్గాలు నిబద్ధతో పార్టీ కోసం, సదరు నాయకుల కోసం నిబద్ధతతో పనిచేసేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

## అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో

# ఉద్యోగులే కీలకం

**అదనపు కలెక్టర్ పి.రాంబాబు పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో.... జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉద్యోగుల బాధ్యత అతి కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు పదవి విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు 1995లో డిప్యూటీ తహసీల్దార్ గా ప్రయాణం మొదలు పెట్టి గత 7 సంవత్సరాలుగా అదనపు కలెక్టర్ గా కుటుంబ సభ్యుల సహకారం,నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ లక్షలాది మంది ప్రజలకి సేవ చేయటం చాలా అభినందనీయమని కొనియాడారు.సంక్షేమ పథకాలలో ముఖ్యమైనవి హుజూర్ నగర్ నుండి సన్న బియ్యం పంపిణి, తిరుమలగిరి నుండి రేషన్ కార్డుల పంపిణీ పథకాలు అదనపు కలెక్టర్ సహకారంతో జిల్లాలో విజయవంతం చేశామని అన్నారు.అదనపు కలెక్టర్‌ని సమన్వయము చేసుకుంటూ గత యాసంగి ధాన్యం కొనుగోలు సమయంలో ఆకస్మిక వర్షాలు కురిసిన రైతులకి ఇలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించామని తెలిపారు.సీఎంఆర్ డెలివరీలు కూడా వేగవంతంగా పూర్తి చేయటం జరిగిందని తెలిపారు.భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి భూ సమస్యలు పరిష్కరించటంలో ఎంతగానో కృషి చేశారన్నారు.మిగిలిన శేష జీవితం ఆయురారోగ్యలతో, సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యులతో గడపాలని కోరుకుంటున్నట్లు తెలిపారుపదవి విరమణ పొందుతున్న జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు తన అనుభవాలు స్మరించుకుంటూ జీవితంలో కష్టే ఫలి అని నమ్మి డిప్యూటీ తహసీల్దార్ గా మొదలైన ప్రయాణం, గత 7 సంవత్సరాలుగా ఐదు జిల్లాలలో అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహించానని అన్నారు.తన జీవితంలో 26 మంది కలెక్టర్ల వద్ద విధులు నిర్వహించానని, తన 30ఏళ్ల చరిత్రలో ప్రజలకి పనికొచ్చే ఏ విషయంలో పెండింగ్ పెట్టకుండా విధులు నిర్వహించానని, మనం చేసే విధుల ద్వారానే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు.తన ఉద్యోగ రీత్యా విధులకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వేణుమాదవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు,జడ్పీ సిఈఓ వివి అప్పారావు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
01 సెప్టెంబర్ 2025

# బీసీ బిల్లు ఆమోదం చారిత్రాత్మక విజయం

- నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద సంబరాలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి) :** పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లును తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడం పై కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తా మని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేసిందని ఆయన అన్నారు. శాసనసభలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరీంనగర్లో సంబరాలు జరిపారు. టపాసులు కాల్చి , స్వీట్లు పంపిణీ చేశారు. బీసీలకు న్యాయం చేసే దిశగా కాంగ్రెస్ ముందుకు వెళ్తుంటే బీఆర్ఎస్, బిజెపి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని గతంలో బీసీ బిల్లు ఆర్డినెన్స్ను అడ్డుకున్నాయని నరేందర్ రెడ్డి ఆరోపించారు. బీసీలకు అసలైన న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమని, బిజెపి మాత్రం కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. బీసీ బిల్లు ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం తెలపకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని, దీంతో రాష్ట్రపతి దగ్గర అలాగే పెండింగ్లో ఉందని, పంచాయతీరాజ్ చట్ట సవరణకు అసెంబ్లీ ఆమోదం తో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం సుగమం అయిందని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ... పనిచేసే ప్రభుత్వం కాళ్లల్లో కట్టెలు పెట్టకుండా బీసీలకు న్యాయం చేసే అంశంలో బిజెపి, బీఆర్ఎస్ తమతో కలిసి రావాలని కోరారు. బీసీల మీద చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ కు అండగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, సమద్ నవాబ్, గుం0డాటి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ ఖంరోద్దీన్, చర్ల పద్మ, కుర్ర పోచయ్య, శభాన మహమ్మద్, ఆస్థాపురం తిరుమల, సిటీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగాల పోటీ పరీక్షలకు టి-సాట్ ఆన్ లైన్ స్పెషల్ కోచింగ్

- సెప్టెంబర్ ఒకటి నుండి అక్టోబర్ 3 వరకు
- 35 రోజుల పాటు 100 ఎపిసోడ్స్ ఉదయం-సాయంత్రం
- నిపుణ, విద్య ఛానళ్లలో ప్రతి రోజూ ప్రత్యేక ప్రసారాలు
- సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి

**కామారెడ్డి ఆగస్టు 31 (జనంసాక్షి):** (టి.సాట్-సాఫ్ట్ నెట్ ) ప్రభుత్వ ఉద్యోగాలు, పాఠశాల విద్య వంటి అంశాలపై డిజిటల్ కంటెంట్ అందించే టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు బ్యాంకు ఉద్యోగాల పోటీ పరీక్షలకూ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోంది . దేశ వ్యాప్తంగా నిర్వహించే ఐ.బి.పి.ఎస్ పోటీ పరీక్షలకు తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రత్యేక ప్రసారాలు చేసేందుకు షెడ్యూలు ఖరారు చేసింది. టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రసారాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఐబిపిఎస్ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్) ఆధర్వంలో భర్తీ చేసే 10,227 పోస్టులలో తెలంగాణా రాష్ట్రానికి 261, ఆంధ్రప్రదేశ్ కు 367 పోస్టులు మొత్తం 628 ఉద్యోగాలు తెలుగు రాష్ట్రాలకు కేటాయించబడ్డాయన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల యువత పోటీపరీక్షల్లో సముచిత స్థానం సంపాదించాలన్నదే టి-సాట్ లక్ష్యమని, అందుకోసం తెలుగు, ఇంగ్లీష్ లో డిజిటల్ కంటెంట్ అందిస్తున్నామని వేణుగోపాల్ రెడ్డి గుర్తుచేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగే ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన కాంపిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటితో పాటు పజిల్స్, పారా జంబుల్స్ తదితర ప్రధాన సబ్జెక్టులపై డిజిటల్ ప్రసారాలుంటాయని సీఈవో తెలిపారు. సెప్టెంబర్ ఒకటవ తేదీన నిపుణలో సాయంత్రం ఏడు తొమ్మిది గంటల వరకు ఉదయం విద్యలో ఏడు గంటల నుండి తొమ్మిది గంటల ప్రసారమయ్యే డిజిటల్ పాఠ్యాంశాలు అక్టోబర్ మూడవ తేది వరకు 35 రోజుల పాటు 100 ఎపిసోడ్స్ ప్రసారాలు కొనసాగనున్నాయని వేణుగోపాల్ రెడ్డి వివరించారు.



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎన్.ఎం.ఎం.ఎస్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి విద్యార్థుల కోసం ఎం.హెచ్.ఆర్.డి (మినిస్ట్రీ ఆఫ్ హ్యూ మన్ రిసోర్స్ డెవెలప్మెంట్) ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి రాబోయే నవంబర్ లేదా డిసెంబర్ నెలలో నిర్వహించే ఎన్.ఎం.ఎం.ఎస్ (నేషనల్‌మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్) అర్హత పరీక్ష కోసం విద్యార్థుల మేథో సామర్థ్యాన్ని పెంచేందుకు కంటెంట్ అందిస్తున్నా మని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ ఒకటవ తేది నుండి విద్య ఛానల్‌లో ఉదయం 11 నుండి 12 గంటలకు అరగంట నిడివిగల రెండు పాఠ్యాంశ భాగాల చొప్పున 100 ఎపిసోడ్స్ డిసెంబర్ నెలలో నిర్వహించే పరీక్షల వరకు ప్రసారం చేయనున్నా మని, మ్యాట్ అండ్ స్యాట్ కు సంబంధించిన ప్రధాన సబ్జెక్టుల పాఠ్యాంశాలపై డిజిటల్ లెసన్స్ ప్రసార మౌతా యని, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచి ప్రభుత్వం అందించే ఉపకారవేతనానికి అర్హత సాధి ంచేందుకు సిద్ధం కావాలని వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.

# వరి, పత్తి పంటల నష్టంపై వెంటనే సర్వే చేయించాలి

- ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్



**మంథని, (జనంసాక్షి) :** గోదావరి వరదలో మునిగిపోయిన పంటలను వెంటనే సర్వే చేయించి నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం, విలోచరం గ్రామాల్లో గోదావరి నది వరద ఉధృతికి మునిగిన పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పంటలన్నీ వరదపాలు అయ్యాయని మాజీ ఎమ్మెల్యేకు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి నది వరద ఉధృతికి విలోచవరం, పోతారం గ్రామాల్లోని పంట పొలాల్లో ఐదు రోజులుగా నీళ్లు నిలిచి ఉన్నాయన్నారు. వందల ఎకరాల్లో పత్తి పంట మాడిపోగా, వందల ఎకరాల్లో వరి పంట నీటిలో మునిగిపోయిం దన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు మంచిగా ఉంటేనే రాజ్యం మంచిగా ఉంటుందని, ప్రభుత్వం రైతులకు మెరుగైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు.

# బీసీలపై బిజెపి, బిఆర్ఎస్ కపట ప్రేమ

- అసెంబ్లీలో రిజర్వేషన్లపై సై అంటున్న భాజపా కేంద్రాన్ని ఎందుకు ఒప్పించడం లేదు..?
- కులగణనలో కేటీఆర్ కెసిఆర్ ఎందుకు పాల్గొనలేదు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (జనంసాక్షి):** బీసీలపై బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని వారిపై కపట ప్రేమను చూపిస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. 2018 పంచాయతీరాజ్ చట్టం బిల్లు సవరణకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే క్రమంలో అసెంబ్లీలో విప్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వేలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు ఇస్తున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వాన్ని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చండి అంటే ఎందుకు చేర్చడం లేదన్నారు. బీసీలకు ముఖ్య మంత్రి పదవి ఇవ్వాలంటున్న బిజెపి నాయకులు ముందు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడిగా మల్లికార్జున కార్గే, రాష్ట్ర అధ్య క్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉన్న విషయాన్ని గుర్తుంచు కోవాలన్నారు. బీసీ రిజర్వేషన్ల పై అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసు కెళ్ళేందుకు ప్రధానమంత్రి అపాయిం ట్మెంట్ ఐదుసార్లు కోరిన ఇవ్వలేదన్నారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాలు నిర్వహించిన ధర్నాకు బిజెపి, బీఆర్ఎస్ ఎం దుకు హాజరు కాలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వస్తే ఏ పార్టీలో గెలిచిన బీసీ బిడ్డెన చట్టసభల్లోకి వచ్చే అవకాశం ఉంద న్నారు. రిజర్వేషన్లపై ఎందుకు నెగటివ్గా ఆలోచిస్తున్నారని పాజిటి వ్ దృక్పథంతో ముందుకు వెళ్లాలన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం బీసీ బంధు బీసీ బిడ్డలకు ఇవ్వలేదన్నారు. ఓబిసి కార్పొ రేషన్ ఏర్పాటు చేయలేదన్నారు. రాజకీయాల్లోకి తాము పోదలుచు కోలేదని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశంపై మాట్లాడా లన్నారు. బీసీల నోటికాడ బుక్కను లాక్కోవ ద్దని సూచించారు. బిసి సమాజం పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాబినెట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.10 లక్షల సాయం



**ముస్తాబాద్ ఆగస్టు 31 (జనంసాక్షి) :** ఎంపీ లాడ్స్ నిధుల నుండి ఈ మొత్తాన్ని సంబంధిత సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు త్వరలోనే అం దజేయనున్నట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లాలో భారీ ఎత్తున నష్టం సంభవిం చిందన్నారు. రైతులకు పెద్ద ఎత్తున పంట నష్టం సంభ విం చిందని, పలువురు నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపీ లాడ్స్ నిధుల మొత్తాన్ని సిరిసిల్ల జిల్లా బాధితు లను ఆదుకు నేందుకు జిల్లా కలెక్టర్ ద్వా రా ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముస్తాబాద్ మం డల బిజెపి అధ్యక్షులు సౌల క్రాంతి కుమార్ ఎంపీ బండి సంజయ్0కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని మోదీ మన్‌కీ బాత్ వీక్షణ



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి) :** ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ , బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్ ఆరేపల్లి లో స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి వీక్షించారు. ప్రోగ్రాం అనంతరం స్థానిక నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 3 న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ .రామచందర్ రావు కరీంనగర్ జిల్లా పర్యటన విజయవంతం చేయాలని బిజెపి నాయకులకు కార్యకర్తలకు కటకం లోకేష్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొండ సత్య లక్ష్మి గార్డెన్స్ లో జరిగే బూత్ సమ్మేళన సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు , కార్యదర్శి , సోషల్ మీడియా బాధ్యులు తప్పకుండా ఈ సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బత్తిని మహేష్ గౌడ్, బత్తిని రాజశేఖర్, సత్తినేని ప్రభాకర్, భారీ జితేందర్, కొత్తపల్లి వెంకటేష్, నాన్ వినోద్, బత్తిని మురళి, కొత్తపల్లి రాము, సత్తినేని సంతోష్, బత్తిని నరేష్ , శేఖర్,కొత్తపెల్లి మహేష్, పాల్గొన్నారు.

# వెలుగు నింపేందుకే 42 శాతం రిజర్వేషన్లు

- బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

**హైదరాబాద్ ఆగస్టు 31(జనంసాక్షి) :** ఆదివారం నాడు అసెంబ్లీలో రిజర్వేషన్ల కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గానికి తమ హర్షమోదాలు తెలుపుతూ, జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవాలని, బీసీ సమాజానికి కోరుతున్నట్లు బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఆదివారంనాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని సీలింగ్ చేస్తూ చేసిన కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లుఅమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో, రాష్ట్ర మంత్రివర్గానికి, ఏ.ఐ.సి.సి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కి లోక్ సభప్రధాన ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీకి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ కి మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ, అన్ని జిల్లాల వ్యాప్తంగా బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచి సంబరాలు చేసి పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ఈ చారిత్రక ఘట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

ఈ 42 శాతం రిజర్వేషన్లు బీసీ వర్గాలలో, వారి జీవితాలలో వెలుగు నింపుతుంది అనడ ంలో అతిశయోక్తి లేదు అన్నారు. ఈరోజును సువర్ణ అక్షరాలలో లిఖించదగ్గరోజని, ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతున్న నేపద్యంలో బీసీలు సంబరాలు చేసుకోవాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

# ఆరోగ్య శ్రీ సేవలు ఆగిపోవడం బాదాకారం

- నియోజకవర్గంలోని మెట్ పల్లి, కోరుట్ల హాస్పిటల్ సమస్యలు నెరవేర్చలేదు
- ఆశ వర్కర్ల జీతాలు 18000 వెంటనే చేయాలి. ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**మెట్ పల్లి,ఆగస్టు 31,(జనంసాక్షి):** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మెట్ పల్లి, కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రులు జీరో అవర్స్ లో అసెంబ్లీ లో మాట్లాడిన కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివారం పొద్దున నుంచి ఆరోగ్య శ్రీ సేవలు ఆగిపోయాయాని అది బాధాకర మని తెలిపారు.ఎన్నికలప్పుడు ఆరోగ్య శ్రీ ని ఐదు లక్షల నుండి పది లక్షలు చేస్తమని గొప్పలు చెప్పారని కనీసం ఇప్పుడు బిల్లులు కూడా ఇవ్వట్లేదని ఆరోగ్య శాఖ మంత్రి నాకు పూర్తి మద్దతిస్తున్నారని మరి ఎందుకు పనులు జరగట్లేదో అర్థం అవ్వట్లే దని తెలిపారు.ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టేబ్లి లేషన్ యాక్ట్ గురించి మాట్లాడుతున్నా మని ప్రైవేట్ మెడికల్ ట్రీట్మెంట్స్ ఇవ్వడం మానే సిన తర్వాత దాని గురించి ఏం మాట్లాడా లని కనీసం వాళ్ళ బిల్లులు ఇవ్వట్లేదని హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ చేయనప్పుడు ఇవెందుకు మాట్లాడట మన్నారు. మా కోరుట్ల నియోజకవర్గంలో మెట్ పల్లి, కోరుట్ల హాస్పిటల్స్ గురించి ఎన్నిసార్లు మాట్లాడిన ఒక్కటి కూడా నెరవేరలేదని ఇదే సమస్య నేను మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టినప్పటి నుండి చెప్పిన 22 నెలల గడుస్తున్న కనీసం పట్టించుకోవటమే కరువైందన్నారు. మంచం పట్టిన మాన్యం అని చిన్న వయసులో చూశానని మళ్లీ ఇలాంటి న్యూస్ చూడాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు.మెట్ పల్లి హాస్పిటల్ గూర్చి ఆరోగ్యశాఖ మంత్రి కి వివరించాగా వారు వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తెలియజేసి యాక్షన్ తీసుకోమని 75% పూర్తయిందని వెంటనే బిల్లులు అందించి మిగతా పనులు పూర్తి అయ్యే విధంగా చూడలని నా ముందే ఫోన్ చేశారని పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి కుంపు అండ్ కరాటే పోటీలలో మండల వాసుల ప్రతిభ



**కాసిపేట ఆగస్ట్ 31 (జనంసాక్షి):** కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన మంద విశ్వాని, మంద విశ్వతేజ కరాటె అండ్ కుంపులో తమ ప్రతిభ కనబరిచారు. ఆదివారం మందమర్రి కమ్యూని టీహాల్లో రెండవ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ కుంపు అండ్ కరాటే పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి ఏసీపీ రవీందర్, మందమర్రి ఎస్సై రాజశేఖర్ ,గ్రౌండ్ మాస్టర్ వెంకటేష్ పాల్గొన్నారు. మంద విశ్వాని నాలుగవ తరగతి, విశ్వతేజ్ రెండవ తరగతి శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్నారు. ఆదివారం నిర్వహించిన పోటీలలో విశ్వాని ప్రథమ స్థానంలో నిలువగా, విశ్వతేజ్ తృతీయ స్థానంలో నిలిచారు. ఇరువురిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో రవీందర్, పాల్గొన్నారు.

# తొలగిన రైలింగ్.. మెరుగైన మార్గం

- మధురానగర్‌లో వెడల్పుగా మారిన రహదారి
- రహదారి మధ్యలో రైలింగ్ ను తొలగించిన హైడ్రా



**హైదరాబాద్ ఆగస్టు 31(జనంసాక్షి) :** మధురానగర్లో మార్గం మెరుగైంది. దారి మధ్యన వేసిన రైలింగ్ ను హైడ్రా తొలగించడంతో రోడ్డు విశాలంగా మారింది. మధురానగర్ మధ్యన ఒకప్పుడు ఓపెన్ గా వున్న వరద నీటి కాలువను బాక్సు డ్రైన్ గా మార్చారు. కాలువ మీద ఉన్న స్లాబ్ పై రైలింగ్ ఏర్పాటు చేసారు. యిప్పుడు అదే ట్రాఫిక్‌కు అంతరాయంగా మారింది. రైలింగ్ మధ్యలో బైక్స్ పరికించేయడమే కాకుండా.. ఇరువైపులా బైకులు, కార్లు పార్కింగ్ చేయడంతో దారి పొడుగునా రాకపోకలకు ఆటంకంగా మారింది. యిల్లకు, షాప్‌లకు వచ్చిన వాళ్లు పెద్ద సంఖ్యలో వాహనాలు ఇరువైపులా పార్కింగ్ చేయ డంతో విశాలమైన రహదారి ఇరుకుగా మా రిపోయింది. బయట కాలనీ వాళ్ళు కూడా వాహనాలు అక్కడ పార్కింగ్ చేయడం, ట్యాక్సీ వాళ్ళు వాహనాలు అక్కడ నిలపడ ంతో కాలనీ వాసులకు ఆ మార్గంలో వెళ్ళ డం ఇబ్బందిగా మారింది. ఇక పాఠశాల ల వేళ స్కూల్ బస్సులు కూడా ఆ దారిన వెళ్ల లేని పరిస్థితి.

**కాలనీ వాసుల ఫిర్యాదుతో..**

ఈ అవస్థలను దశాబ్దాలుగా భరించిన కాలనీ వాసులు చాలా సార్లు ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయించారు. హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. వాహనాల పార్కింగ్ తో ఇరుకుగా మారిన రహదారి ఫోటోలతో సహా అధికారులకు చూపించారు. ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను గమనించారు. స్లాబ్ దృఢంగా ఉన్నదని నిర్ధారించుకు న్నారు. 5 అడుగుల వెడల్పుతో 900ల మీటర్ల మేర వేసిన రైలింగ్ ను తొల గించడంతో ఇరువైపులా వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేకుండా అయ్యింది.

## వానకాలం పంటలకు రైతులు సర్వే నెంబర్ ప్రకారం పంట నమోదు చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి రవినాథ్

**యాచారం, ఆగస్టు 31 (జనంసాక్షి):** పంటల వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవినాథ్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలో అన్ని గ్రామాల్లోని రైతులు వానాకాలం 2025 పంటలకు గాను సర్వే నెంబర్ ప్రకారం రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల రైతులందరూ మాల్, యాచారం, చౌదర్పల్లి, గున్గల్ నాలుగు క్లస్టర్లలోని ఆయా గ్రామాల రైతులందరూ పంటల నమోదు కోసం ఏఈఓ లను సంప్రదించాలన్నారు. యాచారం క్లస్టర్ లో సంతోష్ కుమార్, 6305920174, గున్గల్ క్లస్టర్ రాధమ్మ, 6305920176, మేడిపల్లి క్లస్టర్ రమేష్ 6305920175, మాల్ క్లస్టర్ లో వసంత 6305920177 నెంబర్లలో ఏఈఓలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సెప్టెంబర్ 31 వరకు పంటల నమోదు కోసం గడువు ఉందని గడువులోగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నిధులు లేక మున్సిపాలిటీలలో అభివృద్ధి అధ్వానం

- అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీష్ బాబు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 31 ( జనంసాక్షి) :** రాష్ట్రంలో మున్సిపాలిటీలకు నిధులు రాక అభివృద్ధి పూర్తిగా కుంటిపడిపోయిందని, అలాగే సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గత 6 నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు అన్నారు. ఆదివారం తెలంగాణ శాసనసభలో ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడారు. మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లు , క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ 2010 బిల్లులపై శాసన సభలో జరిగిన చర్చలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు మున్సిపాలిటీలో కనీస అభివృద్ధి పనులు జరగడంలేదని, అలాగే ఉద్యోగులకు జీతాలు సరిగ్గా రావడంలేదని వాపోయారు. కనీసం మున్సిపాలిటీకి 22 నెలల కాలంలో 22 రూపాయలు కూడా రాలేదని విమర్శించారు. పట్టణంలోని సామాజిక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గత 6 నెలలుగా వేతనాలు తీసుకోక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే మున్సిపాలిటీలకు నిధులను మంజూరు చేసి పనులను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.

# నివేదికల ఆధారంగా పూర్తి సాయం

- భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం
- కామారెడ్డి జిల్లాలోని వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీలు



**కామారెడ్డి ఆగస్టు 31 (జనంసాక్షి):** గత వారం కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. చాలా ప్రాంతాల్లో పంట నష్టం, అస్థి నష్టం జరిగినది, పలు కాలనీలు నీటము నిగాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు, విజయశాంతి, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, శంకర్ నాయక్ జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. నీట మునిగిన పలు కాలనీలు సందర్శించి, బాధితులతో మాట్లాడారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుం టుందని భరోసా కల్పించారు. తక్షణ సాయం ఇప్పటికే అందించామని, ప్రభుత్వానికి నివేదన సమర్పించి, మరింత సాయం అందేలా చూస్తామని తెలిపారు. విపత్కర సమయంలో విపక్షాలు రాజకీయాలు చేయకుండా అందరూ బాధితులకు అండగా నిల వాలని చెప్పారు. అంచనా కంటే అధికమైన వర్షం, వరదలు రావ డంతో ఇబ్బందిగా మారిందని చెప్పారు, నాళాలను, కాలువల ను కబ్జాలు నుంచి కాపాడేందుకు హైదరాబాద్ ఉన్నట్టు...హైడ్రా తరహాలో జిల్లాలోనూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# ఆదివారం హాస్పిటల్‌కు సెలవు

## రోగులకు అందని వైద్య సేవలు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 31 (జనంసాక్షి) :** ప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి హాస్పిటల్ నిర్మించి, ఉద్యోగులకు వేతనాలు ఖర్చు చేస్తుంది. కానీ ఇప్పటికీ వైద్య సిబ్బంది నామ మాత్రంగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా వచ్చామా. .?వెళ్ళామా.. అన్నసందంగా వైద్య సిబ్బంది వ్యవహరిస్తున్నారు. కొమరం భీమ్ ఆసిఫా జిల్లా కాగజ్ నగర్ మండలంలోని ఇస్గాం ( విలేజ్ నెంబర్ 12) లో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు ఆదివారం సెలవుదినంగా కనిపించింది. ఉదయం 11 గంటల సైతం ఆస్పత్రి తెరుచుకోలేదు. అసలే వర్షాకాలం.. ఆపై రోగాల సీజన్. అత్యవసరంగా రోగులు ఎవరైనా ఆసుపత్రికి వస్తే.. పరిస్థితి ఏంటి..? ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఆస్పత్రిలో డాక్టర్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ ఉండి సేవలు అందించాల్సి ఉండగా.. ఈ విధంగా పూర్తిగా ఆసుపత్రి మూసి ఉండడం పట్ల రోగులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని గత సంవత్సరం ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క డాక్టర్లు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. కానీ ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మంత్రుల ఆదేశాలు, కలెక్టర్ల ఆ దేశాలు సైతం బేకాతర్ చేస్తూ ఇక్కడ వైద్య సిబ్బంది వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్త అవుతున్నాయి. ఈ విషయమై జిల్లా ఇన్చార్జి వైద్యాధికారి సీతారాం ను వివరణ కోరెందుకు ప్రయత్నించగా స్పందించలేదు.



ఒకే వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఇద్దరూ సీఈవోలుగా పనిచేస్తున్నారు.. ఒకరు సంఘం సీఈఓ కాగా మరొకరు అధ్యక్షుల అనుమతితో ఇన్చార్జి సిఇఓగా వ్యవహరిస్తున్నారు. ఈ ఇద్దరి సీఈఓల మధ్య రైతులకు తలనొప్పిగా మారింది.ఇక్కడ కోస మెరుపు ఏమిటి అంటే సీఈఓ గా పనిచేస్తున్న వారికి ఎలాంటి అధికారాలు లేకపోవడం.. ఇన్చార్జి సిఈఓ కు చెక్ పవర్ తో పాటు రికార్డు బాధ్యతలు కూడా ఉండడం, సంఘ పరిధిలో ఏమైనా అవకతకలు జరిగితే బాధ్యత అధ్యక్షుడిదా..?అధికారులదా..? ఇద్దరు సీఈఓ లదా..? ఎవరిదని పలువురు చర్చించుకుంటున్నారు.ఇక వివరాల్లోకి వెళితే..

# ఒక పిఏసీఎస్.. ఇద్దరు సీఈఓలు

## కక్షపూరితంగా సీఈవోకు బాధ్యతలు అప్పగించని వైనం

- డిసిఓ ఆదేశాలను ఖాతరు చేయని పిఎసిఎస్ చైర్మన్
- కోర్టు తీర్పులు అమలు చేయని అధికారులు

**వనపర్తి, బ్యూరో ఆగస్టు 31 జనంసాక్షి :** వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఈఓగా పనిచేస్తున్న కే.రవీందర్ ను జీతం ఎక్కువ తీసుకున్నాడని, అతడిని 9 అక్టోబర్ 2020 న ఎలాంటి నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేశారు. దీంతో అతను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీఈఓ లు ఏ విధంగా జీతాలు తీసుకున్నారో అదే విధంగా నేను తీసుకున్నానని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు రవీందర్ ను విధుల్లోకి తీసుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులను సంఘం అధ్యక్షులు ఖాతర్ చేయకుండా మళ్ళీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో మళ్లీ ఈ సమస్య సుప్రీంకోర్టు కు చేరింది. సుప్రీంకోర్టు గత ఏడాది మే 20న రవీందర్ ని సీఈఓగా విధుల్లోకి తీసుకొని సస్పెన్షన్ కాలానికి జీతాన్ని చెల్లిస్తూ బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. సంఘం అధ్యక్షులు సుప్రీంకోర్టు ఆర్డర్ ను పరిగణలోకి తీసుకొని సంఘం సభ్యుల తీర్మానం ద్వారా విధుల్లోకి తీసుకున్నారు.కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదని, జిల్లా కలెక్టర్, డిసిఓ కు కోర్టు ఆర్డర్ తో పాటు వినతి పత్రాలను రవీందర్ అందజేశారు.ఈ నేపథ్యంలో జిల్లా సహకార అధికారి బి.రాణి నాగవరం సింగిల్ విండో అధ్యక్షుడికి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రవీందర్ కు సీఈవోగా బాధ్యతలు, సంఘం రికార్డులు,చెక్ పవర్, అతని సస్పెన్షన్ కాలానికి సంబంధించిన జీతభత్యాలు అందజేసి నివేదిక కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు.ఆదేశాలు అమలు చేయకుండా సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తే తమరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు.కానీ రెండు నెలలు అవుతున్న అధికారులకు ఎటువంటి రిపోర్టులు ఇవ్వకుండా పిఎసిఎస్ అధ్యక్షుడు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఇదే విషయంపై నాగవరం సీఈవో రవీందర్ ను వివరణ కోరగా...విధుల్లోకి తీసుకున్న సీఈవోగా బాధ్యతలు అప్పగించలేదని, చెక్ పవర్ ఇవ్వలేదని, సస్పెన్షన్ కాలానికి రావలసిన జీతభత్యాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కార్యాలయానికి వెళ్తున్న పిఎసిఎస్ అధ్యక్షుడు పని అప్పగించడం లేదని, అయినా కల్పించుకొని పనిచేస్తున్నానని, బాధ్యతలు అప్పగించకుండా ఇంచార్జ్ సీఈవో కృష్ణతో పని చేయించుకుంటూ తనను అవమానానికి గురి చేస్తున్నారని చెప్పారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన సింగిల్ విండో అధ్యక్షుడు పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు.



**ఈ విషయంపై జిల్లా సహకార అధికారి బి. రాణిని వివరణ కోరగా తమ కార్యాలయం నుండి సింగిల్ విండో కార్యాలయానికి రవీందర్ ను విధుల్లోకి తీసుకొని జీతభత్యాలు ఇవ్వాలని, అతనికి పని అప్పగించాలని ఆదేశాలు జారీ చేశామని, లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లెటర్ లో పేర్కొన్నట్లు చెప్పారు. తదుపరి నిర్ణయం సింగిల్ విండో పాలక పక్షం తీసుకోవలసి ఉందని అన్నారు.**

నాగవరం పిఎసిఎస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డిని వివరణ కోరగా సంఘం లో సరిపడా నిధులు లేనందున జీతాలు ఇవ్వలేకపోతున్నామన్నారు. మీరు సస్పెండ్ చేసిన రవీందర్ ను సుప్రీంకోర్టు ఆదేశాలతో సీఈఓ గా విధుల్లోకి తీసుకున్న బాధ్యతలను ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నించగా అందుకు ఆయన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

పిఎసిఎస్ అధ్యక్షులు, సీఈఓ ల మధ్య ఈ వ్యవహారం ముదరడంతో సహకార సంఘానికి నష్టం జరగడంతో పాటు రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని విమర్శలు వస్తున్నాయి. ఇద్దరు కూడా సంఘం అభివృద్ధిని మరిచి వ్యక్తిగతంగా పంతానికి పోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని నాగవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నెలకొన్న ఈ సమస్యను ఓకొలిక్కి తీసుకురావాలని సంఘం పరిధిలోని రైతులు, డైరెక్టర్లు కోరుతున్నారు



నాగవరం పిఎసిఎస్ భవనం





# గుంతల మయమైన రోడ్లు

- రాకపోకలకు ఇబ్బందిగా మారిన రహదారి
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

**మొయినాబాద్ ఆగస్టు 31 జనంసాక్షి :** గుంతల మయమైన రోడ్లు రాకపోకలకు ఇబ్బందిగా మారిన రహదారి పట్టించుకోని అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. శంషాబాద్ మండలం క్యాసారం గ్రామం నుండి జూకల్ వెళ్లే రహదారి పై వెళ్లడానికి స్థానికులు నానా పాట్లు పడుతున్నారు. నిమిషాల్లో వెళ్లాల్సిన దూరం గంటకు పైగా సమయం పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం రిపేట్ చేయకుండా వదిలేశారు. వర్షాల కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రయాణికులు వెళ్లలేకుండా ఇబ్బంది ఏర్పడింది. అధికారులు వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు.

# చేయూత పింఛన్ల పంపిణీలో సాంకేతిక విప్లవం

- సత్వర సేవల కోసం నూతన విధానంలో పెన్షన్ల పంపిణీకి శ్రీకారం
- పోస్ట్ మాస్టర్లకు 5జి మొబైల్ ఫోన్ల అందజేత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సీతక్క
- ఇక నుంచి పారదర్శకంగా వేగవంతంగా పింఛన్ల పంపిణీ



**హైదరాబాద్, ఆగస్టు 31 జనంసాక్షి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పథకంను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, డయాలసిస్ భాదితులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు చేయూత పథకం కింద ప్రభుత్వం అందజేస్తుంది.

ఇప్పటివరకు పింఛన్ దారుల ధృవీకరణ కోసం 2జి ఆధారిత ఫింగర్ ప్రింట్ పరికరాలను వినియోగిస్తున్నారు. ఇప్పుడు వాటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ద్వారా "సరైన వ్యక్తికి %-% సరైన పింఛన్ - సరైన సమయంలో" అందేలా పింఛన్ పంపిణీ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా మారనుంది. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్‌తో 5జి ఆధారిత ఎల్ 1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, కొత్త మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసింది. ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో ఈ పరికరాలను ప్రభుత్వం వినియోగించింది. ఆశించిన ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, పరికరాలు పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ మొబైల్ ఫోన్లు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లాలోని పస్రా కేంద్రంలో ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు పరికరాలను అందజేయనున్నారు.

ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను టిజి ఆన్ లైన్ ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది. కొత్త సాంకేతిక పరిష్కారం వల్ల పింఛన్ దారుల ధృవీకరణ సమయం మూడు సెకన్లకు తగ్గి, పింఛన్లు వేగంగా పంపిణీ అవుతాయి. దీంతో లబ్ధిదారులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వెను వెంటనే తమ పింఛన్లు అందుకుంటారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, వృద్ధులు, వేలిముద్రలు చెరిగిన వారు వంటి వారికి ముఖ గుర్తింపు యాప్ ఎంతో మేలు చేస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఈ పథకం డిజిటల్ రూపాంతరం పొందటం ద్వారా పింఛన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, వేగం పెరిగి పింఛన్ దారులకు సత్వర సేవలు అందుతాయని మంత్రి సీతక్క ప్రకటించారు. పింఛన్దారుల సమస్యల దృష్టిలో పెట్టుకొని ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

## పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళన ప్రోగ్రాంను సక్సెస్ చేయాలి

## బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 31 జనంసాక్షి :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుని హోదాలో మొదటిసారిగా సెప్టెంబర్ 3న కరీంనగర్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న రామచందర్ రావు కు ఘన స్వాగతం పలకాలని, అనంతరం పట్టణంలోని కొండ సత్యలక్ష్మి గార్డెన్స్ లో జరిగే పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల ని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు కరీంనగర్ జిల్లా పర్యటన సందర్భంగా తలపెట్టిన ప్రోగ్రాంలన్నీ సక్సెస్ చేయడానికి బిజెపి శ్రేణులు తగిన కృషి చేయాలని, ఆయా ప్రోగ్రాం ల నిర్వహణ కోసం నియమింపబడ్డ ఇన్చార్జులు తమ తమ బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. బిజెపి పోలింగ్ బూత్ శ్రేణులు, బూత్ సమ్మేళన సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ముఖ్యంగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నిక లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండి, బిజెపి శక్తి చాటి చెప్పాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రధానంగా ఆరు గ్యారెంటీలు, 420 హామీల ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, కోమల ఆంజనేయులు, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట్ రెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, ఎండి ముజీబ్, దురిశెట్టి సంపత్, దూబాల శ్రీనివాస్, దండు కొమురయ్య, పుప్పాల రఘు, గుజ్జ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ లతో పాటు మండల, జోన్ అధ్యక్షులు, ప్రోగ్రాం ఇన్చార్జులు, మోర్చా బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ ఆధ్వర్యంలో "మారం స్వదేశ్ కుమార్ రిటైర్మెంట్ వేడుక"

## తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ మారం జగదీశ్వర్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన, తన అన్న మారం స్వదేశ్ కుమార్ ఉపాధ్యాయ వృత్తిలో 40 సంవత్సరములు సుదీర్ఘమైన సేవలు అందించి ఆదివారం రోజు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవో సంఘం కరీంనగర్ జిల్లా తరపున శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ మాట్లాడుతూ... ఆదివారం రోజు పదవి విరమణ పొందిన సహోద్యోగులందరికీ హృదయపూర్వక అభినం దనలు తెలిపారు. నా కుటుంబ నేపథ్యం, అన్నదమ్ముల అనుబంధం నాకెప్పుడూ ప్రేరణగా నిలిచాయని, ముఖ్యంగా మా అన్న స్వదేశ్ కుమార్, ఒక గొప్ప ప్రభుత్వ ఉపాధ్యాయుడని నా అన్నగానే కాకుండా నాకు గురువుగా, ఆత్మీయ బంధువుగా, మార్గదర్శిగా ఉన్నారని తెలిపారు. మనం దాచుకున్న డబ్బులు సకాలంలో రాకపోవడం, వాటి కోసం ధర్నాలు చేయవలసిన పరిస్థితులు రావడం చాలా దురదృష్టకరమని, తెలంగాణ వచ్చాకా కూడా ఉద్యోగుల బతుకులు ఇంత ఇబ్బందులకు గురవ్వడం బాధాకరమన్నారు. పదవి విరమణ పొందుతున్న సహచర ఉద్యోగులకు మరోసారి శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళి చరణ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొంపూడి శంకర్, కార్యదర్శి సత్యనారాయణ, జగిత్యాల జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, కార్యదర్శి అమరేందర్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి సుదర్శన్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహా స్వామి, సర్దార్ హర్విందర్ సింగ్, ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి, రమేష్ గౌడ్, మహేష్, అజ్జబరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా లింగార్చన

## అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 31 (జనంసాక్షి) :** లింగార్చన నిర్వహణ ద్వారా సకల దోషాల నివారణతో పాటు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి వారి పరివారంతో కలిసి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ బాలిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి గణపతి మండపంలో శ్రీ విఘ్నేశ్వర నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని నిర్వహించినటువంటి శ్రీ మహాలింగార్చన కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా హాజరై సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలనతో పూజా కార్యక్రమాన్ని వేదమంత్రాలు మధ్య శోభయమానంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహాన్ని నింపుతా యని, సమాజానికి నూతన శోభ వస్తుందని తెలుపుతూ నవరాత్రి ఉత్సవాలలో గణపతికి విశేషమైనటువంటి పూజా కార్యక్రమాలను విశేష సంఖ్యలో నిర్వహించడం జరుగుతుందని పూజా కార్యక్రమాలలో భాగంగా స్వామివారికి అత్యంత ఇష్టమైనటువంటి లింగార్చన కార్యక్రమాన్ని దక్షిణ కాశి వేములవాడ రుత్వీకులచే చాలా వైభవ్వేతంగా నిర్వహించడం జరిగిందని వారు చెప్పారు. లింగార్చన కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నిర్వహించడం జరుగుతుందని ఈ సంవత్సరం కూడా స్వామివారి ఆశీస్సులతో చాలా గొప్పగా రెట్టింపైన ఆనందోత్సవాల మధ్య వేడుకగా సాంప్రదాయంగా కార్యక్రమాన్ని నిర్వహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. మట్టితో తయారు చేసినటువంటి 108 లింగాలకు ప్రాణ ప్రతిష్ట చేసి వివిధ ద్రవ్యాలతో, ఫలాలతో, పూలతో, ఫలపంచామృతాలతో ఘనంగా అభిషేకాన్ని నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో, దండలతో అలంకరించి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో భాగంగా సుమారు 30 పైగా నైవేద్యాలను స్వామివారికి మహా నైవేద్యంగా సమర్పించడం జరిగిందని వేడుకలలో భాగంగా రిత్వికులు విద్యార్థులందరిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లాపూర్‌లో ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

**మల్లాపూర్, ఆగస్టు 31 జనంసాక్షి :** గ్రామాల్లో పనిచేస్తున్న ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి చేస్తారనే సమాచారంతో స్థానిక ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు మండల వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశ కార్యకర్తలను ఆదివారం ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు శారద మాట్లాడుతూ ప్రతీ నెల తమకు వేతనం రూ.10 వేల తో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అరెస్టైన వారిలో శిరీష, సరిత, భూదేవి, ప్రేమలత, లావణ్య, స్వప్న, వసంత, లత, మమత, రాజేశ్వరీ, నవ్య, లిఖిత, తదితరులు పాల్గొన్నారు.

# మతిభ్రమించినట్లు మాట్లాడుతున్న పుట్ట మధు

## విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్



**మంథని, (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలతో పుట్ట మధు ఫ్రస్టేషన్ కు లోనై, మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నాడని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ విమర్శించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట క్రాస్ రోడ్డు లోని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని ప్రాంతంలో కట్టిన మూడు బ్యారేజీలతో రైతులకు ఎలాంటి మేలు జరగలేదని అన్నారు. బ్యారేజీల నిర్మాణంతో భారీ వర్షాలు, వరదల వల్ల వరద పోటు కమ్మి బ్యాక్ వాటర్ తో పంట పొలాలు మునిగిపోతున్నాయని దీనికి కారణం మీరు కాదా..? అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రోజుకు 20 గంటలు పైగా పనిచేస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ఉన్నత స్థానంలో నిలుపాలనే ఆకాంక్షతో ముందుకు సాగుతున్న మంత్రి శ్రీధర్ బాబుపై పుట్ట మధు ఇకనైనా చౌకబారు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపు, తీగల సమ్మయ్య, చిందం మహేష్, కాటం సత్యం, ఎరుకల బాబురావు, కెక్కర్ల స్వరూప, పుల్లెల కొమరయ్య, పుల్లెల సతీష్, కలవేన శ్రీకాంత్, మాటేటి రవి, శ్రీధర్ తో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అనురాగాన్ని పంచిన హైదరాబాద్

- గ్రేటర్‌లోని అన్ని జోన్లలో దత్తత మేళా నిర్వహిస్తాం
- జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్



**హైదరాబాద్, ఆగస్టు 31 జనంసాక్షి :** ప్రభాకరుని రాకతో ప్రజ్వలిస్తున్న లేలేత బంగారు కిరణాలు భూమాతను తాకుతున్న శుభోదయానా కాసు బ్రహ్మానంద రెడ్డి పార్క్ లో ఆదివారం ఎప్పటిలాగే పక్షుల కిలకిల రావాలు, ప్రకృతి పరిమళాలతో పాటు, చిన్నచిన్న పాదాలతో, అమాయక చూపులతో దేశీ కుక్క పిల్లలు ఓ ప్రేమగల ఆత్మీయ ఇంటి కోసం ఎదురు చూస్తున్న సరికొత్త దృశ్యాలు ఆవిష్కృతం అయ్యాయి. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండీ పప్పీ మేళా మానవతా భావనకు అద్దం పట్టిన వేడుకలో కనిపించగా ప్రజలను ఆలోచింపజేశాయి. "బివి హీరో, అడాప్ట్, డోంట్ షాప్" అనే హృదయాన్ని హత్తుకునే నినాదంతో, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఈ ఇండీ పప్పీ దత్తత మేళాను ప్రారంభించారు. ఈ దత్తత మేళాలో వాక్సినేషన్ పూర్తి చేసుకుని పూర్తి ఆరోగ్యంగా ప్రేమతో నిండినవి 35 మంది దేశీ కుక్క పిల్లలను ప్రజల ముందు ప్రదర్శనకు జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం ఉంచింది. అందులో 22 పప్పీలు ప్రేమతో కూడిన కుటుంబాల్లోకి అడుగుపెట్టాయి. ప్రతి దత్తత ఒక మౌన విప్లవం, ఒక ప్రేమపూరిత వాగ్దానం సూచికగా నిలిచింది. "దత్తత అంటే కేవలం స్వీకరణ కాదు ఆత్మీయత, బాధ్యత, ప్రేమతో కూడిన బంధం," అని కమిషనర్ ఆర్ వి కర్ణన్ పేర్కొన్నారు. షేక్ పేట నివాసి చింతకుంట రాజుకు మొదటి పప్పీని స్వయంగా కమిషనర్ అందజేసి అభినందించారు. దేశీ కుక్కల ప్రత్యేకతలను, విశేషాలను కమిషనర్ ఆర్‌వి కర్ణన్ వివరించారు. వీటి సహజ శక్తి, తెలివితేటలు, తక్కువ నిర్వహణ అవసరం, స్థానిక వాతావరణానికి సులభంగా అలవాటు పడతాయని చెప్పారు. వీధి కుక్కల సంఖ్యను తగ్గించడమే కాకుండా, వాటికి సురక్షితమైన జీవితాన్ని కూడా కల్పించడమే లక్ష్యంగా ఈ మేళాలను జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆర్‌వి కర్ణన్ తెలిపారు. ఈ మేళా ద్వారా, నగర ప్రజలు మానవత్వం చాటి, వీధి కుక్కలపై తమ ప్రేమను, బాధ్యతను ప్రదర్శించారనీ కొనియాడారు. ఈ కార్యక్రమం ద్వారా వీధి కుక్కల పట్ల అవగాహన పెరిగి, వాటిని దత్తత తీసుకోవడానికి ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ ప్రత్యేకంగా చొరవ తీసుకుని కుక్క పిల్లలదత్తత మేళా ఏర్పాటు పట్ల మేళా లో జీహెచ్‌ఎంసీనీ జంతు ప్రేమికుల ప్రశంసించారు. కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ మేళాలు మిగతా పురపాలికలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
1 సెప్టెంబర్ 2025

# 3 రోజులుగా కత్తులతో పొడుచుకున్న భార్యాభర్తలు

- భర్త మృతి, గాయాలతో భార్య
- సంతానం లేకపోవడం, అప్పులు పెరగడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న దంపతులు

హైదరాబాద్ (జనంసాక్షి) : ఈ మధ్యకాలంలో విభిన్న కోణాల్లో హత్యలు జరుగుతున్నాయి. ముఖ్యంగా భార్యభర్తల మధ్య జరుగుతున్న గొడవలు, వివాహేతర సంబంధాలు వంటివే ఎక్కువగా హత్యలకు దారి తీస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో ఒళ్లు గగుర్పొడిచే ఘటన వెలుగు చూసింది. అప్పుల బాధలు పెరిగిపోవడంతో చనిపోవాలని నిర్ణయించుకున్న దంపతులు మూడు రోజులుగా శరీరంపై కత్తితో గాయాలు చేసుకున్నారు. చివరకు తీవ్ర రక్తస్రావంతో భర్త మరణించగా, భార్య కొనఊపిరితో బయటపడింది. చివరి నిమిషంలో డయల్100కు ఫోన్ చేయడంతో ప్రాణాలు దక్కాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కొల్లిపర మండలం మున్నంగికి చెందిన రామకృష్ణారెడ్డి (45), రమ్యకృష్ణ (38)లకు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్లుగా వీరు కేపీహెచ్‌బీ కాలనీ ఆరో ఫేజ్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇప్పటివరకూ సంతానం లేదు. రామకృష్ణారెడ్డి గతంలో రెస్టారెంట్? పెట్టి అప్పుల పాలయ్యాడు. దాంతో పాటు కరోనా సమయంలో మహమ్మారి సోకడంతో రూ.20 లక్షలు అప్పు చేసి చికిత్స తీసుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. మూడు నెలల నుంచి రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడం, వివాహమై 17 ఏళ్లయినా సంతానం లేకపోవడంతో విసిగిపోయిన దంపతులు 3 రోజులు క్రితం ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి ఇంట్లో ఉండే కూరగాయల కత్తితో ఇద్దరూ ఒకేలా చేతులు, గొంతు, పొట్టపై కోసుకున్నారు. శుక్రవారం భార్య రమ్యకృష్ణ భర్త రామకృష్ణారెడ్డి మెడ కోయగా, తీవ్ర రక్తస్రావంతో అతడు మరణించాడు. చివరి నిమిషంలో రమ్యకృష్ణ మనసు మార్చుకుంది. ఆత్మహత్య నిర్ణయాన్ని విరమించుకుని, శనివారం రోజున డయల్ 100కు కాల్ చేసింది. దాంతోపాటు అడ్డగుట్టలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ చేసి మొత్తం విషయం చెప్పింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలతో పడి ఉన్న రమ్యకృష్ణను ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు చికిత్స పొందుతుండగా, ఆమె నుంచి పోలీసులు వివరాలను సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భర్త రామకృష్ణారెడ్డి శుక్రవారమే మరణించినా, మృతదేహంతోనే రమ్యకృష్ణ ఒంటరిగా ఎలా ఉందని అనుమానిస్తున్నారు. ఇదే విషయంపై శనివారం ఆమెతో మాట్లాడినప్పుడు భిన్న సమాధానాలు వచ్చాయని పోలీసులు తెలిపారు. భర్తను పొడిచి తాను కోసుకున్నట్లు ముందుగా చెప్పిన రమ్యకృష్ణ, ఆ తర్వాత మధ్యాహ్నం మాట మార్చింది. భర్త రామకృష్ణారెడ్డి కత్తితో పొడుచుకుని, తననూ కోశాడని తెలిపింది. ఇద్దరూ కలిసి ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నా భర్త చనిపోవడం, భార్య బతికి ఉండటంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు.

# పెద్దధన్వాడలో మళ్లీ అరెస్టులు



## గ్రామానికి వెళ్తున్నవారిని నిత్యం అడ్డుకుంటున్న పోలీసులు

- పరామర్శకు వెళ్తున్న ప్రజాసంఘాల నేతలు అరెస్టు
- అరెస్టులను ఖండించిన శాంతిచర్చల కమిటీ
- ఇథనాల్ వ్యతిరేక పోరాటానికి మద్దతుగా ఉంటామని వెల్లడి
- ఫ్యాక్టరీ రద్దుచేసేదాకా ఇక పోరాటమే : ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ



రాజోలి/హైదరాబాద్, ఆగస్ట్ 31 (జనంసాక్షి) : ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఏడాదికాలంగా పోరాడుతున్న పెద్దధన్వాడ గ్రామంలో పోలీసుల నిర్బంధం కొనసాగుతోంది. ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో ఏ చిన్న అంశంపై కదలికలొస్తున్నప్పటికీ పోలీసులు నిర్బంధిస్తున్నారు. ఆదివారం రోజున బాధిత గ్రామాల రైతులను కలిసేందుకు హైదరాబాద్ నుంచి పెద్దధన్వాడకు వెళ్తున్న టిపి జాక్ కన్వీనర్ కన్నెగంటి రవి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ స్వామిదాసు, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆలిండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, సామా జిక కార్యకర్త రాజగోపాల్‌లను పోలీసులు మార్గమధ్యలో అరెస్టు చేశారు. శాంతినగర్ పీఎస్‌కు తరలించి, స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా పెద్దధన్వాడ ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ తీవ్రంగా స్పందించింది. మూడు రోజుల క్రితం రాజకీయ నాయకులొస్తే పోలీసులు భారీ బందోబస్తు కల్పించారని, ప్రజలను కలిసేందుకు వస్తున్న ప్రజాసంఘాల నాయకులను మాత్రం అరెస్టు చేస్తున్నారని మండిపడింది. బాధిత ప్రజలను పరామర్శించేందుకు రావడం కూడా తప్పేనా..? ఇదేం న్యాయమంటూ ప్రశ్నించింది. ఇకపై ఇథనాల్ వ్యతిరేక పోరాటం ఉధృతమవుతుందని, ఫ్యాక్టరీ రద్దయ్యే వరకు ఉద్యమం ఆగబోదని హెచ్చరించింది.

### శాంతిచర్చల కమిటీ సంఘీభావం

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటానికి శాంతి చర్చల కమిటీ సంఘీభావం తెలిపింది. ప్రజాసంఘాల నేతల అరెస్టులను ఖండించింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన శాంతి చర్చల కమిటీలో తీర్మానించారు. శాంతియుతంగా ప్రజలు పోరాటం చేస్తుంటే పోలీసులు నిర్బంధం కొనసాగించడం అప్రజాస్వామికమని పేర్కొ న్నారు. భవిష్యత్తులో ఇథనాల్ వ్యతిరేకంగా కొనసాగబోయే ఉద్యమాలకు శాంతి చర్చల కమిటీ మద్దతుగా ఉంటుందని, ప్రజలతో కలిసి ఉద్యమంలో ముందుకెళ్తుందని ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ ప్రకటించారు.

# హైదరాబాద్ జూపార్క్‌లో నైట్ సఫారీ

- సింగపూర్ తరహాలో ఏర్పాటుకు సన్నాహాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : సింగపూర్‌లోని నైట్ సఫారీ టీమ్ హైదరాబాద్‌కు రాబోతోంది. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో ఇప్పటికే అధికారులు ఆ దేశానికి వెళ్లొచ్చారు. అక్కడి వసతులను పరిశీలించి నిపుణులతో చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సింగపూర్ బృందం సాంకేతిక సహాయం అందించనుంది. సఫారీ కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించిన తర్వాత తదుపరి ప్రక్రియలను పూర్తి చేయనున్నారు. సింగపూర్‌లోని బృందం త్వరలో హైదరాబాద్ జూ పార్కును సందర్శించనుంది. హైదరాబాద్‌లో సఫారీని ఎలా ఏర్పాటు చేయాలనే దానిపై అవగాహన కలిగిస్తారు. ఈ నైట్ సఫారీని రాబోయే రెండేళ్లలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దేశంలో జంతు ప్రదర్శనశాలల ఆధ్వర్యంలో ఇలాంటి సఫారీలు ఇప్పటివరకు లేవు.

సఫారీ పార్కు అంటే జంతువులు బయట తిరుగుతాయి. పార్కుకు వచ్చిన సందర్శకులు వాహనంలో వెళ్లి లోపలి నుంచే ఆ జంతువులను చూస్తారు. దేశంలో ఎక్కడా లయన్ సఫారీ లేదు. మన దేశంలో 1974లోనే మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు రాత్రి పూట సఫారీపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు క్యూరేటర్ జె. వసంత పేర్కొన్నారు. అలాగే నెహ్రూ జూ పార్కులో నాలుగు రకాల సఫారీలున్నాయని వివరించారు. ప్రస్తుతం రెండు ఆడ సింహాలు, ఓ మగ సింహంతో సింహం సఫారీ, ఓ జత పులులతో టైగర్ సఫారీ, ఏడు అడవి దున్నలతో బైసన్ సఫారీ, రెండు ఎలుగు బంట్లతో బేర్ సఫారీ ఉన్నాయి. ఇప్పుడున్న సఫారీ పార్కులోనే నైట్ సఫారీని ప్రారంభించాలా, నిశాచర జీవులతో మరింత కొత్తగా అభివృద్ధి చేయాలా అనే విషయమై ప్రతిపాదనలు రూపొందించామని రాష్ట్ర జూ పార్కుల సంచాలకులు సునీల్ హీరేమత్ తెలిపారు. వీటి కోసం కొత్త ప్రాంతాన్ని ఎంపిక చేసి, అందులో ప్రపంచస్థాయి ప్రమాణాలు కలిగిన సఫారీ పార్కును తీర్చిదిద్దేందుకు సర్కారు ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. నగరంలో జూ పార్కును దేశానికి నమూనాలా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. పిల్లి జాతికి చెందిన అడవి పిల్లులు, లియోపర్డ్ క్యాట్, ఫిషింగ్ క్యాట్, రస్టీ స్పాటెడ్ క్యాట్, కరాకల్ వంటి 1500ల జంతువులు, ఫెన్నిక్ ఫాక్స్, ఇండియన్ ఫాక్స్, గోల్డెన్ జాకల్ వంటి నక్కజాతి 450 జంతువులు, మూడ రకాల 600 పునుగు పిల్లులు, 3 రకాల 300 గబ్బిలాలు, 5 రకాల 1500 గుడ్లగూబలు, నిప్పుకోడి, రియా, ఈము, కసోరి వంటి రెండు వేల పక్షులను, సరిసృపాలు, అలాగే ఇతరత్రా జీవ జాతులతో నైట్ సఫారీ పార్కును తీర్చిదిద్దాలన్నది ప్రణాళిక.

ప్రపంచంలోనే మొట్టమొదటి నైట్ సఫారీ సింగపూర్‌లో ఉంది. దీనిని 1994లో ప్రారంభించారు. చీకటి పడిన తర్వాత జంతువుల సహజ ప్రవర్తనను వాటి సహజ ఆవాసాలలో చూసే అవకాశాన్ని పొందుతారు. ఇది సందర్శకులకు ఒక ప్రత్యేకమైన అనుభవాన్ని అందిస్తుంది. ఈ పార్కులో 130 కంటే ఎక్కువ జాతులకు చెందిన 2500 జంతువులు ఉన్నాయి. ఇలా నైట్? సఫారీ ఏర్పాటు చేయడం ద్వారా వాటి సహజ వాతావరణంలో స్వేచ్ఛగా తిరిగేలా చేస్తారు.

# మంచిర్యాల నుంచి 3 గంటల్లోనే హైదరాబాద్‌కు..

- మంచిర్యాల-సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైళ్లు
- కాగజ్‌నగర్, మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటన



మంచిర్యాల ప్రతినిధి (జనంసాక్షి) : ఏ గ్రేడ్ రైల్వేస్టేషన్‌గా గుర్తింపు పొందిన మంచిర్యాలలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలపై సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. గత సంవత్సరం సెప్టెంబరులో సికింద్రాబాద్ – నాగ్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మొదలైంది. ఈ రైలును మంచిర్యాలలో నిలుపుదల చేయాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాలు పలుమార్లు రైల్వే ఉన్నత అధికారులతో పాటు ఎంపీ వంశీకృష్ణ లోక్‌సభలో ప్రస్తావించారు. ఈ విషయంపై స్పందించిన రైల్వే శాఖ ఎట్టకేలకు శనివారం కాగజ్‌నగర్, మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఉత్తర్వులతో జిల్లాతో పాటు, కుమురం భీం జిల్లా ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆర్థికపరంగా డిమాండ్ ఉంటుంది : వందేభారత్ రైలు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలుపుదలకు అవకాశం కల్పించినప్పటికీ ప్రయాణికుల సంఖ్య, ఆదాయాన్ని పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి మంచిర్యాల రైల్వేస్టేషన్ ఆదాయం రోజుకు రూ.4.5 లక్షలు, ప్రయాణికుల సంఖ్య 4,000. వీటిలో ముఖగా మంచిర్యాల నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించేవారే ఎక్కువ. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడినపుంచి వ్యాపారపరంగా అభివృద్ధి చెందింది. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలు, అధికారుల రాకపోకలు పెరిగాయి. రోజువారీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ టికెట్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో వందేభారత్‌కు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆర్థికపరంగా డిమాండ్ ఉంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మంచిర్యాల నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు ప్రతి రోజు ఉదయం 5 గంటలకు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉంది. తరువాత మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటర్‌సిటీ, మధ్యాహ్నం 3.40 గంటలకు కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉంటుంది. ఉదయం 5 గంటలకు తరువాత రాష్ట్ర రాజధానికి వెళ్లాలని అనుకుంటే రోడ్డు మార్గం ఒక్కటే దిక్కు. హైదరాబాద్‌కు వెళ్లినా ఉదయం 11 గంటలకు చేరుకుంటాము. బస్సు మార్గంలో 5 గంటలకుపైగానే టైం పడుతోంది. ఫలితంగా ప్రయాణికులు ప్రైవేట్ సంస్థ వాహనాలతో పాటు ఆర్టీసీ వాహనాలైన లహరి, గరుడ, ఇంద్ర బస్సులను సంప్రదిస్తున్నారు. వీటికి టికెట్ ధర ఒక్కరికి రూ.600 నుంచి రూ.900 వరకు ఉంటుంది. వందేభారత్ రైలు అందుబాటులోకి రావడంతో మంచిర్యాల జిల్లావాసులకు హైదరాబాద్‌కు కేవలం 3 గంటల్లోనే చేరుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ వందేభారత్ రైలు వారంలో మంగళవారం మినహా అన్ని రోజుల్లో నడుస్తుంది. రోజూ నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ రైలు మంచిర్యాలకు ఉదయం 9 గంటలకు రానుంది. మధ్యాహ్నం 12.35 వరకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలయ్యే ఈ రైలు మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 03.30 గంటలకు చేరుకుంటోంది. ఇక టికెట్ ధరలు ఇప్పటికీ నిర్దేశించకపోయినా మంచిర్యాల నుంచి సికింద్రాబాద్‌కు రూ.850, మంచిర్యాల నుంచి నాగ్‌పూర్‌కు రూ.800 ఉంటుందని ఓ అంచనా. వందేభారత్ రైలు మంచిర్యాలలో నిలుపుదల కార్యరూపం దాల్చడానికి మరికొంత టైం పట్టనుంది.



# అనాథగా అప్పడే పుట్టిన పసికందు

- మానవత్వం చాటుకున్న వైద్య సిబ్బంది..!

మునగాల (జనంసాక్షి) : మునగాల మండలం తిమ్మారెడ్డి గూడెంలో అమ్మతనానికి మచ్చ తెచ్చే ఘటన చోటు చేసుకుంది. నవమాసాలు కడుపున మోసిన బిడ్డను ఆ తల్లి ఎందుకనో అక్కర్లేదు అనుకుంది. అప్పుడే పుట్టిన పసికందును ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవాల్సిన ఆమె నిర్దయగా.. ఆదివారం ఓ వీధిలోని గాబులో విడిచిపెట్టి వెళ్లిపోయింది. కొద్ది సేపటికి ఆ వీధిలో ఆడుకుంటున్న పిల్లలకు పసికందు ఏడుపు వినపించింది. దాంతో, వాళ్లు పక్కనే ఉన్న నీళ్లు లేని గాబులో చూడగా చంటిబిడ్డ కనిపించింది.

ఆ పిల్లలు పరుగున వెళ్లి.. చుట్టుపక్కల మహిళలకు సమాచారం ఇచ్చారు. వారంతా వచ్చి ఆ పసికందును అక్కున చేర్చుకున్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. అక్కడికి చేరుకున్న ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది సదరు శిశువును సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బిడ్డ ఆరోగ్యంగానే ఉందని వైద్యులు వెల్లడించారు. అయితే.. ఆ చంటిబిడ్డను తల్లిదండ్రులు ఎందుకు అలా వదిలేసి వెళ్లారు? అనేది తెలియాల్సి ఉంది.

# దయనీయంగా వరద బాధిత గ్రామాలు

- గోదావరి పరివాహక ప్రాంతాల్లో స్తంభించిన జనజీవనం



నిజామాబాద్ (జనంసాక్షి) : ఏకధాటిగా కురిసిన వర్షాలతో నిజామాబాద్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. వరదలో మునిగిన గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది. ఎటు చూసినా బురద, తడిచిన నిత్యావసరాలతో అవస్థలు పడుతున్నారు. రహదారులు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు కొట్టుకు పోవడంతో కరెంట్ సరఫరా లేక చీకట్లో మగ్గుతున్నారు. వరద ధాటికి మిషన్ భగీరథ పైపులు విరిగిపోవడంతో తాగునీటి సరఫరా ఆగిపోయి ప్రజలు అల్లాడుతున్నారు. పరిహారం అందించడంతో పాటు ప్రభుత్వం వేగంగా మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

నిజామాబాద్ జిల్లాలో ముంపు బాధితులు అవస్థలు పడుతున్నారు. ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల్లో వరద బీభత్సం సృష్టించింది. ధర్పల్లి మండలంలోని కప్పలవాగు ఎన్నడూ లేనంతగా ఉగ్రరూపం దాల్చడంతో ముత్యాలమ్మ చెరువుకట్ట తెగి పలు గ్రామాలను వరద అతలాకుతలం చేసింది. వాడి, బీరప్పతండా, నడిమి తండా, లక్ష్మీతండాలను క్షణాల్లోనే వరద చుట్టుముట్టడంతో కట్టుబట్టలతో బయటకు వెళ్లారు. వరద తగ్గాక తమ ఊరిని, ఇంటిని చూస్తూ గుండెలు బాదుకుంటున్నారు. ఎటు చూసినా బురద నిత్యావసరాలు తడిసి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సిరికొండ మండలం కొండూరులో వరద తగ్గిన అనంతరం ఇళ్లలోని బురదను శుభ్రం చేసుకునేందుకు గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వం కోల్పోయామంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్పల్లి, సిరికొండ మండలాల్లో ముత్యాలవాగు తెగిపోవడంతో రహదారులు కోతకు గురై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పొట్ట దశలో ఉన్న పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి పూర్తిగా పెట్టి నిండా నీట మునిగామని రోదిస్తున్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

రెంజల్, బోధన్, నవీపేట మండలాల్లో పలు గ్రామాలు ఇంకా వరద గుప్పిట చిక్కుకుని ఉన్నాయి. జలదిగ్బంధంలో చిక్కుకున్న మిట్టపూర్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ వీడియో పంపారు. గర్భిణీలు, చిన్నారులు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నా బోటు ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బోటు ఏర్పాటు చేసి తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రాధేయపడుతున్నారు. వరదల కారణంగా ఇంట్లో మొత్తం నీరు నిండిపోయింది. దీంతో తమ ఇళ్లలోని వస్తువులు, బట్టలు, నిత్యావసర సరుకులు అన్నీ బురదమయం అయ్యాయని బాధితులు అంటున్నారు. వరద వచ్చే సమయంలో ఏంచెయ్యాలో తెలియక ఇంటి మేడపై ఎక్కి సాయం కోసం ఎదురుచూశామని చెబుతున్నారు. వేసుకోడానికి బట్టలు కూడా లేని పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. తినడానికి తిండి, తాగడానికి నీరు కూడా లేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370